పేజీలు :12
వేల :5/-

# మీడియా టుడే

జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com

CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 సంచిక : 148 CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) శనివారం 29-8-2026 పేజీలు 12 వేల 5/-

## తమిళనాడు గవర్నర్‌గా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎంకు కీలక బాధ్యత
- రాజకీయ అనుభవానికి గుర్తింపుగా నియామకం
- రాష్ట్రపతి ఉత్తర్వులతో నియామక ప్రకటన
- పలువురు నేతల అభినందనలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 29 : మీడియా టుడే**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని తమిళనాడు గవర్నర్‌గా నియమించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదంతో ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కిరణ్‌కుమార్ రెడ్డికి దేశంలోని కీలక రాష్ట్రాల్లో ఒకటైన తమిళనాడుకు గవర్నర్ బాధ్యతలు అప్పగించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చివరి ముఖ్యమంత్రిగా సేవలందించారు. శాసనసభ స్పీకర్‌గా, మంత్రిగా, ఎమ్మెల్యేగా వివిధ బాధ్యతలు నిర్వహించిన ఆయనకు పరిపాలనా వ్యవహారాలపై విస్తృత అనుభవం ఉంది. రాష్ట్ర విభజన సమయంలో ముఖ్యమంత్రిగా కీలక పరిణామాలను ఎదుర్కొన్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. గవర్నర్‌గా రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉండగా, కేంద్రం ఆయన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, శాసనసభ, రాజ్‌భవన్ మధ్య సమన్వయం సాధించడంలో ఆయన అనుభవం ఉపయోగపడుతుందని అభిప్రాయ పడుతున్నారు. కిరణ్‌కుమార్ రెడ్డి నియామకాన్ని పలువురు రాజకీయ నాయకులు స్వాగతించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన ఆయనకు గవర్నర్ పదవి దక్కడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఆయనకు ఉన్న అనుభవం తమిళనాడు రాష్ట్రానికి ఉపయోగపడుతుందని అభినందనలు తెలియజేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ నాయకుడిగా ఎదిగారు. అనంతరం జాతీయ రాజకీయాల్లో కూడా చురుకైన పాత్ర పోషించారు. వివిధ దశల్లో ప్రజాప్రతినిధిగా, పరిపాలకుడిగా ఆయన సేవలు అందించారు. తమిళనాడు గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న కిరణ్‌కుమార్ రెడ్డి త్వరలోనే రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన నియామకంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన మరో ప్రముఖ నాయకుడు రాజ్యాంగబద్ధమైన కీలక పదవిని అధిష్టించనున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# రాష్ట్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

**3న అధిష్ఠానంతో సీఎం, డిప్యూటీ, పీసీసీ చీఫ్ భేటీ**
**మంత్రివర్గం, పార్టీ వ్యవహారాలపైనా చర్చించే చాన్స్**
**1న విదేశీ పర్యటన నుంచి రానున్న కేసీ వేణుగోపాల్**
**కష్టపడి అధికారంలోకి తెచ్చి.. పదవులిచ్చి గౌరవిస్తే**
**ఇంట్లో ఉన్న పిల్లలతో ఇష్టం వచ్చినట్లు తిట్టిస్తారా?**
**సన్నిహితుల వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన!**



**హైదరాబాద్, ఆగస్టు 29 : మీడియా టుడే**
తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ వేడి మరింత పెరుగుతోంది. ఓవైపు మంత్రి కొండా సురేఖ వ్యవహారం క్రమశిక్షణ కమిటీ నుంచి ఏఐసీసీ వద్దకు చేరి ఉత్కంఠ రేపుతుండగా, మరోవైపు పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబరు 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఢిల్లీకి రావాల్సిందిగా అధిష్ఠానం కోరినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విదేశీ పర్యటనలో ఉన్న ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ సెప్టెంబరు 1న ఢిల్లీకి తిరిగి రానున్నట్లు, అనంతరం ఈ వ్యవహారాలపై దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. మూడో తేదీన జరగనున్న చర్చల్లో కొండా సురేఖ వ్యవహారంతోపాటు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కూడా కీలక నిర్ణయాల దిశగా కసరత్తు జరగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఓట్ల తొలగింపుపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన..

### సీఈసీకి లేఖ



**హైదరాబాద్, ఆగస్టు 29 :మీడియా టుడే**
తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపుపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన సమగ్ర పరిశీలన అవసరమని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. జా×= ప్రక్రియలో భాగంగా ఓటర్ల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించేందుకు ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని పేర్కొన్నారు. గడువును మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని కోరారు. వలస కూలీలు, రోజువారీ కూలీలు.. తమ ఓటు హక్కు వివరాలను పరిశీలించుకునేందుకు, అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అదనపు సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నందున అదనపు సిబ్బంది అవసరమని సూచించారు. ఈ మూడు ప్రాంతాల్లో అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. జా×= ప్రక్రియను వికేంద్రీకరించాలని సీఈసీకి రాసిన లేఖలో రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## సీజనల్ వ్యాధులను తేలికగా తీసుకోవద్దు

### మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, ఆగస్టు 29: మీడియా టుడే**
సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈరోజు(శనివారం) రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో సీజన్ వ్యాధుల పరిస్థితిపై ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. గతేడాదితో పోలిస్తే డయేరియా, డిసెంట్రీ కేసులు కూడా తక్కువగా నమోదు అయినట్లు తెలిపారు. టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును పర్యవేక్షించి.. అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఐఎల్ఐ, స్వైన్‌ఫ్లూ కేసులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐఎల్ఐ కేసులపై రోజువారీగా పర్యవేక్షించాలని రాజనర్సింహ తెలిపారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా పూర్తిగా నియంత్రణలోనే ఉందని మంత్రికి అధికారులు వివరించారు. దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్ కొనసాగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కంటే.. ముందస్తు నివారణే లక్ష్యమన్నారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.

## అది అంటరానితనానికి మరో రూపం

### బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ ఆగ్రహం..



**ఉత్తరాఖండ్, ఆగస్టు 29:**
ఉత్తరాఖండ్ 'శుద్ధీకరణ' ఘటనను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. భారతీయ జనతాపార్టీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశంలో అస్పృశ్యతను చట్టబద్ధంగా నిషేధించారని, మల్లికార్జున ఖర్గే దళితుడనే కారణంతో ఇలా మైదానాన్ని శుద్ధి చేయడం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని రాహుల్ పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'శుద్ధీకరణ' సమాజంలో ఇంకా బతికే ఉన్న అంటరానితనానికి మరో పేరని ఆయన వ్యాఖ్యానించారు. శుద్ధీకరణ పూజను నిర్వహించిన వారిపై, దీనికి మద్దతు ఇచ్చిన ఉత్తరాఖండ్ స్థానిక బీజేపీ నేతలపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులు సమాజంలో ఎదగడం, గౌరవంగా బతకడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదని, ఈ ఘటన వారి కులవివక్ష భావజాలాన్ని స్పష్టం చేస్తోందని మండిపడ్డారు. ఆగస్టు 8వ తేదీన హల్ద్వానీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ఖర్గే ర్యాలీ ముగిసిన రెండు రోజుల తర్వాత 'శ్రీరామ్ సేన' అనే స్థానిక సంస్థ ఆ మైదానంలో గంగాజలం చల్లి, హవనం (పూజ) నిర్వహించి మైదానాన్ని 'శుద్ధి' చేసింది. దీంతో వివాదం మొదలైంది.

## పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీపై కేసు నమోదు



**పశ్చిమ బెంగాల్, ఆగస్టు 29 : మీడియా టుడే**
పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేసు నమోదైంది. తృణమూల్ ఛాత్ర పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కోల్‌కతా హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ కోల్‌కోతా పోలీసులు శనివారం సుమోటాగా మమతా బెనర్జీపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హేస్టింగ్స్ పోలీస్ స్టేషన్‌లో మమతతో పాటు తృణమూల్ ఛాత్ర పరిషత్ కార్యక్రమ నిర్వాహకులపై కూడా కేసు నమోదు చేశారు. పోలీసులు చెబుతున్న దాని ప్రకారం.. సెంట్రల్ కోల్‌కతాలోని 'క్యాథెడ్రల్ రోడ్'లో కేవలం ఒక వైపు మాత్రమే సభ నిర్వహించుకోవాలని, రెండో వైపు వాహనాల రాకపోకల కోసం ఖాళీగా ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. కానీ, టీఎంసీ కార్యకర్తలు రోడ్డు మొత్తాన్ని ఆక్రమించడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నిర్వాహకులు కోర్టు నిర్దేశించిన సమయం కంటే ఎక్కువ సేపు ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. సభలో పాల్గొన్న మద్దతుదారులు పోలీసు బారికేడ్లను నెట్టివేస్తూ, భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగారు. దీనిపై ఓ పోలీస్ అధికారి మాట్లాడుతూ.. 'కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారనే కారణంతో మమతా బెనర్జీతో పాటు కార్యక్రమ నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశాము. దర్యాప్తులో భాగంగా అందరినీ విచారిస్తాము' అని అన్నారు.

## పార్టీ నేతలతో టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు భేటీ..



**హైదరాబాద్, ఆగస్టు 29: మీడియా టుడే**
తెలంగాణలో తమ పార్టీని బలోపేతం చేసే దిశగా బీజేపీ కసరత్తులు చేస్తోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తమ గొంతుకను వినిపిస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ చీఫ్ రాంచందర్ రావు అధ్యక్షతన ఫీజు బకాయిల చెల్లింపు కోసం ఇటీవల దీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మరో రెండు పోరాటాలకు బీజేపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. 22-ఏలో చేర్చిన భూమి సంబంధించిన బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల 5,6 తేదీల్లో టీబీజేపీ నేతలు మరో దీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాంచందర్ రావు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 22-ఏ వ్యవహారంపై చేసే దీక్షపై సుదీర్ఘంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. దీక్షకు సంబంధించిన కార్యాచరణపై రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో పార్టీ బలాబలాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేసే దిశలో భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం బీజేపీ తదుపరి కార్యాచరణపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు క్లారిటీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

## ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌కు అధిష్ఠానం బిగ్ షాక్..

### పార్టీ నుంచి బహిష్కరణ

**హైదరాబాద్, ఆగస్టు 29: మీడియా టుడే**
నగరంలోని ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌కు పార్టీ అధిష్ఠానం షాక్ ఇచ్చింది. ఆయనను పార్టీ నుంచి బహిష్కరిస్తూ ఎంఐఎం కీలక నిర్ణయం తీసుకుంది. తక్షణమే పార్టీని వీడాలని ఆదేశించిన అధిష్ఠానం.. ఎమ్మెల్సీ పదవికి కూడా వెంటనే రాజీనామా చేయాలని సూచించింది. తన రాజీనామా లేఖను మండలి చైర్మన్‌కు పంపాలని స్పష్టం చేసింది. ఓ మహిళ ఇంట్లోకి మారువేషంలో వెళ్లిన వ్యవహారానికి సంబంధించి రహ్మత్ బేగ్‌పై పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై వివరణలు, పరిణామాలను పరిశీలించిన అనంతరం పార్టీ క్రమశిక్షణ చర్యలకు దిగినట్లు సమాచారం.

## తలక్రిందులుగా తపస్సు చేసినా.. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే: మంత్రి పొంగులేటి



**సూర్యాపేట, ఆగస్టు 29: మీడియా టుడే**
ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## సీఎం విజయ్ ఆకస్మిక తనిఖీ..

**తమిళనాడు, ఆగస్టు 29:మీడియా టుడే** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ శుక్రవారం చెన్నై సమీపంలోని పుఝల్ సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జైలు సదుపాయాలు, ఖైదీలకు అందుతున్న వైద్యం, ఆహారం, విద్య, వృత్తి శిక్షణ తదితర అంశాలను ఆయన పరిశీలిం చారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను కూడా తెలుసుకున్నారు. పుఝల్ సెంట్రల్ ప్రిజన్-1లోని పలు విభాగాలను సీఎం విజయ్ పరిశీలించారు. క్వారంటైన్ ప్రాంతం, సందర్శకుల హాల్, జైలు ఆసుపత్రి, డ్రగ్ డీ-అడిక్షన్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్, మహాత్మా గాంధీ కమ్యూనిటీ కాలేజీ తరగతి గదులు, లైబ్రరీ, అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. హై-సెక్యూరిటీ బ్లాక్, ఉరిశిక్ష అమలు చేసే ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. తనిఖీ సందర్భంగా ఖైదీలతో సీఎం విజయ్ నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు ఖైదీలకు కేవలం శిక్ష విధించడం కాకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణ ద్వారా పునరావాసానికి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు . జైలులో పుస్తకాల లభ్యతను కూడా పెంచాలని సీఎం సూచించారు. చదువు, నైపుణ్య శిక్షణ, ఖైదీల ఆసక్తులకు అనుగుణంగా వివిధ కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు సామాజిక బాధ్యతపై అవగాహన అవసరం

## సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్



**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, ఆగస్టు 29:** రోహిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎమ్డిసి హైదరాబాద్ మారథాన్ (చీవీణజ ఎఎవతీుఖ్యం మీుతీఫ్త్రశీఅ -- 2026)లో భాగంగా 5కే రన్ విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఎచ్ఐసీసీ ఎ×జజ నుంచి హైటెక్స్ వరకు నిర్వహించిన ఈ పరుగు కార్యక్రమంలో సుమారు 6,100 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ పరుగు కార్యక్రమాన్ని "=బఅ టశీతీ ఖ ఖుబంవ" అనే సందేశంతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నప్పటికీ, నిర్వాహకులు మరియు పోలీసు సిబ్బంది సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్, సీఎంసీ కమిషనర్ శ్రీమతి సృజన, విద్యార్థులు, రన్నర్లు మరియు సామాన్య ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. క్రమం తప్పకుండా పరుగు, నడక వంటి శారీరక వ్యాయామాలు చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అదే విధంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో సేవాభావాన్ని మరింత పెంపొందించవచ్చని పేర్కొన్నారు. పిల్లలు సెల్‌ఫోన్‌లకు ఎక్కువ సమయం కేటాయించకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకునేలా "సెల్‌ఫోన్ వద్దు – పుస్తకమే ముద్దు" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. కథల పుస్తకాలు, ఇతర పుస్తకాలు, రాత సామగ్రి అవసరమైన వారికి అందించడం ద్వారా పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు వారి జ్ఞానాన్ని విస్తరించేందుకు దోహదపడు తుందని అన్నారు.రోహిణి ఫౌండేషన్ చేపట్టిన "పవర్ ఆఫ్ 100" కార్యక్రమం ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరి చిన్న సహకారం కూడా ఒక పెద్ద సానుకూల మార్పుకు దోహదపడుతుందనే సందేశాన్ని అందించారు. "100 ్రావశీజూశ్రీవ -- ?100 ఖుఎష్ట్ర -- ాఅవ ాశీఖవతీటబశ్రీ జష్ణుఅస్త్రవ" అనే భావనతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సామాజిక బాధ్యత, సమిష్టి భాగస్వామ్యం మరియు సేవాభావాన్ని ప్రజల్లో పెంపొందించేందుకు కృషి చేశారు.సుమారు 6,100 మంది పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన రోహిణి ఫౌండేషన్ నిర్వాహకులు, చీవీణజ ఎఎవతీుఖ్యం మీుతీఫ్త్రశీఅ నిర్వాహకులు, రన్నర్లు, విద్యార్థులు, ప్రజలు మరియు సైబరాబాద్ పోలీస్ సిబ్బందికి సైబరాబాద్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

# తండాలకు రోడ్లేవీ.. పాలకులారా స్పందించండి!

**మంగళవారిపేట నుంచి తండాలకు వెళ్లే రహదారులు అధ్వానం**

**మంజూరైన బీటీ రోడ్ల పనులు నిలిచిపోయాయని గిరిజన యువత ఆగ్రహం**

**జాతీయ రహదారిపై ధర్నా.. మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు**



**ఖానాపూర్ మండలం ఆగస్టు 29, మీడియా టుడే** వరంగల్ జిల్లా ఖానాపురం మండలం మంగళవారిపేట నుంచి తండాలకు వెళ్లే లింకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, మంజూరైన బీటీ రోడ్ల పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన యువత శనివారం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. కొడితిమాట్ తండా, భద్రూతండా, మార్నగిబోడు తదితర తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకట నరసయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, యువత మాట్లాడుతూ.. తండాలకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి హయాంలో జాతీయ రహదారికి అనుసంధానంగా లింకు రోడ్లకు బీటీ పనులు మంజూరు చేసి టెండర్లు పిలిచారని తెలిపారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ఆ పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు.

**ఎక్కడ ఆగిపోయాయో చెప్పాలి..**

బీటీ రోడ్ల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడానికి కారణమేంటో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ వైఫల్యమా.. లేక స్థానిక ఎమ్మెల్యే అడ్డంకులా అనే విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేళ్లు కావస్తున్నా కాంట్రాక్టర్ వేసిన కంకర అక్కడే ఉందని, రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తి కాలేదని అన్నారు.రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదని యువత ఆవేదన వ్యక్తం చేశారు. తండాలకు రోడ్లు ఎందుకు కావాలని తమను ఎగతాళి చేసినట్లు మాట్లాడారని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన ప్రజాప్రతినిధులు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**పది రోజుల్లో స్పందించాలి**

తండాలకు మంజూరైన బీటీ రోడ్లకు సంబంధించిన టెండర్ల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం, అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పది రోజుల్లోగా ఎమ్మెల్యే, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే మంగళవారిపేట ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని తొమ్మిది తండాల ప్రజలతో కలిసి జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఖానాపురం సర్పంచ్ దాసరి రమేష్, ధర్మారావుపేట సర్పంచ్ మద్రాజు వెంకన్న, భద్రూతండా సర్పంచ్ బానోత్ వీరన్న, మంగళవారిపేట సర్పంచ్ గొంది సుజాత, కొడితిమాట్ తండా సర్పంచ్ లకావత్ వసంత ప్రవీణ్, నాజితండా సర్పంచ్ బాదావత్ జ్యోతి బాలకిషన్, మంగళవారిపేట ఉపసర్పంచ్ భూషబోయిన రాజు, మాజీ జెడ్పీటీసీలు గుగులోతు బాలు నాయక్, బత్తిని స్వప్న, బీసీ సెల్ అధ్యక్షుడు కోరె సుధాకర్, యువజన అధ్యక్షుడు బానోత్ శ్రీనివాస్, మండల నాయకులు బుస అశోక్, బందారపు శ్రీనివాస్, ఓర్సు రవి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోరె రాము, గ్రామాల యువత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పువ్వాడ ఉదయ నగర్‌లో ఇల్లు కూల్చివేత

**ఘటన వెనుక రౌడీ షీటర్లు -సర్పంచ్ అండదండలతోనే రెచ్చిపోయిన మూక**

**నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్-పలు సంఘాల నాయకుల ఆరోపణలు**



**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం, ఆగస్టు 28 : జిల్లా కేంద్రం కు అతి సమీపంలో గల రఘునాథపాలెం మండల పరిధిలోని పువ్వాడ ఉదయ్ నగర్ గ్రామంలో గురువను రాత్రి పేద లంబాడి గిరిజన మహిళ భూక్య నాగేంద్ర అనే మహిళ ఇంటిని కొందరు కూల్చి వేశారు. గురువారం ఉదయం సంఘటన స్థలానికి సందర్శించిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుంతేటి వీరభద్రం , మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీను , బహుజన జెపిసి నాయకులు సంగమేశ్వర రావు , లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ లు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక పేద గిరిజన మహిళ ఇంటిని రాత్రిపూట ఎవరూ లేని సమయంలో కూల్చివేయటం దారుణమని విమర్శిస్తూ ఈ ఘటన వెనుక రౌడీ శీటర్లతోపాటు గంజాయి బ్యాచ్ ఉన్నట్లుఆరోపించారు. దీని వెనుక తనకు తాను సిపిఐ నాయకుడిగా ప్రకటించుకుంటున్న యాకోబ్, ఎలుక శివ ,స్థానికుడు, మాజీ ఉప సర్పంచ్ భర్త వీరన్న , ప్రస్తుత సర్పంచ్ అనుచరులు ఇస్మాయిల్, వడ్లకుంట శివ మరి కొంతమంది ఈ ఇల్లు కూల్చివేతల్లో పాల్గొన్నట్లు స్థానికులు ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నారని తెలిపారు. అధికార పార్టీ కాంగ్రెస్ కు చెందిన పువ్వాడ ఉదయ నగర్ సర్పంచ్ సిద్దిక్ ప్రోబలం సహాయ సహకారాల కారణంగానే ఈ మూక ఈ దారుణానికి పొడిగట్టిందని ఆరోపించారు. గతంలో కూడా ఇదే విధమైన సంఘటన జరిగితే దీనిపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్లో , స్థానిక తాసిల్దారు కు కూడా ఫి ర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కూల్చి వేసిన ఇంటిని పునర్ నిర్మించి, ఇంటిలోని సామాన్లను ధ్వంసం చేసిన దానికి నష్టపరిహారం నిందితులనుండే వసూలు చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పువ్వాడ ఉదయ నగర్ లో తరచు సంభవించటం అక్కడి పరిపాలన వ్యవస్థను , అక్కడి శాంతి భద్రతల పరిస్థితికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. ఉన్నత అధికారులు ఇప్పటికైనా పువ్వాడ ఉదయ నగర్ పై దృష్టి సారించాలని , అక్కడి ప్లాట్ల క్రయవిక్రయాలపై సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఉదంతంపై జిల్లా కలెక్టర్ తో పాటు ఖమ్మం పోలీస్ కమిషనర్లకు సోమవారం పలు సంఘాల నాయకులు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు. వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి, పువ్వాడ ఉదయ నగర్ లో జరిగే పలు అంశాలపై ప్రశ్నించడం కారణంగా, నాగేంద్ర ఆమె బంధువు కావడం ఇల్లు కూల్చివేతకు మరో కారణం అంటూ వివరించారు. వ్యక్తిగత విషయాలలో ప్రతిష్టకు పోయి అమాయక, పేద లంబాడి మహిళ భూక్య నాగేంద్ర ఇల్లు కూల్చివేతకు సిద్ధమైన వీరిని వెంటనే అరెస్టు చేయాలని, వీరందరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నల్ల నాగమణి, ఏ. సరోజిని,వినోద, జక్కం స్వాతి బీ..సుశీల తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ఖానాపూర్ మండలం, ఆగస్టు 29,మీడియా టుడే.** వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామంలో ప్రజా పాలనలో భాగంగా మంజూరైన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామ సర్పంచ్ జాడి అచ్యుత్ లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆహార భద్రతా ప్రయోజనాలు ప్రజలకు మరింత సులభంగా అందనున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ కదురు సారయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గట్టి సారంగపాణి, వార్డు సభ్యులు బుడిగె కొము రయ్య, కూస మునిందర్, ఈసం నరసయ్య, నాయకులు పొనుగోటి ప్రవీణ్, సింగరబోయిన లచ్చయ్య, పెనుక వెంకన్న, వేంపల్లి సాంబయ్య, సాయి, భూపతి, శంకర్,



మండల అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన

## అర్బన్ ఇన్స్పెక్టర్ భానుప్రకాష్



**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి,ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి అని అర్బన్ ఇన్స్పెక్టర్ భానుప్రకాష్ విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు,ఆరోగ్యంపై పడే తీవ్ర ప్రభావాలు, భవిష్యత్ జీవితంపై కలిగే దుష్పరిణామాలపై పలు పాఠశాలల విద్యార్థులకు,సిబ్బందికి అవగాహన కల్పించే ఉద్దేశంతో పాండురంగాపురం, బల్లెపాలి గ్రామంలోని పలు పాఠశాలలో ఖానాపురం హవెలి పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ..విద్యార్థులకు సురక్షితమైన, మాదక ద్రవ్యాల రహిత వాతావరణాన్ని కల్పించడంతో పాటు,మాదక ద్రవ్యాలపై స్థానిక సమాజంలో అప్రమత్తతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల ఎదురయ్యే ఆరోగ్య,సామాజిక, ఆర్థిక సమస్యలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ తో పాఠశాల పరిసర ప్రాంతాలలో,ప్రాంగణానికి సమీపంలోని దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, చట్టవిరుద్ధమైన మాదక ద్రవ్యాల ఆనవాళ్లను గుర్తించేలా తనిఖీలు చేపట్టారు.




# ముందడుగు 21 స్తంభాల 700 మీటర్ల కబుల్ పనులకు శంకుస్థాపన



ఇట్టి కార్యక్రమంను ఉద్దేశించి చామకూరి మధు మాట్లాడుతూ లక్కవరం గ్రామంలో గ్రామానికి 700 మీటర్ల దూరంలో ఉన్న బీసీ కాలనీకి గతంలో అపుడున్న పరిస్థితితులా దృష్ట్యా ాూ+ూ( అగ్రికల్చర్ లైన్) క్రింద జూశీషవతీ సప్లై ఇవ్వడం జరిగింది కానీ వేసవికాలం వర్షాకాలం ఎన్నో సందర్భాలలో విద్యుత్ బ్రేక్ డౌన్ అయినప్పుడు అగ్రికల్చర్ ట్రాన్స్ఫార్మర్లు రిపేర్లు చేసే సందర్భాలలో గ్రామంలో విద్యుత్ వున్నా.. దీజ కాలనిలో మాత్రం నిరంతరాయంగా పవర్ సప్లై నిలిచిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి అని.. దానితోపాటు గ్రామానికి 700 మీటర్ల దూరంలో ఉన్న దీజ కాలనీకి రాత్రి సమయాలలో కాలనీవాసులు గ్రామంలోకి రావాలి అన్న గ్రామంలో వ్యక్తులు కాలనీకి పోవాలి అన్న రోడ్డు పొడువునా వీధి లిదీపాలు లేక ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ఉన్నవి అని వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని గ్రామ అభివృద్ధి ధ్యేయంగా గడిచిన పంచాయతీ ఎన్నికల్లో బీసీ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తాం అని కాంగ్రెస్ పార్టీ మాట ఇ

# పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలి

**బిబిపేట్ గ్రామపంచాయతీ సర్పంచ్ భర్తపై**

**చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: చిరంజీవి**



కల్లేర్ మండలం బిబిపేట్ గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ చిరంజీవి డిమాండ్ చేశారు.ప్రభుత్వ విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని ఆయన అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేయడం ద్వారా వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం సరికాదని, ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలిపారు.బిబిపేట్ గ్రామపంచాయతీ సర్పంచ్ భర్తగా పేర్కొంటున్న వ్యక్తి పంచాయతీ కార్యదర్శిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, ఈ ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి, బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని చిరంజీవి కోరారు.ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి భయాందోళనలు లేకుండా ప్రజలకు సేవలందించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని, పంచాయతీ కార్యదర్శికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పంచాయతీ కార్యదర్శికి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అండగా ఉంటుందని చిరంజీవి స్పష్టం చేశారు. బాధ్యులను వెంటనే అరెస్టు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మీడియా టుడే
ఆదివారం, , ఆగస్టు 30, 2026

# క్రీడాకారులకు మార్గదర్శి ధ్యాన్ చంద్



**సూర్యాపేట / హుజూర్‌నగర్ మీడియా టుడే, రిపోర్టర్: ఆగస్టు 29.**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమవు తుందని, ప్రధానోపాధ్యాయులు తాతరాజు శ్రీనివాస్ అన్నారు. శనివారం హుజూర్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.? ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ క్రీడాకారులకు, యువతకు మేజర్ ధ్యాన్ చంద్ నిరంతర మార్గదర్శి అని కొనియాడారు. క్రమశిక్షణ, నిరంతర సాధన, అంకితభావంతో ఆయన ప్రపంచ హాకీ రంగాన్ని ఏలారని, దేశానికి ఎనలేని ఖ్యాతిని తీసుకువచ్చారని గుర్తుచేశారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడలను దినచర్యలో ఒక భాగం చేసుకోవాలని, ఆటలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.? ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, అస్మా ముబీన్, కల్వగిరి శ్రీనివాస్, నాగేశ్వరరావు, శ్రీకాంత్, కాంతి బాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

# 125 రోజులు పనికల్పించే విధంగా ప్రణాళికలు చేయాలి : సర్పంచ్ దున్నా శ్రీనివాస్.



**నడిగూడెం, ఆగస్టు 29(మీడియా టుడే)–:**
వి.బి.జి రాంజి పథకం ద్వారా ఉపాధి కూలీలకు 125 రోజులు పని దినాలను కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్. కోరారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం నందు వి బీ జి రామ్ జి పథకంపై మొదటి గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని కల్పించుటకు అధికారులు ముందస్తుగా పనులు గుర్తించాలని సూచించారు. ఈ ఏడాది నుండి ఉపాధి కూలీలు 125 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాలు పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, వార్డు సభ్యులు దున్నా లింగయ్య, దున్నా మనీషా ప్రదీఫ్, కాసాని మాధవి గోపీనాథ్, షేక్ నాజియా రియాజ్ టెక్నికల్ అసిస్టెంట్ అంజిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, ఉపాధి కూలీలు గుండు వెంకన్న, షేక్ జలీల్, దున్న అలివేలమ్మ, గుండు శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

# నందమూరి హరికృష్ణ వర్ధంతి

### ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించిన

### గరిడేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు కీసరి నాగయ్య ముదిరాజ్

**గరిడేపల్లి, ఆగస్టు 29: మీడియా టుడే:**



నందమూరి హరికృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని గరిడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కీసరి నాగయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక వృద్ధులకు పండ్లు, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా కీసరి నాగయ్య ముదిరాజ్ మాట్లాడుతూ... నందమూరి హరికృష్ణ నిఖార్సయిన నాయకుడని, తన జీవితాంతం క్రమశిక్షణ, నిజాయితీ, ధైర్యంతో బతికిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధిలో ఆయన పాత్ర మరవరానిదని, చైతన్య రథ సారథిగా పార్టీకి ఆయన అందించిన సేవలు ఎల్లప్పుడూ స్మరణీయమని గుర్తుచేసుకున్నారు. ఏ పదవిలో ఉన్నా ప్రజల క్షేమానికే ప్రథమ పీఠం వేసిన హరికృష్ణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. ఆయన జ్ఞాపకార్థం ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించి, నిరుపేద వృద్ధులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో తృప్తినిచ్చిందని పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, వార్డు నెంబర్ పాతకోటి లింగారెడ్డి, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం

**మీడియా టుడే నాగర్ కర్నూలు జిల్లా ప్రతినిధి (ఆగస్టు 29):**



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో పలు కాలనీల్లో రోడ్లపైనే వాహనాల వాషింగ్ చేస్తున్నారు. వాటితో పట్టణంలోని మున్సిపాలిటీకి సంబంధించిన రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. కాలనీలో సిసి రోడ్లు ధ్వంసం కావడంతో వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ సెంటర్ లో నిత్యం కాలనీ రోడ్డుపైన వాహనాలను వాషింగ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజంతా వాహనాల వాషింగ్ కొనసాగడంతో రోడ్లపై మురుగునీరు నేర్చుకోవడంతో పలు వాహనాలకు రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అని కాలనీవాసులు వాపోతున్నారు ఫలితంగా రోడ్డు ధ్వంసం అయిపోతుందని కాలని వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి సిసి రోడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ, స్థానికులు ప్రవేట్ వ్యక్తుల అధికారుల నిర్లక్ష్మీ కారణంగా సిసి రోడ్డు ధ్వంసం అవుతున్నాయి. అని కాలనీవాసులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై వాహనాల వాషింగ్ను అడ్డుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# పాత కక్షలు వేప చెట్టు విషయంలో ఘర్షణ

### గొడ్డలి దాడిలో ఇద్దరు మృతి- ఎస్సై నవీన్‌కుమార్ కు గాయాలు

### సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



**సూర్యాపేట / మేళ్లచెరువు మీడియా టుడే, స్టాఫ్ రిపోర్టర్: ఆగస్టు 29.**
మేళ్లచెరువు మండలం ఎర్రగట్టు తండాలో పాత కక్షలు తో పాటు శనివారం వేప చెట్టు విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర విషాదానికి దారితీసింది. శనివారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుని పరస్పరం దాడులకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘర్షణలో గొడ్డలితో జరిగిన దాడిలో మంద వెంకటేశ్వర్లు సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, మరో వ్యక్తి సైదాకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు సమాచారం. ఘర్షణను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించిన ఎస్సై నవీన్‌కుమార్‌కు సైతం గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మఠంపల్లి, చింతలపాలెం ఎస్సైలు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పది రోజుల్లో హైవే లైట్ల సమస్యకు పరిష్కారం!



**మీడియా టుడే ఆగస్టు 29 త్రిపురారం (నల్గొండ జిల్లా బ్యూరో)**
త్రిపురారం సమస్యలపై ఎమ్మెల్యే జైవీర్ రెడ్డికి బీజేపీ నాయకుల వినతి – – మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలు, తాగునీటి సమస్యలపైనా చర్యలకు హామీత్రిపురారం: త్రిపురారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గత రెండు నెలలుగా హైవే లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో త్రిపురారం మండల బీజేపీ నాయకులు నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే జైవీర్ రెడ్డిని కలిసి హైవే లైట్ల సమస్యతో పాటు త్రిపురారం మండలంలో నెలకొన్న తాగునీటి సమస్య, మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ లీకేజీలను బీజేపీ నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, పది రోజుల వ్యవధిలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మెరుగు మహేష్, సీనియర్ నాయకులు కర్ర జానకిరామరెడ్డి, యువమోర్చా నాయకులు మామిడి మహేష్, ఎస్సీ మోర్చా నాయకులు సామర్థపు క్రాంతికుమార్తో పాటు పలువురు మండల సీనియర్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ధ్యేయం, ప్రతీ అర్హుడికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ




**మీడియా టుడే నాగర్ కర్నూలు జిల్లా ప్రతినిధి (ఆగస్టు 29):**
నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం నూతన స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలోని ఏ ఒక్క పేద కుటుంబం కూడా ఆకలితో అలమటించకూడదని, ప్రతీ పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందాలనే తపనతో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని. గతంలో ఎన్నడూ లేని విధంగా పేదల సంక్షేమాన్ని ఒక యజ్ఞంలా ముందుకు తీసుకెళ్తున్నారని
అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం ద్వారా అర్హులైన పేదలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు, పథకాల లబ్ధి నేరుగా అందేలా పారదర్శక వ్యవస్థను రూపుదిద్దాం. ఏ ఒక్క అర్హులైన లబ్ధిదారుడికి అన్యాయం జరగకుండా చివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు చేర్చడమే మన ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను వేగంగా అమలు చేస్తోందని. ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి పథకం, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, గృహజ్యోతి ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, వంటి పథకాలతో రైతులు, మహిళలు, పేద వర్గాలకు అండగా నిలుస్తున్నామని అన్నారు. వంగూరు మండలంతో పాటు అచ్చంపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటాం. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ పథకాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యువత ఆశలపై నీళ్లు చల్లిన పాలకులు ఏఐవైఎఫ్




**మీడియా టుడే నాగర్ కర్నూలు జిల్లా ప్రతినిధి (ఆగస్టు 29):**
యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా వారి ఆశలపై పాలకులు నీళ్లు చల్లారని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కుతుబ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. సంతోష్ అన్నారు. నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ తాలూకా పానగల్ మండలం కేతేపల్లి లో ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభల వాల్పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. దేశంలో 40 శాతం యువత ఉన్నారని వారి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. యువత స్వయం ఉపాధి కోసం ప్రత్యేక పథకాలను రూపొందించలేదని, యువత నిరాశ నిస్పృహలో ఉన్నారన్నారని. మోదీ యువత వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్న ఖాళీలను భర్తీ చేయలేదన్నారు. రాజీవ్ యువజన వికాస్ పథకం పేరుతో దరఖాస్తులను స్వీకరించి ఇంతవరకు ఎంపిక చేయలేదని, రుణాలను ఇవ్వలేదన్నారు. సెప్టెంబర్ 8, 9,10 తేదీల్లో యాదగిరిగుట్టలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభలు జరుగుతున్నాయని యువత సమస్యలపై చర్చించి పోరాటానికి కార్యాచరణరూపొందించడం జరుగుతుందన్నారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యువకులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ సంతోష్, జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు, పరశురాములు, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తాడూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే.



**మీడియా టుడే నాగర్ కర్నూలు జిల్లా ప్రతినిధి (ఆగస్టు 29):**
నాగర్ కర్నూలు జిల్లా తాడూర్ మండల కేంద్రంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూఅర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డులతో లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయని పేర్కొన్నారు.

# పాన్ గల్ పీఎస్‌లో ఘనంగా రాఖీ వేడుకలు




**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి ఆగస్టు 29**
వనపర్తి జిల్లా పానుగల్ మండలం పోలీస్ కార్యాలయంలో రాఖి పండుగను పురస్కరించుకుని మండల పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎస్సై కురుమయ్య ఆధ్వర్యంలో రాఖీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ అధికారి దీపిక స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సందర్భంగా ఎస్సై కురుమయ్య కు మరియు తన తోటి సహచర పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టి, స్వీట్లు పంచుకుని రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో సోదరభావం, ఆత్మీయత, పరస్పర గౌరవాన్ని చాటేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కురుమయ్య మాట్లాడుతూ...రాఖీ పండుగ సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యుల మాదిరిగా ఐకమత్యంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. పోలీస్ కుటుంబంలో ఐకమత్యం, స్నేహపూర్వక వాతావరణం మరింత బలోపేతం కావాలని ఎస్సై కురుమయ్య ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబులు పాల్గొన్నారు

# రెయిన్‌బో విస్తా వద్ద ఎస్‌టీపీ ప్లాంట్ పరిశీలించిన ఎమ్మెల్యే

**కూకట్‌పల్లి, ఆగస్టు29 (మీడియా టుడే ప్రతినిధి)**



బాలాజీనగర్‌లోని రెయిన్‌బో విస్తా వద్ద ఉన్న ఎస్‌టీపీ ప్లాంట్‌ను శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఎస్‌టీపీ ప్లాంట్ నుంచి వస్తున్న దుర్వాసన, భారీ శబ్దాలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులతో కలిసి ఆయన ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫతేనగర్, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో నిర్మించిన ఎస్‌టీపీ ప్లాంట్ల వద్ద ఇటువంటి సమస్యలు లేవని, రెయిన్‌బో విస్తా వద్ద మాత్రమే సమస్య ఎందుకు వస్తుందో అధికారులు వెంటనే పరిశీలించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యకు వీలైనంత త్వరగా శాశ్వత పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లపాటు శాసనసభ్యుడిగా పనిచేసిన ఎమ్మెల్యే కృష్ణారావు కూకట్‌పల్లి నియోజకవర్గానికి లేదు

## - బండి రమేష్ -సీఎం రేవంత్‌రెడ్డిపై చౌకబారు విమర్శలు సహించేది లేదు.

### పదేళ్ల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధం: బండి రమేష్




**కూకట్‌పల్లి, ఆగస్టు 29 (మీడియా టుడే ప్రతినిధి):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన స్థాయికి మించి చౌకబారు విమర్శలు చేస్తున్నారని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పదేళ్లపాటు శాసనసభ్యుడిగా పనిచేసిన కృష్ణారావు కూకట్‌పల్లి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో బండి రమేష్ మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కారక్రమాలను వివరించడంతో పాటు గత బిఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మాధవరం కృష్ణారావు హయాంలో నియోజకవర్గ పరిధిలోని చెరువులు, నాలాలు, కుంటలు కబ్జాకు గురయ్యాయని బండి రమేష్ ఆరోపించారు. హస్మత్‌పేట సర్వే నంబర్ 1లోని 100 ఎకరాల్లో కేవలం 10 ఎకరాలు మాత్రమే మిగిలాయని, అల్లాపూర్‌లో నాలుగు ఎకరాల్లో రెండు ఎకరాలు, గోపాల్‌నగర్‌లోని 10 ఎకరాల ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి కృష్ణారావు, ఆయన అనుచరులు సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. పీజేఆర్ హయాం నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధి, టీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని బండి రమేష్ సవాల్ విసిరారు. మొదటిసారి కౌన్సిలర్‌గా పోటీ చేసినప్పుడు కృష్ణారావు ఆస్తులు ఎంత ఉన్నాయని, ప్రస్తుతం ఆయన ఆస్తుల విలువ ఎంత ఉందో ప్రజలకు వెల్లడించాలని ప్రశ్నించారు. 22ఏ భూముల అంశంలో కృష్ణారావు 'ఉరి, హత్య, ఆత్మహత్య' అంటూ ప్రజల సానుభూతి పొందేందుకు నాటకాలు ఆడుతున్నారని బండి రమేష్ విమర్శించారు. కృష్ణారావును చంపాల్సిన అవసరం తమకు లేదని అన్నారు. అయితే ముఖ్యమంత్రిపై విమర్శలు చేసే సమయంలో నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. హౌసింగ్ బోర్డు స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం విక్రయిస్తోందంటూ కృష్ణారావు చేస్తున్న విమర్శలపై బండి రమేష్ తీవ్రంగా స్పందించారు. టీఆర్ఎస్ హయాంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా విక్రయించారని, ఆ విషయం కృష్ణారావుకు కనిపించలేదా..? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతోందని బండి రమేష్ తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, గ్యాస్, రేషన్ కార్డుల పంపిణీ, పెట్రోల్ బంకులు, బస్సులు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, బ్రిడ్జిలు, లింక్ రోడ్లు, స్కైవాక్ వంతెనలు నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రజల వైద్య భద్రత కోసం రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 70 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, విద్యా రంగంలో నూతన విధానాలను ప్రవేశపెట్టిందని బండి రమేష్ పేర్కొన్నారు. రానున్న ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి హాజరు

## కల సాకారమైన వేళ పేద కుటుంబాల ఆనందం అనిర్వచనీయం

**ఇల్లంతకుంట మండల రిపోర్టర్ మీడియా టుడే , ఆగస్టు 29**

సొంతింటి కల సాకారమవుతున్న వేళ పేద కుటుంబాల కళ్లల్లో కనిపించే ఆనందాన్ని చూడటం ద్వారా పొందిన అనుభూతి అనిర్వచనీయమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న 40 మంది లబ్ధిదారులు శనివారం నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇల్లంతకుంటలో 40 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ సొంత ఇళ్లలోకి అడుగుపెట్టడం, ఆ ఆనందోత్సవాల్లో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి వారి కలను సాకారం చేస్తోందని తెలిపారు. గృహప్రవేశాల సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యుల కళ్లల్లో కనిపించిన ఆనందం తనను ఎంతో సంతోషానికి గురిచేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించి, వారి జీవితాల్లో భద్రత, ఆత్మగౌరవం, ఆనందం నింపడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని అన్నారు. ఈ సంతోషాన్ని, ఈ ఆత్మగౌరవాన్ని పేద ప్రజలకు ఇవ్వాలనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోరుకుంటోందని ఆయన చెప్పారు. ఇది కేవలం ఇల్లు కాదు, ఒక భరోసా అని, ఇందిరమ్మ ఇళ్లు పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదల ఇళ్ల కలను కల్లలుగా మిగిల్చిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇల్లు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేసుకున్న కుటుంబాలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టిన లబ్ధిదారులు తమ ఆనందాన్ని ఎమ్మెల్యేతో పంచుకున్నారు. తమకు సొంతింటి కల నెరవేరేందుకు సహకరించిన ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. గృహప్రవేశ కార్యక్రమాలు కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికుల సందడితో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శశికళ, తహసీల్దార్ సురేష్, హౌసింగ్ డీఈ సాజిద్ ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు, ఇల్లంతకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, రేపాక, రామోజీపేట, వల్లంపట్ల, వెంకట్రావుపల్లి సర్పంచులు కాత మల్లేశం, చొప్పరి భూమయ్య, నేరెళ్ల విజయ్ గౌడ్, చల్ల నవీన్ రెడ్డి, పార్టీ నాయకులు పసుల వెంకటి, ఎలగందుల ప్రసాద్, తిరుపతి, తూముకుంట రాజేందర్ రెడ్డి, బాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డితోపాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**నోటు బుక్కుల పంపిణీ**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రం భవనాన్ని ఆయన ప్రారంభించారు.

**వల్లంపట్లలో...**

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగోత్రి మహిళా సంఘం (వీవో) భవనాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన ప్రారంభోత్సవం జరుపుకోవడం ముదావహమని పేర్కొంటూ స్థల ధాత కట్ట సౌమ్య–శ్రీకాంత్ రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ సురేష్, , వల్లంపట్ల గ్రామ సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆల శ్రీనివాస్ రెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కట్ట సౌమ్య, పార్టీ నాయకులు ఎల్క అనిల్ కుమార్, నరేందర్, ఎలగందుల ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయి -బిజెపి లాడాయి

## విదార్థుల హక్కుల సాధనకై -- బీజేపీ ౘ బీజేవైఎం పోరుబాట



**కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు29( మీడియా టుడే ):** "ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి"భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఈరోజు కొమరం భీం జిల్లాలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ గారి ఆధ్వర్యంలో భారీ నిరసన దీక్ష నిర్వహించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, తక్షణమే బకాయిలు చెల్లించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరిగల్ నాగేశ్వరరావు బిజెపి పూర్వ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోనగిరి సతీష్ బాబు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోవా విజయ్ టిఎంసి తెలంగాణ స్టేట్ బోర్డు మెంబర్ కంద్రే విశాల్ బిజెపిబిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు అశోక్ మండలాధ్యక్షులు ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు పెంటయ్య తిర్యాని మండల అధ్యక్షుల సారా రమేష్ గౌడ్ కేరామేరి మండల అధ్యక్షులు సెండ్ మేక తుకారాం జైనురు మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్‌బిజెపి సీనియర్ నాయకులు సప్త శ్రీనివాస్ బీజేవైఎం జిల్లా నాయకులు సంజు బీజేవైఎం మండల అధ్యక్షులు వికాస్ అర్జున్ అధ్యక్షులు బీజేపీ, బీజేవైఎం జిల్లా మరియు మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువకులు మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్య డిమాండ్లు: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగించకూడదు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.

# గీతాంజలి డిజి స్కూల్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**నర్సంపేట పట్టణం ఆగస్టు 29,మీడియా టుడే.** మాతృభాషపై మమకారం పెంపొందించడంతోపాటు తెలుగు భాష గొప్పతనం, మాధుర్యం, సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసేందుకు వరంగల్ జిల్లా నర్సంపేట లో ఉన్న గీతాంజలి డిజి స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్యలేఖనం, కథారచన, వ్యాసరచన, ఉపన్యాసం తదితర పోటీలు నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పాఠశాల ఛైర్మన్ డా. వేములపల్లి సుబ్బారావు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషను ప్రేమించి, మాతృభాష పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల్లో భాషా పరిజ్ఞానం, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగు భాష మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మాతృభాషను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జంగ సింహాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



# చిగురుమామిడి మండలంలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన : మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



**చిగురుమామిడి మండల రిపోర్టర్ : మీడియా టుడే , ఆగస్టు 29**

చిగురుమామిడి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ పరామర్శించి,కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా రేకొండ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు తాటికొండ సందీప్ రెడ్డి అమ్మమ్మ కనకవ్వ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రామంచ గ్రామంలో నర్ర జగదీశ్వర్ రెడ్డి,ఇందుర్తి గ్రామంలో గౌరవేణి లచ్చవ్వ, పల్ల రాములు, సీతారాంపూర్ గ్రామంలో మూసుకుల వెంకటరెడ్డి చిగురుమామిడి మండల కేంద్రం,లో కోనేటి వెంకవ్వ మృతి చెందగా ఆయా కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ. కుటుంబంలో ఒకరిని కోల్పోవడం ఎంతో బాధాకరమని, ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

**రైతులకు శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. విశ్వతేజ సూచనలు**

**పురుగు మందుల వినియోగం తగ్గించి సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి**



**జేడీ మల్లంపల్లి, ఆగస్టు 29 ( మీడియా టుడే):**

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, ములుగు శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. విశ్వతేజ సూచించారు. మల్లంపల్లి రైతు వేదికలో వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రైతులకు వివిధ పంటల్లో చేపట్టాల్సిన సాగు, సస్యరక్షణ చర్యలపై సమగ్ర అవగాహన కల్పించారు.

**వాతావరణ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి**

ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల ప్రభావం పంటలపై పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ విశ్వతేజ సూచించారు. ముఖ్యంగా వరి, పత్తి, మిరప, మొక్కజొన్నతో పాటు ఇతర పంటల్లో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులను మార్చుకోవాలని తెలిపారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పురుగులు, తెగుళ్ల ఉధృతిని ప్రారంభ దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

**పురుగు మందుల వినియోగం తగ్గించాలి**

రైతులు అవసరం లేకుండా విచక్షణారహితంగా పురుగు మందులను వినియోగించవద్దని శాస్త్రవేత్త సూచించారు. అధికంగా రసాయన పురుగు మందులను ఉపయోగించడం వల్ల పెట్టుబడి భారం పెరగడంతో పాటు పర్యావరణానికి, మిత్ర పురుగులకు నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల సమగ్ర సస్యరక్షణ విధానాలను అవలంబించాలని సూచించారు. పురుగుల నియంత్రణకు వేప ఆధారిత ఉత్పత్తులు, జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు వంటి పద్ధతులను వినియోగించాలని తెలిపారు. పంటలో పురుగు ఉనికిని గుర్తించిన తర్వాతే అవసరమైన చర్యలు చేపట్టాలని, ముందస్తుగా అధిక మోతాదులో రసాయన మందులు పిచికారీ చేయడం సరికాదని రైతులకు వివరించారు.

**తక్కువ నీటితో ఆరుతడి పంటలకు ప్రాధాన్యం**

ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో ముందుచూపుతో వ్యవహరించాలని డాక్టర్ విశ్వతేజ తెలిపారు. నీటి వసతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేయడం సాధ్యం కాని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలైన జొన్న, పెసర, బొబ్బెర తదితర పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు. నీటి లభ్యత, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని పేర్కొన్నారు.

**మొబైల్ యాప్ ద్వారా ఎరువుల బుకింగ్**

ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ మల్లంపల్లి మండలంలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమకు అవసరమైన ఎరువులను మొబైల్ యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉందని వివరించారు. రైతులు ఎరువులను అవసరానికి అనుగుణంగా మాత్రమే వినియోగించుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓల సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేయాలని కోరారు.

**రైతుల సందేహాలకు నివృత్తి**

కార్యక్రమంలో రైతులు పంటల సాగు, పురుగు మందుల వినియోగం, వాతావరణ మార్పుల ప్రభావం, ప్రత్యామ్నాయ పంటలు, ఎరువుల లభ్యత తదితర అంశాలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నించారు. రైతులు అడిగిన సందేహాలను డాక్టర్ ఆర్. విశ్వతేజతో పాటు అధికారులు నివృత్తి చేశారు.

**ఆత్మ ప్రతినిధులు, రైతుల పాల్గొనడం**

ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్ కొంగరి పైడి, బిలావత్ మల్లిక, సభ్యులు జింక వేణు, ఎం.డి. అంకుష్, సాన్‌రెడ్డి దిలీప్, చిట్టిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ జ్యోతి రాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతులు జగ్గరం ఓకే, గొర్రె మహేందర్, మల్లారెడ్డి, కిరణ్, అరుణ్, సంతోష్ తదితరులు పాల్గొని పంటల సాగుపై నిపుణుల నుంచి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ సాగు చేస్తే పెట్టుబడి వ్యయం తగ్గించుకోవడంతో పాటు పంట దిగుబడులను కాపాడుకునే అవకాశం ఉంటుందని కార్యక్రమంలో సూచించారు.

# ఘట్టమ్మ ఆలయం వద్ద భక్తులపై వేధింపులు!

**భక్తుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని అడ్డగోలు వసూళ్లా**

**కొబ్బరికాయకు రూ.50.. మేకలు, కోళ్ల కోతకు అదనపు రుసుములు**

**ప్రశ్నించిన భక్తులపై దురుసు ప్రవర్తన.. దేవాదాయ శాఖ తక్షణమే స్పందించాలంటూ డిమాండ్**



**ములుగు ఆగస్టు 29 ( మీడియా టుడే ):** ప్రసిద్ధ ఘట్టమ్మ ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అక్కడి పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భక్తుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారని, ప్రశ్నించిన భక్తులతో దురుసుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అందాల్సిన కనీస సౌకర్యాలు, పారదర్శక ధరల విధానం లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**కొబ్బరికాయకు ఏకంగా రూ.50..**

ఆలయానికి వచ్చే భక్తులు పూజా కార్యక్రమాల్లో భాగంగా కొబ్బరికాయలు కొనుగోలు చేస్తుండగా, ఒక్క కొబ్బరికాయను ఏకంగా రూ.50కు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా లభించే వస్తువులకు సైతం అధిక ధరలు వసూలు చేస్తున్నారని భక్తులు వాపోతున్నారు. ఆలయ పరిసరాల్లో విక్రయించే పూజా సామగ్రికి ధరలను స్పష్టంగా ప్రదర్శించకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అంటున్నారు.

**మేకలు, కోళ్ల కోతకు అదనపు రుసుములా..?**

ఆలయ పరిసరాల్లో మేకలు, కోళ్ల కోతలకు సంబంధించి కూడా అదనపు రుసుములు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే నిర్ణయించిన రుసుములు ఉంటే వాటిని స్పష్టంగా ప్రకటించాలని, అదనంగా వసూలు చేస్తున్నట్లయితే సంబంధిత అధికార యంత్రాంగం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

**ఫోన్‌పే సౌకర్యం లేక ఇబ్బందులు**

ప్రస్తుత కాలంలో ప్రతి చోటా డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఆలయ పరిసరాల్లోని కొన్ని వ్యాపారుల వద్ద ఫోన్‌పే వంటి ఆన్‌లైన్ చెల్లింపు సౌకర్యం అందుబాటులో లేకపోవడంపై కూడా భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు పారదర్శకంగా చెల్లింపులు చేసే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

**ప్రశ్నిస్తే దురుసు సమాధానాలు..**

అధిక ధరలు, అదనపు రుసుములపై ప్రశ్నించిన భక్తులతో కొందరు వ్యాపారులు అనాగరికంగా, దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు మరింత ఆందోళనకు కారణమవుతున్నాయి. ఆలయానికి భక్తులు ప్రశాంతంగా వచ్చి పూజలు చేసుకునే వాతావరణం ఉండాల్సిన చోట ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం సరికాదని భక్తులు అంటున్నారు.

**దేవాదాయ శాఖ తక్షణమే స్పందించాలి**

ఆలయ ప్రాంగణంలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ వసూళ్లు, భక్తులపై దురుసు ప్రవర్తనపై దేవాదాయ శాఖ అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వ్యాపారులు, సిబ్బందిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భక్తుల నుంచి వసూలు చేస్తున్న ధరలు, రుసుముల విషయంలో పూర్తి పారదర్శకత ఉండాలని, ఎలాంటి అదనపు వసూళ్లకు తావులేకుండా అధికారులు పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ధరల పట్టిక ఏర్పాటు చేయాలి**

ఆలయ పరిసరాల్లో విక్రయించే కొబ్బరికాయలు, పూజా సామగ్రి తదితర వస్తువుల అధికారిక ధరల పట్టికను భక్తులకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే మేకలు, కోళ్ల కోతలకు వర్తించే రుసుములను కూడా బహిరంగంగా ప్రదర్శించాలని సూచిస్తున్నారు. ధరలు, రుసుముల విషయంలో భక్తులకు ఎలాంటి అనుమానం రాకుండా రశీదులు అందించే విధానాన్ని అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పించడం ద్వారా లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుందని పేర్కొంటున్నారు.

**నిరంతర పర్యవేక్షణ అవసరం**

ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఆలయ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి భక్తుల నుంచి ఫిర్యాదులు స్వీకరించే విధానం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. భక్తులకు ఇబ్బందులు కలిగించే వ్యాపారులపై హెచ్చరికలతో సరిపెట్టకుండా, ఆరోపణలు విచారణలో నిజమని తేలితే వారి లైసెన్సులు రద్దు చేసేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**భక్తుల విశ్వాసానికి భంగం కలగకూడదు**

ఆలయం అంటే భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతత, విశ్వాసానికి ప్రతీక అని, అలాంటి పవిత్ర ప్రదేశంలో భక్తులను ఇబ్బందులకు గురిచేసే చర్యలు చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. భక్తుల నుంచి వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. 'భక్తుల విశ్వాసాన్ని వ్యాపార ప్రయోజనాలకు వాడుకోవద్దు.. ఆలయ పవిత్రత, భక్తుల గౌరవం కాపాడేలా అధికారులు చర్యలు తీసుకోవాలి" అంటూ భక్తులు, స్థానికులు దేవాదాయ శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రసాయన శాస్త్రంలో కిరణ్ కుమార్‌కు పీహెచ్.డీ.



**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 29 :** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి వున్నం కిరణ్ కుమార్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. ' ఎస్– బి ఐ ఎన్ ఓ ఎల్ ఫాస్ఫేట్, 2,4–థియాజోలిడిన్ డయోన్ ఉత్పన్నాల సంశ్లేషణ, వాటి జీవక్రియాశీలతల పరిశీలన, ఫావిపిరావిర్ (ఫావిపిరావిర్ ) తయారీ విధాన అభివృద్ధి' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కనకదుర్గా భాస్కర్ యమాజాల శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ కిరణ్ కుమార్ పరిశోధన, గణనీయమైన చికిత్సా సామర్థ్యం కలిగిన నూతన హెటెరోసైక్లిక్ సమ్మేళనాల రూపకల్పన, సంశ్లేషణ, జీవ మూల్యాంకనంపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనం యాంటీవైరల్ ఔషధం ఫావిపిరవిర్ కోసం ఒక మెరుగైన, విస్తరించదగిన సంశ్లేషణ ప్రక్రియను అభివృద్ధి చేయడంతో పాటు, యాంటీ బాక్టీరియల్, యాంటీ డయాబెటిక్, యాంటీ క్యాన్సర్ కార్యకలాపాలు కలిగిన ఆశాజనకమైన (ఎస్)–బినోల్ ఫాస్ఫేట్, 2.4–థయాజోలిడిన్ డయోన్ ఉత్పన్నాలను గుర్తించిందన్నారు. ఈ పరిశోధన పారిశ్రామిక అనువర్తనాలకు సంభావ్యత ఉన్న ఆచరణాత్మక సంశ్లేషణ పద్ధతులను అందిస్తుందని, భవిష్యత్తు ఔషధ అభివృద్ధి, ప్రీ–క్లినికల్ పరిశోధనలకు బలమైన పునాది వేస్తుందని తెలిపారు. డాక్టర్ కిరణ్ కుమార్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించడమే గాక, ఔషధ రసాయన శాస్త్ర పరిశోధనకు ఆయన చేసిన విలువైన కృషిని ప్రశంసినట్టు వివరించారు. డాక్టరేట్ పరిశోధన అంతటా అంకితభావంతో మార్గనిర్దేశనం చేయడంతో పాటు సలహాలు అందించినందుకు డాక్టర్ కనక దుర్గా భాస్కర్ యమాజాలను కూడా అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ వెలుగులు

**ములుగు సర్కిల్ పరిధిలో 630 కేంద్రాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు**

**చిన్నారుల భవిష్యత్తుకు మెరుగైన వసతులే లక్ష్యం**

**విద్య, ఆరోగ్యం, పోషణ కార్యక్రమాలకు విద్యుత్ సౌకర్యం ఎంతో కీలకం: ఎస్ఈ బి. బిక్షపతి**

**ములుగు ఆగస్టు 29( మీడియా టుడే)** చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణంతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు ఎన్పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ములుగు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్షపతి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేక చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి సర్కిల్ పరిధిలోని 630 అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వెల్లడించారు.

**630 కేంద్రాలకు ఉచిత కనెక్షన్లు**

ములుగు సర్కిల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడంపై ఎన్పీడీసీఎల్ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మొత్తం 630 కేంద్రాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు ఎస్ఈ బి. బిక్షపతి తెలిపారు. విద్యుత్ కనెక్షన్లు అందుబాటులోకి రావడంతో ఆయా కేంద్రాల్లో మౌలిక వసతుల వినియోగానికి మరింత అవకాశం ఏర్పడిందన్నారు.

**ఫ్యాన్లు.. లైట్లు.. తాగునీటి మోటార్లు**

విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి మోటార్లు, ఇతర విద్యుత్ పరికరాలను వినియోగించుకునే అవకాశం ఏర్పడిందని ఎస్ఈ వివరించారు. ముఖ్యంగా వేసవి, వర్షాకాలంలో చిన్నారులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు విద్యుత్ సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. చిన్నారులు ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో కూర్చుని విద్య, ఆటలు, అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మెరుగైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.

**పోషకాహారం.. పరిశుభ్రతకు మరింత వెసులుబాటు**

అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం కేవలం లైట్లు, ఫ్యాన్లకే పరిమితం కాదని, చిన్నారులకు అందించే సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కూడా దోహదపడుతుందని ఎస్ఈ బిక్షపతి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారం తయారీ, తాగునీటి సరఫరా, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యుత్ సౌకర్యం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణకు సంబంధించిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించేందుకు మౌలిక వసతులు ఎంతో అవసరమన్నారు.

**చిన్నారుల భవిష్యత్తే లక్ష్యం**

చిన్నారుల సంక్షేమం, విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల ప్రాథమిక అభ్యసనానికి కీలక వేదికలని, అక్కడ వారికి సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, విద్యుత్ శాఖ చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలకు ఎన్పీడీసీఎల్ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.



# మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కి రాఖీ కట్టిన బి ఆర్ ఎస్ మహిళా కార్యకర్తలు



**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 29 :** రాఖీ పౌర్ణమి, రక్షా బంధన్ సందర్భంగా పటాన్ చెరు, బండ్లగూడకు చెందిన బి ఆర్ ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, వారికి రాఖీ కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ పటాన్ చెరు లోని బి ఆర్ ఎస్ మహిళా కార్యకర్తలందరూ తనకు ఇంటి ఆడపడుచుల వంటి వారన్నారు. వారి కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. రక్షా బంధన్ పండుగ సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు, కార్యకర్తలందరికీ రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ 420 హామీలు, ఆరు గ్యారంటీలపై ప్రజాక్షేత్రంలో పోరాటం: మాధవరం కృష్ణారావు



**కూకట్‌పల్లి, ఆగస్టు29, (మీడియా టుడే ప్రతినిధి)** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలపై టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజాక్షేత్రంలో పోరాటం చేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని డివిజన్ల మాజీ కార్పొరేటర్లతో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేదీ నుంచి మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి ప్రజా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 2న బోయినపల్లి, 4న బాలానగర్, 5న బేగంపేట, 6న ఫతేనగర్, 7న మూసాపేట్, 8న అల్లాపూర్, 9న బాలాజీనగర్, కేపీహెచ్‌బీ డివిజన్లలో సంయుక్తంగా, 10న కూకట్‌పల్లి డివిజన్‌లో సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డివిజన్ స్థాయిలో భారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, ఇంటింటికీ వెళ్లి 'బాకీ కార్డులు' అందజేస్తూ ప్రజలను చైతన్యపరచాలని ఆయన సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, తూము శ్రవణ్ కుమార్, పందాల సతీష్ గౌడ్, పగడాల బాబూరావు, ఎండీ సభిహ గౌసిద్దీన్, మహేశ్వరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధానోపాధ్యాయుడి పదవీ విరమణ



**ఖానాపూర్ మండలం ఆగష్టు 29,మీడియా టుడే.** వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మనుబోతులగడ్డ గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకాని అశోక్ పదవీ విరమణ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్, ఆయన సతీమణిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాకాని అశోక్ విద్యారంగానికి అందించిన సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థుల అభ్యున్నతితో పాటు పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యాబోధన అందించడమే కాకుండా వారి భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కృషి చేశారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన కుటుంబంతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. సన్మానం అందుకున్న కాకాని అశోక్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి ఆత్మీయంగా సన్మానించిన సర్పంచ్, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆబోతు శ్రీలత అశోక్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి ప్రమీల, ఉపసర్పంచ్ గొడుగు రమ యాకన్న, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు రవికుమార్, యువజన నాయకులు ఏష బోయిన పురుషోత్తం, రాగం సంతోష్, ఎస్కె అంకుస్, బోనగిరి సారయ్య, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు వరించడం పట్ల కలెక్టర్ హర్షం

**బోర్గాం(పి) జెడ్పీ హైస్కూల్ ను సందర్శించిన కలెక్టర్**



**నిజామాబాదు ఆగష్టు 29 (మీడియా టుడే ప్రతినిధి):** మోపాల్ మండలం బోర్గాం(పి) గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న బోధనా సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోనే ఇతర అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే అత్యధికంగా ఈ పాఠశాలలో 1120 మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండడం, ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు వరించడం పట్ల కలెక్టర్ హర్షం వెలిబుచ్చారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రీడా మైదానం లేదని నిర్వాహకులు తెలుపడంతో, స్కూల్ కు ఆనుకుని ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం, గ్రంథాలయ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వీటిని సమీపంలో మరో చోటికి మార్చేందుకు ఏమైనా అవకాశాలు ఉన్నాయా అన్నది పరిశీలించాలని, దీనివల్ల పాఠశాలకు క్రీడా మైదానం వసతి సమకూరడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు వీలవుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. బడికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలాన్ని సైతం కొంతమేర సేకరించి పాఠశాలను మరింతగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతిని సందర్శించి విద్యార్థిని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఫిజిక్స్, మ్యాథ్స్, ఆంగ్లం సబ్జెక్టులను బోధించి, పలు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థిని, విద్యార్థులకు పెన్నులు బహుమతిగా అందజేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సర్కారు బడులలో నాణ్యమైన విద్యా బోధనను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి. చేయాలని సూచించారు. పిల్లలను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా బయటి ప్రపంచానికి సంబంధించిన విషయ పరిజ్ఞానం కూడా కల్పించాలని ఉపాధ్యాయులకు హితవు పలికారు. ఏకాగ్రతతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విషయ పరిజ్ఞానం పెంపొందించుకుని ప్రతిభను మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, మోపాల్ తహసిల్దార్ రేఖ, ఎం.ఈ.ఓ సాయిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ తదితరులు ఉన్నారు

మీడియా టుడే
ఆదివారం, , ఆగస్టు 30, 2026

# మల్లంకుంట పై దుర్వాసన



మీడియా టుడే అచ్చంపేట (ఆగస్టు 29):
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని మల్లంకుంట ట్యాంక్ బండ్ పై దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు వ్యాపారులు కూరగాయలు, చికెన్ వంటి,వ్యర్థ పదార్థాలను కుళ్ళిన చెత్తను కుంటలో వేయడంతో అది పూర్తిగా కుళ్ళి దుర్వాసన దాన్ని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణించేవారు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. అధికారులు వ్యర్థాల పారివేతను అరికట్టి ట్యాంక్ బాండ్ పేరిన చెత్తను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# నల్లమల నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన బాలు నాయక్

**మీడియా టుడే అచ్చంపేట (ఆగస్టు 29):**



నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం దేవుల తండాకు చెందిన బాబు నాయక్ బాల్ బ్యాడ్మింటన్ లో అంతర్జాతీయ స్థాయిలో తన సత్తా చాటాడు. ఇండోనేషియాలో నిర్వహించిన అంతర్జాతీయ బాల్ బ్యాడ్మిట్ పోటీల్లో భారత్ తరపున పాల్గొని బంగారు పతకం సాధించాడు.నల్లమల అడవి ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి పథకం సాధించిన బాబు నాయక్ ను పలువురు అభినందించారు. యువతకు ఆయన ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

# ఈనెల 31న విద్యా వైద్యంపై జరిగే మండల కేంద్రాల ధర్నాలను జయప్రదం చేయండి

## సిపిఎం పార్టీ పిలుపు



**మీడియా టుడే అచ్చంపేట (ఆగస్టు 29):**
నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండల భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా వైద్యము స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా అమ్రాబాద్ మండల కేంద్రంలో 31 న జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ అమ్రాబాద్ మండల కార్యదర్శి ఎస్.మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యా వైద్యము అందరికీ అందాలని ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 31 న జరిగే మండల కేంద్ర ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో సిపిఎం పార్టీ నాయకులు సిహెచ్ బాలయ్య, సాయిలు, ఎస్ఎఫ్ఐ విద్యార్థులు షోయబ్, రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన పద్మశాలి విద్యార్థులకు సన్మానం



**మీడియా టుడే అచ్చంపేట (ఆగస్టు 29):**
46 వ నూలు పూర్ణిమ ఉత్సవాలలో భాగంగా శనివారం నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి కమ్యూనిటీ హాల్ లో 2025-26 వ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన పద్మశాలి విద్యార్థులకు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఇంటర్మీడియట్ లో 983 మార్కులు సాధించిన పులిజాల ప్రణదీప్ ప్రథమ బహుమతి, 947 మార్కులు సాధించిన ఇమ్మడి మణిదీప్ ద్వితీయ బహుమతులు అందుకున్నారు. అలాగే పదవ తరగతిలో సాక నక్షత్ర 571 మార్కులతో ప్రథమ బహుమతి, 568 మార్కులతో గంజి షణ్ముఖ ప్రియ ద్వితీయ బహుమతులు అందుకున్నారు. 46 వ నూలు పూర్ణిమ ఊరేగింపు విజయవంతం కావడంలో కృషి చేసిన కోలాటం మాస్టర్ కర్నాటి నవీన్, దాసపత్రి శకుంతలని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు కోట కిషోర్, ప్రధాన కార్యదర్శి పులిజాల రమేష్ , కోశాధికారి దాసు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పులిజాల యాదగిరి మ్యాకల సత్యనారాయణ, శివాలయ కమిటి అధ్యక్షులు వనం పర్వతాలు, మహిళ సంఘం అధ్యక్షురాలు దాసుపత్రి శకుంతల, గుర్రం హైమావతి, గుర్రం మల్లికార్జున్, గంజి రమేష్, పులిజాల భానుప్రసాద్ పాల్గొన్నారు.

# కోదాడలో సాగుతోంది ప్రజాస్వామ్యమా? ఆటవిక రాజ్యమా

**మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ ఆగ్రహం**

**పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని రాజకీయ కక్ష సాధింపులు, అక్రమ కేసులు**

**30 ఏళ్లుగా జీవనాధారమైన ఒంటరి మహిళ డబ్బా తొలగింపుపై తీవ్ర నిరసన**

**పోలీసుల పక్షపాత వైఖరి, దాష్టీకాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 2వ తేదీన పోలీస్ స్టేషన్ ఎదుట మహాధర్నాకు పిలుపు**

**మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్**



**కోదాడ, ఆగస్టు 29 (మీడియా టుడే)-:**
కోదాడ నియోజకవర్గంలో చట్టబద్ధమైన పాలన లేకుండా పోయిందని, అమాయకులపై దౌర్జన్యాలు చేస్తూ ఆటవిక రాజ్యం, పోలీసు రాజ్యం నడుపుతున్నారని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ తో కలిసి బాధితురాలు గంధం కనకమ్మ కుటుంబాన్ని పరామర్శించి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసు అధికారుల తీరును, అధికార పక్ష కక్ష సాధింపు చర్యలను తీవ్రంగా ఎండగట్టారు. వాట్సాప్ గ్రూపులలో ఫార్వర్డ్ మెసేజ్‌లు పెట్టారనే చిన్న కారణంతో హైదరాబాద్‌లో ఉన్న ఉపేందర్ అనే వ్యక్తిని ఏదో దేశద్రోహి తరహాలో కోదాడ పోలీసులు బలగాలతో వెళ్లి పట్టుకొచ్చి, అర్ధరాత్రి వరకు విచారణ పేరిట మానసిక క్షోభకు గురిచేశారని ఆరోపించారు. న్యాయవాదులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటీ కల్పించుకునేంత వరకు అక్రమంగా నిర్బంధించారని మండిపడ్డారు. ఉపేందర్‌కు సోదరి అయినందుకే కక్షగట్టి, కోదాడ బొడ్రాయి సెంటర్‌లో గత 30 ఏళ్లుగా పాన్ డబ్బా నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న కనకమ్మ అనే ఒంటరి మహిళ డబ్బాను తెల్లవారుజామున అకస్మాత్తుగా తొలగించడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాఖీ పండుగ వేళ న్యాయం కోసం నిరసన తెలిపిన మహిళలు, కుటుంబ సభ్యులపై సీఐ శివశంకర్ నేతృత్వంలో పోలీసులు గూండాల మాదిరిగా వ్యవహరించి దాష్టీకం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ బాధ్యతలు చేపట్టిన తర్వాతే పట్టణంలో గంజాయి దందాలు, అక్రమాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించారు. పట్టుబడ్డ క్వింటాన్నర గంజాయిని మాయం చేసి అమ్ముకున్నా, బర్రెల దొంగల నుంచి లంచాలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నా పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో తన ప్రెస్ మీట్‌పై ఒక సీఐ హోదాలో ఉండి అసభ్యకరంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినప్పుడు, ఆధారాలతో డీజీపీ, ఎస్పీ, డీఐజీ, కలెక్టర్లకు ఫిర్యాదు చేసినా ఏడాదిన్నరగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. జాతీయ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ జామ్ జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోతే స్పందించని పోలీసులు, సామాన్యుల పొట్ట కొట్టడానికి మాత్రం ఉత్సాహం చూపుతున్నారని విమర్శించారు. గతంలో రాజకీయ ఇబ్బందులు పెట్టేందుకు దళిత బిడ్డ కర్ల రాజేష్ ను ఎలా పొట్టనబెట్టుకున్నారో గుర్తుచేస్తూ, ఇప్పుడు అదే రీతిలో ఉపేందర్ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసి రోడ్డున పడేసే కుట్రలు చేస్తున్నారని హెచ్చరించారు. సామాన్య ప్రజల పొట్టకొట్టే దౌర్జన్యాలు ఆపాలని, బాధిత మహిళ కుటుంబానికి తక్షణమే పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల ఏకపక్ష వైఖరికి, అక్రమ కేసులకు నిరసనగా సెప్టెంబర్ 2వ తేదీన సహచర, ప్రజాస్వామిక పక్షాలను కలుపుకుని కోదాడ పోలీస్ స్టేషన్ ఎదుట భారీ ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు. చట్టం ప్రకారం న్యాయపోరాటం చేయడంతో పాటు ప్రజాక్షేత్రంలోనూ బాధితుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు.

# మాధవరం కృష్ణారావుపై విమర్శలు చేస్తే సహించం: రెడ్డి సతీష్ అరోరా



**కూకట్‌పల్లి, ఆగస్టు 29, (మీడియా టుడే ప్రతినిధి)**
కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.గత 30 ఏళ్లుగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజా తీర్పుతో మాధవరం కృష్ణారావు తన సత్తా చాటుతున్నారని, ఆయనపై కబ్జాల ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములపై స్పష్టత లేకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.హైదర్‌నగర్ సర్వే నంబర్లు 145, 163, హస్మత్‌పేట సర్వే నంబర్ 1 తదితర భూములకు సంబంధించి గతంలో కోర్టుల్లో జరిగిన పరిణామాలను పరిశీలించి, భూముల వ్యవహారంలో రాజకీయ నాయకుల పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 1958 నుంచి ఇప్పటివరకు ఆయా భూములకు సంబంధించిన వ్యవహారాలపై ప్రభుత్వం విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు.హస్మత్‌పేట సర్వే నంబర్ 1లో గతంలో నిర్మించిన అపార్ట్‌మెంట్లపై కూడా విచారణ జరపాలని సవాల్ చేశారు. అల్లాపూర్, గోపాల్‌నగర్‌లో భూవ్యవహారాలపై కూడా ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీలోని కొందరు నాయకులపై ఇటీవల చర్యలు తీసుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, అవినీతికి పాల్పడే వారిని తాము కూడా సమర్థించబోమని స్పష్టం చేశారు. పలుమార్లు పార్టీలు మారిన నాయకులు మాధవరం కృష్ణారావును విమర్శించే నైతిక హక్కు గురించి ఆలోచించుకోవాలని రెడ్డి సతీష్ అరోరా సూచించారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భూవ్యవహారాలపై వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని ఆయన హితవు పలికారు.

# ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి: వడ్డేపల్లి రాజేశ్వరరావు




**కూకట్‌పల్లి, ఆగస్టు 29, (మీడియా టుడే ప్రతినిధి)**
ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సూచించారు. కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మాధవ్‌బాగ్ అడ్వాన్స్‌డ్ ఆయుర్వేద క్లినిక్స్ అండ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, కొలెస్ట్రాల్, రక్తపోటు, థైరాయిడ్, అధిక బరువు వంటి జీవనశైలి సంబంధిత సమస్యలపై ప్రజలు ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.మెగా మెడికల్ క్యాంప్‌లో ఉచిత ల్యాబ్ పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, డైట్ సలహాలు, ఆయుర్వేద మార్గదర్శకత్వం, జీవనశైలి కౌన్సెలింగ్ వంటి సేవలు అందించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత చేరువ చేసేందుకు ఇలాంటి శిబిరాలను భవిష్యత్తులోనూ నిర్వహించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుమారస్వామి, రఘురాం, మాధవ్‌బాగ్ క్లినిక్ సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



**నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జి ఆగష్టు 29(మీడియా టుడే న్యూస్ )**
వరంగల్ జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం నర్సంపేట స్టేడియంలో మేజర్ ధ్యాన్ చంద్ సింగ్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.క్రీడారంగానికి మేజర్ ధ్యాన్ చంద్ చేసిన సేవలు చిరస్మరణీయమని, యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సంఘం నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పరికి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి యాట రవికుమార్ ముదిరాజ్, కోశాధికారి భవానీ చంద్, ఉపాధ్యక్షులు ఇరుగదిండ్ల వెంకటరత్నం, వజ్జ రాజేష్, ఈక కృష్ణ, సహాయ కార్యదర్శులు ఉరుసుల శేఖర్, ఓరుగంటి మహేష్, కార్యవర్గ సభ్యులు తోలేం సూర్యం, పుల్లూరి సుమన్, కార్తీక్, రజిని తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన యాజమాన్యం పట్టించుకోవడం లేదు

**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, ఆగస్ట్ 29 :**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేతనాలు పెంచాలని చెప్పిన యాజమాన్యం పట్టించుకోవడంలేదని కోహెన్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ స్టేట్ మినిమం వేజెస్ బోర్డ్ మెంబర్ ఎం రాజు ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ లోని అంజయ్య భవన్ లో కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆర్ఆర్ జోన్ శ్యామ్ సుందర్ రెడ్డి కి లికిత పూర్వక ఫిర్యాదు చేశారు. కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం కనీస వేతనాల బోర్డులో నిర్ణయించినటువంటి వేతనాలను జూన్ 1 నుండి అమలు చేయాలని ముఖ్యమంత్రి ప్రకటించారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు యాజమాన్యంకు చెప్పిన స్పందించకపోవడంతో జాయింట్ కమిషనర్ లేబర్ ఆర్ ఆర్ జోన్ కి ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే మూడు నెలల ఏరియాస్ తో సహా కార్మికులకు 10% జీతాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు రాజు చెప్పారు.

# కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

## కాకి ఈశ్వర్ ముదిరాజ్

**మహేశ్వరం నియోజకవర్గంలో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం**




**బాలాపూర్ (మీడియాటుడే ప్రతినిధి ) , ఆగస్టు 29:**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్‌లోని వై.ఏ.ఆర్. కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకి ఈశ్వర్ ముదిరాజ్ పాల్గొని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ అగ్ర నాయకత్వం, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ పదవులు అందిస్తున్నారని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అలాగే రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించినట్లు ఈశ్వర్ ముదిరాజ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల సీనియర్ నాయకులు గడగూటి జంగయ్య ముదిరాజ్, కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షులు నడికుడ శివ, బైరాగిగూడ గ్రామ సర్పంచ్ పలాస కృష్ణ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు మహమ్మద్ సర్వర్, మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, సీనియర్ నాయకులు మహమ్మద్ అహ్మద్ జానీ, శ్రీకాంత్ గౌడ్, అందియా నాయక్, మహేశ్వరం గ్రామ 10వ వార్డు ఇన్‌చార్జ్, ముదిరాజ్ సంఘం గ్రామ ఉపాధ్యక్షులు కాకి మల్లేష్ ముదిరాజ్, కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్‌మెంట్ మహేశ్వరం మండల చైర్మన్ మహమ్మద్ ఇర్షాద్, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ సోహెల్ అన్సారీ, ఉపాధ్యక్షులు మొహమ్మద్ జలాలుద్దీన్, అమీర్‌పేట్ గ్రామ వార్డు సభ్యులు మొహమ్మద్ షఫీ, గట్టుపల్లి గ్రామ ముస్లిం కమిటీ అధ్యక్షులు మహమ్మద్ సాబీర్, మహేశ్వరం మండల యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నడికూడా రాకేష్ ముదిరాజ్, ఎండి తండా ఇందిరమ్మ కమిటీ సభ్యులు నాగేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 92.వ విశ్వాశాంతి మహాయోగ మహోత్సవమ

**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి ఆగస్టు 29**



శ్రీ విష్ణు కాలచక్రం విష్ణు పంచాయతనం ఆయుధ చండీ అతిరుద్రం శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం చతుర్వేద పూర్వక మహాగణపతి, మహాసార, సుదర్శన, లక్ష్మీనారాయణ సహిత శ్రీమద్భాగవత 92.వ విశ్వశాంతి మహాయాగం మహోత్సవము శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీ శ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారి దివ్య మంగళ శాసనములతో రేపు 30 తేదీ నుండి సెప్టెంబర్ 13 వ తేదీ వరకు నిర్వహిస్తారు అధిక సంఖ్యలో భక్తుల రద్దీ ఉంటుంది భక్తులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయడమైనది వేల సంఖ్యలో భక్తులు వస్తారు అందరికీ ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనము సాయంత్రము అల్పాహారం ఉంటుంది అందరూ ఆహ్వానితులే స్వామీజీ తెలిపారు యాగ స్థలం విజయ డైరీ పక్కన పెబ్బేర్ రోడ్డు వనపర్తి జిల్లా, తెలంగాణ

## తెలుగు భాష దినోత్సవం సందర్బంగా అక్షర యోధునికి సన్మానం

**రామకోటి సంస్థ ఆధ్వర్యంలో తాటి కిషన్ కు సన్మానం**

**36 ఏళ్లుగా తెలుగు భాషకు విశిష్ట సేవలందించిన ఘనత**

**భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు**



**గజ్వేల్ ఆగస్టు 29మీడియా టూ డే**

తెలుగు భాష దినోత్సవం సందర్బంగా గత 36 ఏళ్లుగా తెలుగు భాషకు విశిష్ట సేవలందిస్తున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ కు చెందిన ప్రముఖ కవి, రచయిత తాటి కిషన్ ను శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ శనివారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు మాట్లాడుతూ అక్షరాన్ని ఆయుధంగా సాహిత్యాన్ని సమాజ సేవగా మలుచుకుని 36 ఏళ్లుగా తెలుగు భాషకు విశిష్ట సేవలందిస్తున్న అలుపెరగని అక్షర యోధుడు తాటి కిషన్ అన్నారు. పల్లె మట్టి నుంచి సాగిన ఆయన అక్షర ప్రస్థానం 16 కావ్యాల సాహిత్య సంపదగా విస్తరించి ఆయన కలం భక్తిని పలికించిందన్నారు. పల్లె ప్రజల కన్నీటిని అక్షరీకరించింది, దేశభక్తిని చాటిందన్నారు. సమాజంలోని అసమానతలను ప్రశ్నించింది. ఆర్తుల వేదనకు అక్షర రూపమిస్తూ, హింసకు తావులేని, లేని సమసమాజాన్ని ఆకాంక్షిస్తూ సాగుతున్న ఆయన సాహిత్య ప్రయాణం భావితరాలకు స్ఫూర్తిదాయకం అన్నారు.

## విలేకరిపై దాడి చేసిన సీఐని సస్పెండ్ చేయాలి

### TUWJ-143 జిల్లా అధ్యక్షుడు వజ్జె వీరయ్య

**కోదాడ, ఆగస్టు 29 (మీడియా టుడే)-:**



కోదాడ నియోజకవర్గ సీనియర్ జర్నలిస్ట్ సురేష్‌పై దాడికి పాల్పడిన కోదాడ పట్టణ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని ుఖఔజీ-143 జిల్లా అధ్యక్షుడు వజ్జె వీరయ్యయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం జరిగిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. వృత్తిపరంగా ప్రతి సంఘటనను చిత్రీకరించడం విలేకరి బాధ్యతలో భాగమని, తన వృత్తి ధర్మంలో భాగంగా వీడియో తీస్తున్న సురేష్‌పై సీఐ దాడి చేయడం దారుణమన్నారు.సీఐ కోదాడలో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విలేకరుల పట్ల ఆయన వ్యవహారశైలిపై పలు విమర్శలు వస్తున్నాయని వీరయ్య పేర్కొన్నారు. విలేకరులను దూషించే వారిని దగ్గరకు తీసుకుని, జర్నలిస్టుల పట్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఇటీవల దొంగతనం కేసుకు సంబంధించిన వ్యవహారంలో ఓ దళిత విలేకరి వార్త రాయడంతో అతడిని దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని అన్నారు.విలేకరుల పట్ల సీఐ వ్యవహరిస్తున్న తీరుపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు వజ్జె వీరయ్య తెలిపారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులను సహించేది లేదని, విలేకరుల హక్కుల పరిరక్షణకు యూనియన్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## ఘనంగా శ్రీ హిందూ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం



**యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే, ఆగస్టు 29: రామన్నపేట,ప్రతినిధి**

శ్రీ హిందూ కళాశాలలో ఘనంగా నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని శ్రీ హిందూ డిగ్రీ కళాశాల రామన్నపేటలో తేదీ 29-08-2026 శనివారం రోజున శ్రీ హిందూ డిగ్రీ కళాశాల రామన్నపేటలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.ప్రతి సంవత్సరం ఆగస్టు 29న తెలుగు భాషకు వారు చేసిన సేవలను గుర్తిస్తూ తెలుగు భాషా దినోత్సవాన్ని తెలుగు ప్రజలమైన మనమంతా వారికి సమర్పించే నిజమైన భాషా ప్రేమికులుగా నిలిచి మన భాషను మనం కాపాడుకోవాలని శ్రీ హిందూ కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ రావు వారి యొక్క సేవలను కొనియాడారు వ్యవహారిక భాష పట్ల వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అలాగే శ్రీ దాశరధి రంగాచార్య జయంతిని కూడా జరుపుకొని తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది శ్రీమతి సహస్ర,అలాగే వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి శ్రీదేవి,సతీష్ కుమార్, శ్రీశైలం,లింగస్వామి, వెన్నెల,కళ్యాణి,శ్వేత బాలరాజు విద్యార్థిని విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా గోపూజ

### -తన తల్లి జ్ఞాపకార్థం గోశాలకు విరాళం అందజేత

**మర్కుక్, ,ఆగస్టు29, మీడియా టుడే**



మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో శనివారం శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో గోపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.గతంలో పాములపర్తి గ్రామంలో ఉన్నటువంటి గ్రామ పురోహితులు రాధాకృష్ణ పంతులు భార్య సుగుణ భాయ్ జ్ఞాపకార్థం వారి కుమార్తె విజయ అల్లుడు మనోహర్ రామాలయంలో గోపూజ చేసి గోశాలకు 5000 రూపాయలు విరాళం ఆలయ వ్యవస్థాపకులు ఎస్.హనుమంతరావు(హరి పంతులు)కు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత మా అమ్మ పేరున రామాలయంలో గోపూజ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అనీష్ త్రిపాటి,బేతి వెంకటరెడ్డి,తలకొక్కుల మల్లేశం,చారి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ్ దంపతులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం



**కోదాడ, ఆగస్టు 29 (మీడియా టుడే)-:**

ఉత్తమ్ దంపతులు కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని చేసిన అభివృద్ధిపై చర్చకి రావాలని వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని కోదాడ మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.శనివారం కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గత 5 ఏళ్ల ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి ఇప్పుడు జరిగిన అభివృద్ధిపై చర్చకు దమ్ము, ధైర్యం ఉంటే సమయము, ప్లేసు చెబితే అక్కడికి వస్తామని కానీ పుణ్య దంపతులపై వ్యక్తిగత విమర్శలు చేస్తే మా తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. కౌన్సిలర్ గా ఓడిపోయిన ఉపేందర్ అనే వ్యక్తి డబ్బా కొట్టు పెట్టుకొని బ్రతుకుతున్నాడు అన్న పదానికి అర్థం లేదని ఉత్తమ్ దంపతులు క్షుద్ర పూజలు చేస్తున్నారు అనటం సిగ్గుమాలిన చర్య అని దీని వెనక బొల్లం మల్లయ్య యాదవ్ హస్తం ఉందని అన్నారు. ఇలా అన్న వ్యక్తిని పట్టణ సిఐ ఏ ఆయుధం లేకుండా అతనిని అదుపులోకి తీసుకోవటం దానిని కూడా రాజకీయం చేయటం సబబు కాదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ యువకులను రెచ్చగొట్టి ఈ విధంగా అనిపించటం వారి భవిష్యత్తుని నాశనం చేయడం ఘోరమైన చర్యఅని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవాకులు చవాకులు పేలితే కాంగ్రెస్ సైన్యం పొరపాటున కూడా ఊరుకోదని హెచ్చరించారు.ఈ సమావేశంలో కోదాడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శరభయ్య,మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు కొత్తా గురువయ్య, కాంగ్రెస్ నాయకులు భాష బోయిన భాస్కరరావు, సీతారాంరెడ్డి, నంబూరి సూర్యం,నలజాల శ్రీనివాసరావు,మండల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిలో ప్రతి అంగుళం భూమి సర్వే

**వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**సూర్యాపేట బ్యూరో (మీడియా టుడే):**

రాష్ట్రవ్యాప్తంగా రానున్న ఏడాది కాలంలో వివాదరహిత భూములను ప్రతి అంగుళం సర్వే చేసి, నిజమైన భూ ఆసాములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.శనివారం నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన 15 గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి, 1,061 మంది రైతులకు 1,044 ఎకరాలకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సాగు చేసుకుంటున్న భూములకు ఏళ్ల తరబడి పట్టాలు లేక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తాతల కాలం నుంచి కొనసాగుతున్న భూ సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరిస్తున్నామని చెప్పారు.ప్రతి అంగుళం భూమిని అధికారులు సర్వే చేసి, నిజమైన హక్కుదారులను గుర్తించి హక్కు పత్రాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోం దన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో తొలివిడతగా 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహి స్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో పలుచోట్ల రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములు కబ్జాలకు గురవుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పంచాయతీ లేని భూములతో పాటు భూములు కలిగి ఉన్న అర్హులైన ఆసాములందరికీ పట్టాలు అందిస్తామని పునరుద్ఘాటించారు.గత ప్రభుత్వం రూ.8.21 లక్షల కోట్ల అప్పును తమ ప్రభుత్వంపై మోపినప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగకుండా ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి తెలిపారు. రైతులకు న్యాయం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పట్టాలు ఇవ్వకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు.గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలోని మహిళలకు రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని, రానున్న రెండున్నరేళ్లలోనూ అదే స్థాయిలో రుణాలు అందిస్తామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో కోట్ల రూపాయల విలువైన భూముల్లో ఇందిరమ్మ టవర్లు నిర్మించి ఇస్తున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి తొలివిడతలో 3,500, రెండో విడతలో 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని స్పష్టం చేశారు.

**భూమి హక్కు ఉంటే రైతుకు ధైర్యం: కోమటిరెడ్డి**

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పరిష్కారం పట్టాల పంపిణీతో లభిస్తోందన్నారు. భూమిపై హక్కు ఉంటే రైతుకు ధైర్యం ఉంటుందని, రైతుబంధు, రైతుభరోసా, రైతుబీమా తదితర ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షలు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.36 వేల కోట్లతో హైమాస్ట్ రోడ్లు నిర్మిస్తున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి రూ.100 కోట్లతో రోడ్లు మంజూరు చేశామని, మరో రూ.200 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. సూర్యాపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లు వేస్తామని తెలిపారు. సన్నబియ్యం, రైతుభరోసా, రైతుబంధు వంటి పథకాలను అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోమన్నారు. ప్రతి గుడిసె స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి, గుడిసెలేని తెలంగాణగా మారుస్తామని చెప్పారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాపాలన: చామల**

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజాపాలన అన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని రైతుల భూ సమస్యలు పట్టాల పంపిణీతో పరిష్కారమయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత బస్సు వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**60 ఏళ్ల భూ సమస్యకు పరిష్కారం: మందుల సామేలు**

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పొలాలను సాగు చేసుకుంటున్నప్పటికీ హక్కులు లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. 60 ఏళ్లుగా కొనసాగుతున్న భూ సమస్యకు పరిష్కారం చూపి పట్టాలు అందిస్తున్నందుకు ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టాల పంపిణీతో రైతులు తమ భూములకు చట్టబద్ధమైన హక్కుదారులుగా మారారని అన్నారు.గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల ఎకరాల భూములకు పట్టాలు ఇచ్చిందని, దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ హక్కు పత్రాలు అందించామని తెలిపారు. భూమి రైతుకు ఆత్మగౌరవమని, భూమిపై హక్కు లేకుంటే గుర్తింపు ఉండదన్నారు.తుంగతుర్తి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లను మంజూరు చేయడంతో పాటు అదనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

**3 వేల ఎకరాలకు పైగా సర్వే: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ.. సీలింగ్ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత కూడా వివిధ కారణాలతో పట్టాలు పొందలేని రైతులు రైతుబంధు, రైతుబీమా, రైతుభరోసా, రుణాలు, విత్తనాలు తదితర ప్రయోజనాలు పొందలేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు.ఇందులో భాగంగా నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 15 గ్రామాల్లో 3,000 ఎకరాలకు పైగా భూములను సర్వే చేసి పరిశీలించినట్లు తెలిపారు. రైతుల పొలాల వద్దకు వెళ్లి నోటీసులు అందించిన అనంతరం ముసాయిదా హక్కుదారుల జాబితాను ప్రకటించినట్లు వివరించారు. సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందిస్తున్నామని, ఈ రెండు మండలాల్లో 1,061 మంది రైతులకు 1,044 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.భూ భారతి కింద రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తున్నామని, ఖాతాలు లేని వారికి కొత్తగా ఖాతాలు సైతం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, సీసీఎల్ఏ కార్యదర్శి లోకేష్‌కుమార్, ల్యాండ్ సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ హరిసింగ్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగువాడిగా గర్వించు తెలుగులోనే సంభాషించు

**తెలుగు నేర్చుకో మాతృ రుణం తీర్చుకో -కేజీబీవీ ఎస్ఓ సరిత**

**మీడియట్ టుడే ఎర్రుపాలెం:**



తెలుగు భాష పల్లె పొలిమేరలో పలుకులు పంట పండి తెలుగు తల్లి ఒడిలో తరతరాల పెరిగే మన ఊపిరి ఘనత గల తెలుగు భాష దినోత్సవం కేజీబీవీ ఎస్ ఓ సరిత ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గిడుగు వెంకట రామ్మూర్తి జన్మదిన పురస్కరించుకొని ఎస్ ఓ సరిత, కళాశాల విద్యార్థునులు, ఉపాధ్యాయినీలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగు మొదటిగా గ్రాంథిక రూపంలో ఉండటం వలన భాష నేర్చుకోవడానికి పలు ఇబ్బందులు పడుట గ్రహించిన గిడుగు రామ్మూర్తి దానిని సులువుగా నేర్చుకునేలా తెలుగు భాషని వ్యవహార భాష శైలిలో దానిని సరళంగా అనువదించారు. ఆయన తెలుగు ప్రాశస్త్యాన్ని చాటిన గొప్ప మేధావని కీర్తించారు. అనంతరం విద్యార్థునులు తెలుగు తల్లి ఇతర వేషధారణలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరింపజేశారు. మన భాషని ఇతర రాష్ట్రాలలో, దేశాలలో చాటి చెప్పేలా తెలుగు గొప్పతనాన్ని చాటాలని విద్యార్థిని, విద్యార్థులు తెలుగుని ఇష్టంగా చదవాలని, తెలుగు సబ్జెక్టుని చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు.అమ్మ భాషకు వందనం,తెలుగు భాషకు అభివందనం అందరికీ తెలుగు భాష దినోత్సవ శుభాకాంక్షలు.ఈ కార్యక్రమంలో తెలుగు టీచర్లు టి పద్మ, జి ఉమామహేశ్వరి, కేజీబీవీ సిబ్బంది విద్యార్థునులు పాల్గొన్నారు

## ఇరువైపులా కంపచెట్లు.. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

**మునగాల,ఆగస్టు 29 (మీడియా టుడే)-:**

మునగాల మండల కలుకోవ గ్రామం నుండి నడిగూడెం పోయే రహదారికి ఇరువైపులా కంపచెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెట్ల కొమ్మలు రోడ్డుపైకి విస్తరించడంతో రహదారి ఇరుకుగా మారి ఎదురెదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందికరంగా మారింది.ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్డుపైకి వచ్చిన కొమ్మలు, కంపచెట్లు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ప్రజలు ప్రజా నాయకులు వాపోతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలను, తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగేలోపే అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# శిల్పారామం లో సాంస్కృతిక కార్యక్రమాలు



**శేరిలింగంపల్లి మీడియా టుడే న్యూస్ ఆగస్టు 29:**
శిల్పారామంలో మాదాపూర్ లో అంగరంగ వైభవంగా 'శ్రీకృష్ణ' నర్తనం సాంస్కృతిక ప్రదర్శన సిరి ఆర్ట్స్ ఇన్స్టిట్యూట్ మరియు సత్య కృష్ణ కూచిపూడి కళా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో 'శ్రీకృష్ణ'నర్తనం పేరిట నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. చిన్నారుల అద్భుతమైన నృత్య రూపకాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. శ్రీ కృష్ణ లీలల అద్భుత ఆవిష్కరణ: చిన్నారులు తమ ప్రదర్శన ద్వారా శ్రీకృష్ణుని బాల్య లీలలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. చెరసాలలో శ్రీకృష్ణుని జన్మఘట్టం, గోవర్ధనగిరి ఎత్తడం మరియు పలు పౌరాణిక ఘట్టాలను పరవశింపజేసే రీతిలో అభినయించారు. కంస వధతో కృష్ణుడి నర్తన కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా ముగిసింది. చిన్నారుల హావభావాలు, అభినయం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన బాల కళాకారులను రష్యన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్ అలెగ్జా దంపతులు మరియు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త తంగిరాల పురుషోత్తంవారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల కళా ప్రతిభను, వారిని తీర్చిదిద్దిన గురువుల కృషిని ఎంతగానో కొనియాడారు. శిల్పారామానికి విచ్చేసిన పర్యాటకులు మరియు కళాభిమానులు ఈ కార్యక్రమాన్ని తిలకించి పరవశించిపోయారు. చిన్నారుల ప్రతిభను ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.

# బుటారం పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా

**గేటు ఏర్పాటు చేస్తా**

**ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సర్పంచ్ శ్రీలత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు**

**విద్యార్థులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్న ప్రజాప్రతినిధులు**



**ఏటూరునాగారం, ఆగస్టు 29 (మీడియా టుడే):**
ఏటూరునాగారం మండలంలోని బుటారం ప్రాథమిక పాఠశాలను శనివారం సర్పంచ్ శ్రీలత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు సందర్శించారు. పాఠశాలకు చేరుకున్న ప్రజాప్రతినిధులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన వారు వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాలకు గేటు ఏర్పాటు చేస్తాపాఠశాలకు గేటు లేకపోవడంతో విద్యార్థుల భద్రతకు ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సర్పంచ్ శ్రీలత పాఠశాలకు అవసరమైన గేటును ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. పాఠశాల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్న ప్రజాప్రతినిధులకు ఉపాధ్యాయుడు ముత్తయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పర్వతాలు ఎల్లయ్య, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన పద్మశాలి విద్యార్థులకు సన్మానం.



**మీడియా టుడే అచ్చంపేట (ఆగస్టు 29):**
46 వ నూలు పూర్ణిమ ఉత్సవాలలో భాగంగా శనివారం నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి కమ్యూనిటీ హాల్ లో 2025-26 వ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన పద్మశాలి విద్యార్థులకు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఇంటర్మీడియట్ లో 983 మార్కులు సాధించిన పులిజాల ప్రణదీప్ ప్రథమ బహుమతి, 947 మార్కులు సాధించిన ఇమ్మడి మణిదీప్ ద్వితీయ బహుమతులు అందుకున్నారు. అలాగే పదవ తరగతిలో సాక నక్షత్ర 571 మార్కులతో ప్రథమ బహుమతి, 568 మార్కులతో గంజి షణ్ముఖ ప్రియ ద్వితీయ బహుమతులు అందుకున్నారు. 46 వ నూలు పూర్ణిమ ఊరేగింపు విజయవంతం కావడంలో కృషి చేసిన కోలాటం మాస్టర్ కర్నాటి నవీన్, దాసపత్రి శకుంతలని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు కోట కిషోర్, ప్రధాన కార్యదర్శి పులిజాల రమేష్ , కోశాధికారి దాసు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పులిజాల యాదగిరి మ్యాకల సత్యనారాయణ, శివాలయ కమిటి అధ్యక్షులు వనం పర్వతాలు, మహిళ సంఘం అధ్యక్షురాలు దాసుపత్రి శకుంతల, గుర్రం హైమావతి, గుర్రం మల్లికార్జున్, గంజి రమేష్, పులిజాల భానుప్రసాద్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు పాదయాత్ర

**టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం.. అఖిలపక్షాల సంఘీభావం**




**మీడియా టుడే ఎర్రుపాలెం:**
రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఖమ్మం జిల్లా స్థాయి పాదయాత్ర శనివారం ఎర్రుపాలెం మండలంలో కొనసాగింది. మండల కేంద్రంలోని రింగ్ సెంటర్ నుంచి స్థానిక జర్నలిస్ట్ లతో కలిసి ర్యాలీగా బయలుదేరి గాంధీ బొమ్మ సెంటర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి, రైల్వే స్టేషన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ కె. సునీత ఎలిజిబెత్‌కు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా ప్రభుత్వానికి తమ వినతిని తెలియజేయాలని కోరారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు కల్పించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. పాదయాత్రకు మండలంలోని వివిధ రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, గ్రామపంచాయతీ సర్పంచ్ నంద్రు అశ్విని, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు శీలం కవిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరెడ్డి, దోమందుల సామేలు, బీజేపీ మండల అధ్యక్షుడు అనుమోలు సురేష్, నూతక్కి నరసింహారావు, సీపీఎం నాయకులు గామాసు జోగయ్య, నాగులవంచ వెంకటరామయ్య, యూటీఎఫ్ నాయకులు అనుమోలు కోటేశ్వరరావు, కంచర్ల శ్రీనివాసరావు, నంద్రు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పాదయాత్ర నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టుల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తమ పాదయాత్రకు సంఘీభావం తెలిపిన మండల అఖిలపక్షం నాయకులకు జర్నలిస్ట్ లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోటిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి తేనే వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, టిబీజేఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు నలబోల మధుశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.ఎస్. చక్రవర్తి, రాష్ట్ర నాయకులు మారెడ్డి నాగేందర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గరిదేపల్లి వెంకటేశ్వర్లు, దగ్గుపాటి మాధవరావు, జానీ పాషా, కొరకొప్పుల రాంబాబు, గుడిమెట్ల మోహన్‌రావు, టిబీజేఏ కెమెరామెన్స్ జిల్లా కార్యదర్శి భూక్యా గణేష్, కోశాధికారి యూసఫ్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు అర్షద్, నాయకులు గంగుల గోపి, మందా శరత్, చిత్రా పవన్, తిరుపతిరావు, ఎండి షకీల్ మహ్మద్, సామ్రాట్ గుప్తా, కెదాసి కిరణ్‌కుమార్, స్థానిక పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా కబడ్డీకి మరో జాతీయ స్థాయి ఘనత

**ఎర్దుక్, ఆగస్టు 29 ,మీడియా టుడే**
సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోచ్ అంగడి నరేంద్ర బాబు జాతీయ స్థాయి కబడ్డీ రెఫరీ అర్హత సాధించడం పట్ల సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అమేచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏకెఎఫ్ఐ) నిర్వహించే జాతీయ స్థాయి రెఫరీ పరీక్షలో అంగడి నరేంద్ర బాబు విజయవంతంగా అర్హత సాధించడం సిద్దిపేట జిల్లా కబడ్డీ క్రీడారంగానికి గర్వకారణమని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌సీ సంతోష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ళ శివ కుమార్ అంగడి నరేంద్ర బాబును హృదయపూర్వకంగా అభినందించారు. ఇప్పటికే సిద్దిపేట జిల్లా నుంచి చిల్లీ మహేష్, రమ్య జాతీయ స్థాయి రెఫరీ అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అంగడి నరేంద్ర బాబు కూడా ఈ అర్హత సాధించడం ద్వారా జిల్లాకు మరో ఘనత చేకూరిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి సత్యం, ఉపాధ్యక్షులు రాజు, జాయింట్ సెక్రటరీలు మహేష్, కరుణాకర్తో పాటు అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తూ అంగడి నరేంద్ర బాబుకు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయి రెఫరీగా అర్హత సాధించిన అంగడి నరేంద్ర బాబుకు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ తరఫున హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాము.



# మున్సిపల్ కార్మికుల పట్ల వివక్ష తగదు

**వేతనాల్లో కోత విధించడం సరికాదు -- ఎన్ఎంఆర్ కార్మికులను పర్మినెంట్ చేయాలి**

**ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు కొత్తకొండ రాజమౌళి డిమాండ్**



**నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ ఆగస్టు 29 (మీడియా టుడే న్యూస్ )**
రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ కార్మికుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపడం తగదని, వారి వేతనాల్లో కోత విధించే చర్యలను వెంటనే విరమించుకోవాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు కొత్తకొండ రాజమౌళి డిమాండ్ చేశారు. ఎన్ఎంఆర్ కార్మికులను పర్మినెంట్ చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు నర్సంపేటలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులకు కనీస నెల వేతనం రూ. 26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 14ను సవరిస్తూ, అప్పటి వేతనాల కంటే రూ. 3,000 పెంచుతూ 11-06-2021న జీఓ నంబర్ 68ను విడుదల చేసిందని తెలిపారు. ఆ జీఓ ప్రకారం మున్సిపల్ కార్మికులకు రూ. 15,600, స్కిల్డ్ కార్మికులకు రూ. 19,500, హై స్కిల్డ్ కార్మికులకు రూ. 22,750 వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారని అన్నారు. అయితే, 12-07-2026న జీఓ నంబర్ 1181ను విడుదల చేసి, ప్రస్తుతం అమలులో ఉన్న వేతనాలను తగ్గించేలా నిర్ణయం తీసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇలాంటి చర్యలు కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధమని, గంలో అమలులో ఉన్న పద్ధతి ప్రకారమే వేతనాలు చెల్లించాలని కోరారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, వితంతు పెన్షన్, వృద్ధాప్య పెన్షన్ వంటి సంక్షేమ పథకాలను కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో అనారోగ్యానికి గురైన వారికి, అలాగే 60 సంవత్సరాలు దాటిన కార్మికుల కుటుంబాల్లో మానవతా దృక్పథంతో ఒకరికి ఉద్యోగం కల్పించాలని అన్నారు. విధి నిర్వహణలో కార్మికుడు మరణించినట్లయితే దహన సంస్కారాల నిమిత్తం రూ. 30,000 ఆర్థిక సాయం అందించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో భాగంగా రూ. 25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. మున్సిపల్ కార్మికుల హక్కులను ప్రభుత్వం హరిస్తే భవిష్యత్తులో కార్మిక ఉద్యమాలు మరింత బలోపేతం అవుతాయని కొత్తకొండ రాజమౌళి హెచ్చరించారు.

# అన్ని భాషల కన్న తెలుగు ఎంతో మధురమైనది

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం**



**యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,ఆగస్టు 29:రామన్నపేట,ప్రతినిధి**
వ్యవహారిక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవమును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ అన్ని భాషల కన్నా తెలుగు ఎంతో మధురమైనదని, చాలామంది భాషావేత్తలు తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని తెలియజేశారని అటువంటి మాతృభాష పట్ల నిరాదరణ కలిగి ఉండకూడదని అన్నారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ గ్రాంథిక భాషలో రచనలు చేయడం వల్ల సామాన్య ప్రజానీకానికి అర్థం కావని, కావున సామాన్య ప్రజలు మాట్లాడుకునే వ్యవహారిక భాషలోనే రచనలు చేయాలని వ్యవహారిక భాషా ఉద్యమాన్ని నిర్వహించడమే కాకుండా తెలుగు భాష కోసం ఎంతో కృషి చేసిన మహనీయుడని అన్నారు. అంతేకాకుండా గ్రాంథిక భాషా వాదులపై ఒక పిడుగులాంటివాడని, భాష పట్ల ఆయనకున్న అంకితభావం చాలా గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్. రత్న మంజుల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, పరిపాలనాధికారి జి. కరుణాకర్ తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రీన్‌హిల్స్ రహదారిపై 'జెడ్' మలుపులు

# ట్రాఫిక్ కష్టాలు

**కూకట్‌పల్లి, ఆగస్టు 29, (మీడియా టుడే ప్రతినిధి)**
కూకట్‌పల్లిలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన గ్రీన్‌హిల్స్ మార్గంలో 'జెడ్' ఆకారపు మలుపులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కైతలాపూర్ వంతెన వైపు, రంగధాముని చెరువు వైపు నుంచి గ్రీన్‌హిల్స్ రహదారికి చేరుకునే ప్రాంతాల్లో రహదారి వెడల్పు తక్కువగా ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి. అల్లాపూర్, అయ్యప్ప సొసైటీ, కాకతీయ హిల్స్ చౌరస్తాల్లో సిగ్నల్స్ ఉండటంతో ట్రాఫిక్ కొంత సాఫీగా సాగుతోందని స్థానికులు తెలిపారు. గ్రీన్‌హిల్స్ రహదారిలోని రెండు ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ప్రస్తుతం సాయంత్రం వేళ ట్రాఫిక్ నియంత్రణకు నలుగురు కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాల్సి వస్తోందని తెలిపారు. శాశ్వత పరిష్కారం చూపాలి: గ్రీన్‌హిల్స్ రహదారిలో ట్రాఫిక్ సమస్యను అధికారులు పరిశీలించి, సిగ్నల్స్‌ను పునరుద్ధరించాలని రెయిన్బో విస్టాస్ రాక్ గార్డెన్‌కు చెందిన బండి మధుసూదనరెడ్డి కోరారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే ఈ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.



# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



**కులకచర్ల,(మీడియా టుడే)29 ఆగస్టు:**
సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసుల ఆధ్వర్యంలో పుట్టపహాడ్ జెడ్పి హెచ్ ఎస్ పాఠశాలలో 'సైబర్ క్రైమ్ జాగృత దివస్' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు.?సదస్సులో ప్రతినిధి జుబిన్ మాట్లాడుతూ.. ఓటీపీ, ఏటీఎం పిన్, యూపీఐ పిన్, బ్యాంక్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. తెలియని లింకులు క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్, నకిలీ ఉద్యోగాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.?హెచ్‌ఎం మహేంద్ర బహదూర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులను కూడా సైబర్ మోసాలపై చైతన్యవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాజా, శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల సంక్షేమానికి ఈత మొక్కలు

**ఏటూరునాగారంలో వన మహోత్సవం.. పెద్ద ఎత్తున ఈత మొక్కల నాటకం**



**ఏటూరునాగారం, ఆగస్టు 29 ( మీడియా టుడే న్యూస్):**
గీత కార్మికుల ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో అటవీ శాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో గీత కార్మికులకు జీవనోపాధికి ఉపయోగపడేలా పెద్ద సంఖ్యలో ఈత మొక్కలను నాటారు.కార్యక్రమానికి సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై అటవీ శాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈత చెట్లు పెరిగి పెద్దవైన తర్వాత గీత కార్మికులకు కల్లు గీత ద్వారా జీవనోపాధికి ఆర్థికంగా ఉపయోగపడతాయని తెలిపారు. గౌడ కులవృత్తికి అవసరమైన ఈత చెట్లను విస్తృతంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ కుటుంబాలకు భవిష్యత్‌లో ఉపాధి కల్పించేలా ఈ కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు.మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణే ముఖ్యం అని పేర్కొంటూ నాటిన మొక్కలకు నీరు అందించి, పశువుల నుంచి రక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్‌రావు, ఎం.డి. వలీబాబా, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్‌గౌడ్, సప్పిడి రాంనర్సయ్య, తురం పద్మ, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, కార్యదర్శి జనార్ధన్, కన్నబోయిన రాజు యాదవ్ తదితరులతో పాటు గౌడ సంఘం నాయకులు, అటవీ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# స్వాభిమాన్ ఆత్మీయ సభ్యుడికి సన్మానం



**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా ఆగస్టు 29 :**
ఆర్మూర్ పట్టణం 2026--27 సంవత్సరానికి గాను ఆర్మూర్ ఆల్ టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా నియామకమైనటువంటి బిజెపి ఆర్మూర్ పట్టణ కార్యదర్శి, స్వాభిమాన్ కు ఆత్మీయ మిత్ర మండలి సభ్యులు అయిన రెడ్డబోయిన దక్షిణామూర్తి కి శనివారం స్వాభిమాన్ ఆత్మీయ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో జెస్సు అనిల్ కుమార్, ద్యాగ ఉదయ్, విజయానంద్, థోండి ప్రకాష్, పులి యుగంధర్, కలిగోట ప్రశాంత్, ఉదయ్ గౌడ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ పుట్టినరోజు




**యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,ఆగస్టు 29:రామన్నపేట,ప్రతినిధి**
హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవమును స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ హాకీ క్రీడ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి పేరు ప్రతిష్టలను సంపాదించి పెట్టిన గొప్ప క్రీడాకారుడు ధ్యాన్ చంద్ అని అన్నారు.ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొంది విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ ఎం.రవీందర్ రావుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహా సభలను జయప్రదం చేయండి

**వాల్ పోస్టర్ విడుదల -ఏ వై ఐ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సుద్దాల సాయికుమార్**

**జిల్లాలోని పరిశ్రమలలో స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పించాలి. ఏ ఐ వై ఎఫ్**




**యాదాద్రి భువనగిరి జిల్లామీడియా టుడే, ఆగస్టు 29: రామన్నపేట,ప్రతినిధి**
రామన్నపేట మండల కేంద్రంలో సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే 9 ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సుద్దాల సాయికుమార్ పాల్గొని ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో యువత శాతం అధికంగా ఉన్నప్పటికీ వారికి నాణ్యమైన విద్య,శాశ్వత ఉపాధి,అందుబాటు వైద్యం,నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రత కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు.జిల్లాలోని పరిశ్రమలలో స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన వార్షిక క్యాలెండర్,పెండింగ్ నియామకాల పూర్తి, జిల్లాల వారీగా పరిశ్రమల ఏర్పాటు,స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రైవేట్, కాంట్రాక్ట్,గిగ్ రంగాల్లో పనిచేస్తున్న యువతకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని కోరుతూ.యువత, విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక భారం,ఫీజుల సమస్యలు,పరీక్షల నిర్వహణలో జాప్యం, పేపర్ లీకులు,నిరుద్యోగ పోటీ పరీక్షల కోసం ఖరీదైన కోచింగ్‌పై ఆధారపడాల్సిన పరిస్థితిని ప్రభుత్వం ముగించాలని ఆయన అన్నారు.ప్రతి జిల్లాలో ఉచిత పోటీ పరీక్షల కోచింగ్ కేంద్రాలు,డిజిటల్ లైబ్రరీలు ,నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు,విద్యార్థి హాస్టళ్ల ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను బలోపేతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు కల్లెం స్వామి, కార్యదర్శి రచ్చ దయాకర్, ముగ్గు మత్స్యగిరి,ముగ్గు ప్రవీణ్,రచ్చ రాజేష్, ఊట్కూరి శ్రీను, ఊట్కూరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పర్యవేక్షణతో అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

**రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్,సహకార,చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల**

**నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజా ప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలి**

**రూ. 95.50 లక్షల నుడా నిధులతో రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన**



**మీడియా టుడే ఖమ్మం ఆర్సీ**
ఖమ్మం : నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్,సహకార,చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో రూ. 95.50 లక్షల నుడా నిధులతో చేపట్టనున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ...ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి, పరిశుభ్రతతో పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు.అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్,మునిసిపల్ అధికారులు ,ప్రజాప్రతినిధులు ,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి అండర్ 17 బాలికల మెగా మోడ్రన్

# కబడ్డీ కెప్టెన్ ఎన్ ఉత్తంకుమార్ రెడ్డి చాలెంజర్ ట్రోఫీ



**సూర్యాపేట / హుజూర్ నగర్ మీడియా టుడే, స్టాఫ్ రిపోర్టర్: ఆగస్టు 29.**
మోర్త్రాల నాగిరెడ్డి టోర్నమెంట్ కన్వీనర్ సూర్యాపేట జిల్లా మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వారి ఆధ్వర్యంలో హుజూర్ నగర్ పట్టణంలో జడ్పీ హైస్కూల్లో అండర్ 17 కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభించడం జరిగింది. ఈ టోర్నమెంట్లో మొత్తం 25 టీములు రిపోర్ట్ చేయడం జరిగింది. హైదరాబాద్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, కోదాడ కృషి స్కూల్, మేళ్లచెరువు అనంతగిరి మండలాల ఎం జె పి గురుకుల స్కూల్, హైదరాబాద్ ఫ్రైడ్ స్కూల్, కోదాడ కాకతీయ స్కూల్, ఈరోజు రిపోర్ట్ చేయడం జరిగింది. టోర్నమెంటు ప్రారంభించిన కుంభం రాంరెడ్డి మోడ్రన్ కబడ్డీ ఫౌండర్, మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ తెలంగాణ రాష్ట్ర మోడ్రన్ అధ్యక్షులు, దొంతగాని శ్రీనివాస్ గౌడ్ హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్, కొప్పుల సైదిరెడ్డి హుజూర్ నగర్ మండలం మాజీ జెడ్పీటిసి, కోతి సంపత్ రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్, పటేల్ నరసింహారెడ్డి తెలంగాణ రాష్ట్ర మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, రామసాని రమేష్ సూర్యాపేట జిల్లా మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, నామిరెడ్డి శ్రీనివాసరెడ్డి నల్గొండ జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ ఁ ఫిజికల్ డైరెక్టర్, నేరేడుచర్ల హుజూర్ నగర్ మండల మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ వీరయ్య, గరిడేపల్లి మండల మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు చాట్ల సైదులు, గరిడేపల్లి మండలం ప్రధాన కార్యదర్శి గవ్వ వీరయ్య సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు బూరుగడ్డ కొండ నాగయ్య, సూర్యాపేట జిల్లా మోడరన్ కబడ్డీ టెక్నికల్ బోర్డ్ చైర్మన్ కోటేశ్వరరావు, చహూజుర్నగర్ మండల మోడరన్ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండారు సురేష్, సూర్యాపేట జిల్లా రెఫరీ బోర్డు చైర్మన్ వీరస్వామి, నేరేడుచర్ల మండల ప్రధాన కార్యదర్శి పిడి సుజాత, పిఈటీలు టి విజయ్ సుమలత ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణ లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను

# సజావుగా, పారదర్శకంగా పూర్తి చేయాలి

## సీఎం రేవంత్ రెడ్డి

**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, ఆగస్టు 29:**
తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ గారికి ముఖ్యమంత్రి లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు.2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని 21.7 శాతం,గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా అసద్ గుర్తించినట్టు ముఖ్యమంత్రి గుర్తుచేశారు. గణాంకాలను ఉటంకించారు. ఈ వర్గంలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం చేయబడలేదని తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని ఎన్నికల సంఘానికి వివరించారు.ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి గారు లేఖలో పేర్కొన్నారు. గణన సిబ్బంది పరిశీలనకు వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇళ్లలో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణిస్తున్నారని తెలిపారు.నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా ఎలాంటి సహాయం అందించకుండానే పాత నివాసంలోని ఓటు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా నివాసం మారిన వారి పేర్లను తొలగించే ముందు అధికార నోటీసు ప్రక్రియను పాటించడం లేదని తెలిపారు.దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు హక్కు తొలగిపోయిన విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం గైర్హాజరు, నివాసం మారిన,


A. Revanth Reddy
Chief Minister of Telangana
D.O. Letter No.15/2026, Dated:28.08.2026
Dear Shri Gyanesh Kumar ji,
Sub: Special Intensive Revision of electoral rolls in Telangana, 2026 - enlargement of the claims and objections schedule and certain procedural safeguard - Req - Reg.

మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం కేంద్రీకృతమై ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు.ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు.సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, నిర్ణయించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి సవరించాలని కోరారు.గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి, కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని విజ్ఞప్తి చేశారు.నోటీసులు అందుకున్న రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు తమ పత్రాలను సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్ర స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సూచించారు.ప్రభుత్వ ఉత్తర్వు జీవో నంబర్ 172 ప్రకారం జారీ చేసే కుటుంబ నమోదు ధ్రువపత్రాన్ని అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ముఖ్యమంత్రి గారు తెలిపారు. మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా అంగీకరించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని సూచించారు.హైదరాబాద్ లోని ప్రతి నియోజకవర్గంలో సగటున 78 వేలకుపైగా కేసులు ఉన్నందున కేవలం కొంతమంది అధికారుల నియామకం సరిపోదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఓటర్ల నమోదు అధికారి స్థాయికి దిగువన అదనపు అధికారులను నియమించి, ముద్రిత నోటీసుల్లోనే నిర్దిష్ట తేదీలు, సమయాలను పేర్కొంటూ వికేంద్రీకృత విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హత ఉన్న ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు కోరారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ కేంద్రాల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణ, వార్డు కమిటీ సమావేశాల నిర్వహణ, ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో స్పష్టం చేశారు.

## పెద్దమ్మ తల్లి ఆలయ భూమి పూజ కోసం పలువురి నేతలకు ఆహ్వానం

### ఆలయ కమిటీ అధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్



**భూపాలపల్లి/ గణపురం మీడియా టుడే ఆగస్ట్ 29**
గణపురం మండలంలోని ధర్మారావుపేట ముదిరాజ్ ల ఆరాధ్య దైవం శ్రీ పెద్దమ్మ తల్లి భూమి పూజ కార్యక్రమం కు ముఖ్య అతిథులుగా రావాలని శాసన మండలి వైస్ చైర్మన్ ఎం ఎల్ సి బండా ప్రకాష్ ముదిరాజ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల కీర్తి రెడ్డి సత్యపాల్ రెడ్డి మెపా వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తగాట్టు శ్రీనివాస్ ముదిరాజ్,ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావుల జగదీశ్వర ప్రసాద్ ముదిరాజ్,తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, ములుగు జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు ఎర్ల వెంకన్న ముదిరాజ్,పలువురి నేతలను భూమి పూజ కోసం ఆహ్వానించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్ తెలిపారు.ఈ కార్యక్రమం లో ముదిరాజ్ మహాసభ సోషల్ మీడియా ఇంచార్జ్ జోడు ప్రదీప్ ముదిరాజ్ కమిటీ ఉపాధ్యక్షులు సాదు కరుణాకర్ సహాయ కార్యదర్శి ఆకుల రాజకుమార్ బీజేవైఎం మంద మహేష్ మాజీ ఉపసర్పంచ్ ఊరడి రాజయ్య కమిటీ సభ్యులు ఆకుల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు గంటల్లో వాహనం దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

### చాకచక్యంగా ద్విచక్ర వాహనం స్వాధీనం

### నారాయణఖేడ్ ఎస్ఐ రాసుల శ్రీశైలం

**నారాయణఖేడ్, ఆగస్టు 29:**
ద్విచక్ర వాహనం దొంగతనం జరిగిన రెండు గంటల్లోనే కేసును ఛేదించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నారాయణఖేడ్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి హట్యా నాయక్ తండాకు చెందిన మేఘావత్ హన్మ నాయక్ తన హీరో ఫ్యాషన్ ప్రో ద్విచక్ర వాహనం (టీ15 జు 9659)ను శుక్రవారం రాత్రి ఇంటి ముందు నిలిపి ఉంచాడు. ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించకపోవడంతో నారాయణఖేడ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.ఫిర్యాదు అందుకున్న నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం వెంటనే దర్యాప్తు చేపట్టి, సిబ్బందితో కలిసి చాకచక్యంగా వ్యవహరించారు. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని సేకరించి దర్యాప్తు కొనసాగించగా, దొంగిలించబడిన వాహనం నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులో గల డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వద్ద ఉన్నట్లు గుర్తించారు.వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించే చర్యలు చేపట్టారు. దొంగతనం జరిగిన కొద్ది గంటల్లోనే వాహనాన్ని గుర్తించి స్వాధీనం చేసుకోవడంపై బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.వాహన దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో నిలిపి ఉంచడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఘనంగా యజుర్వేద ఉపాకర్మ వేడుకలు



**శేర్లింగంపల్లి మీడియా టుడే న్యూస్ ఆగస్టు 29**
లక్ష్మీగణపతి బ్రాహ్మణ సంఘం చందానగర్ శాఖ ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి తిథిని పురస్కరించుకుని యజుర్వేద ఉపాకర్మ వేడుకలను శుక్రవారం సీతారామాంజనేయ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఘనాపాటి హరి సీతారామమూర్తి నేతృత్వంలో వేద పండితుల బృందం ప్రక్రియను వేదోక్తంగా పూర్తి చేసి నూతన య యజ్ఞోపవీత ధారణను వించారు. ఈ సందర్భంగా వేదాలను అందించిన పూర్వపు ఋషులకు ,పితృదేవతలకు ఘనంగా తర్పణాలు సమర్పించారు. అనంతరం హోమంతో పాటు పూర్ణాతిని వేద మంత్రాల నడుమ పూర్తి చేసారు. తదుపరి ఘనాపాటిని ఘనంగా తాంబూలంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీగణపతి బ్రాహ్మణ సంఘం ప్రతినిధి శశిధర్ సహా ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## డీఎం కృష్ణవేణి నాయక్‌కు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ శుభాకాంక్షలు




**ములుగు జిల్లా ఆగస్టు 29 ( మీడియా టుడే )**
జిల్లా నూతన కలెక్టరేట్ సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సివిల్ సప్లై కార్పొరేషన్ కార్యాలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల సంస్థ (సివిల్ సప్లై) డిస్ట్రిక్ట్ మేనేజర్ (డీఎం) కృష్ణవేణి నాయక్‌ను ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన కార్యాలయం ప్రారంభంతో జిల్లాలో ధాన్యం సేకరణ, పౌరసరఫరాల సేవలు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందుతాయని మిల్లర్లు ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని రైస్ మిల్లర్లకు, పౌరసరఫరాల శాఖకు మధ్య ఉత్తమ సమన్వయం కొనసాగుతుందని, శాఖాపరమైన కార్యకలాపాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.గౌరవ డీఎంకు శు భాకాంక్షలు తెలిపిన వారిలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి సహోదరు రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్ తో పాటు అసోసియేషన్‌కు చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**నారాయణపేట మీడియా టుడే ప్రతినిధి:**
ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుండి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించిన ఎ.ఈ.ఆర్.ఓ. లకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# ఓబీసీ కమిటీలను పునర్నిర్మించి పార్టీని మరింత పటిష్టం చేస్తాం

### డీసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి.



**నారాయణపేట జిల్లా మీడియా టుడే ప్రతినిధి:**
జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన శనివారం ఓబీసీ కమిటీల పునర్నిర్మాణం,పార్టీ సంస్థాగత బలోపేతంపై సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ పరిశీలకులు కోట్ల చంద్రయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,ఓబీసీ కమిటీలను పునర్నిర్మించి పార్టీని మరింత పటిష్టం చేస్తామని అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు,ఓబీసీ వర్గాలను కాంగ్రెస్ పార్టీతో మరింత అనుసంధానం చేసి పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లాలో ఓబీసీ కమిటీలను పునర్నిర్మించడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.జిల్లా ఓబీసీ చైర్మన్‌తో పాటు మండల, టౌన్ ఓబీసీ అధ్యక్షుల నియామకాలు,మండల, గ్రామ,టౌన్ కమిటీల ఏర్పాటు,అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఓబీసీ కమిటీల పునర్నిర్మాణంపై సమీక్షించారు.పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న నాయకులు కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ,అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం ఉండేలా కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా అధ్యక్షులు మండల అధ్యక్షులకు సూచించారు. జిల్లా,రాష్ట్రస్థాయి ఓబీసీ కమిటీలలో నియమిం చాల్సిన అర్హులైన నాయకుల పేర్లను సేకరించి పార్టీ అధిష్ఠానానికి ప్రతిపాదించాలని అన్నారు.పటిష్టమైన ఓబీసీ కమిటీల నిర్మాణం ద్వారా పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం, ఓబీసీ జిల్లా అధ్యక్షులు గొల్ల కృష్ణయ్య, మాజీ మండల అధ్యక్షుడు కె. నరహరి, దామరగిద్ద మండల అధ్యక్షుడు బర్ల హన్మంతు,కృష్ణయ్య, సుభాష్ గౌడ్,జట్రం లక్ష్మయ్య గౌడ్,వెంకట్రాములు, రవికుమార్ చారి,బండి. అనంద్,తదితరులు పాల్గొన్నారు.

# హక్కులకై కార్మికుల కర్షకులు కదలిరండి, కరీంనగర్ లో కదం తొక్కుదాం

### కరీంనగర్ లో జరిగే ఏఐటీయూసీ నాలుగవ మహాసభలను విజయవంతం చేయండి.

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్.




**మీడియా టుడే నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (ఆగస్టు 29):**
నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో హమాలీ కార్మికులతో శనివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా 50 సంవత్సరాలు నిండిన ప్రతి అమ్మాయి వర్కర్స్ కు 5000 రూపాయల పింఛన్ ఇవ్వాలని, హమాలి కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్యా వైద్యంలో అధిక ప్రియారిటి ఇవ్వాలని హమాలి కార్మికులకు ప్రభుత్వ పథకాలలో 25% రిజర్వేషన్ శాతం కల్పించాలని, అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు, ఏఐటీయూసీ 1886వ, సంవత్సరం అమెరికా చికాగో నగరంలో 8, గంటల పని,8 గంటల వినోదం, 8, గంటల విశ్రాంతి కావాలని పని దినాన్ని 18 గంటల నుండి 8 గంటలకు తగ్గించాలని మే 1 తారీఖున జరిగిన సమ్మెపై దాడులు దౌర్జన్యాలు చేసి 8 మంది కార్మికులను పొట్టన పెట్టుకున్నారు, పోరాట కార్మికుల రక్త తరపునతో ఏర్పడిన ఈ ఎర్రజెండా ఏఐటీయూసీ సంఘం అందిపుచ్చుకొని ప్రతి కార్మికునికి గుండె చప్పుడుగా ఎప్పుడు నిరంతరం కార్మికులు కర్షకులు ఆ సంఘటిత రంగాల కోసం ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించి ఎన్నో పోరాటాలు నిర్వహించి అనేక కార్మిక చట్టాలను తీసుకురావడం జరిగిందని, 1952 వరకు ఏకైక యూనియన్ 1955 వంటి 44 కార్మిక చట్టాలను పోరాడి సాధించుకున్నది ఏఐటియుసి మాత్రమే, అన్ని కార్మిక రంగాల మీద రేపు వచ్చే నెల 6 7 8 తేదీల్లో కరీంనగర్ పట్టణంలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ మహాసభలను మహాసభలను విజయ ంవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు తప్పిట కిరణ్ కుమార్, హమాలి వర్కర్స్ కురుమయ్య రాజు శ్రీకాంత్ కుర్మయ్య, తదితరులు పాల్గొన్నారు

# ప్రమాదవశాత్తు కూలిన ఇంటి పైభాగం

### - తప్పిన ప్రాణాపాయం

**చిగురుమామిడి మండల రిపోర్టర్ మీడియా టుడే , ఆగస్టు 29 ,**
శిథిలావస్థలో ఉన్న పాత ఇల్లు పైకప్పు భాగం కూలి పెను ప్రమాదం తప్పింన సంఘటన శనివారం ఉదయం నవాబుపేటలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బోయిని రామయ్య ఉదయం దాదాపు 5 గంటల సమయంలో నిద్ర లేచి బయటకు వెళ్లే సమయంలో తన ఇంటి పైకప్పు భాగం ప్రమాదవశత్తు కూలిపోయిందని ఆ శబ్దానికి ఒక్కసారిగా నిద్రలో నుంచి మేల్కొని కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి తమ పక్కనే ఇంటి పైకప్పు భాగం కూలి పడడంతో భయభ్రాంతులకు గురై ఉలిక్కిపడ్డామని ఆ సమయంలో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఇంటి లోపల నుండి పరుగు పరుగున బయటికి పరిగెత్తామన్నారు.ఎన్నో ఏళ్ల నుండి మట్టి గోడలు కుమ్మరి పెంక,పాలిథిన్ కవర్లతో కప్పబడి తమ ఇల్లు శిథిలావస్థలో ఉందని ప్రతి వర్షాకాలం సీజన్లో గోడలు తడుస్తూ ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో తామున్నామన్నారు. గతంలో అధికారులకు సమాచారం అందించినా ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు దరఖాస్తు చేసుకున్నా కానీ తమకు ఇల్లు మంజూరు చేయలేదని బాధితుడు రామయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.రెవెన్యూ అధికారులకు,గ్రామ సర్పంచ్ కు సమాచారం అందించగా జిపిఓ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని కూలిపోయిన ఇల్లును పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు ప్రస్తుతం ఇల్లు పై కప్పు కూలడంతో నిరాశ్రయులుగా ఉన్న తమకు ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



# చిగురుమామిడి రైతువేదికలో రైతులకు ఆత్మ శిక్షణ కార్యక్రమం

### ముఖ్యఅతిథిగా హాజరైన ఆత్మ పిడి చత్రునాయక్



**చిగురుమామిడి మండల రిపోర్టర్ మీడియా టుడే , ఆగస్టు 29**
: మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం రైతులకు ఆత్మ- ఆర్ పిఎల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి సాగులో ఆధునిక పద్ధతులు,తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం జరిగిందని వ్యవసాయ శాఖ మండల అధికారి తాటిపల్లి పున్నమి చందర్ రెడ్డి తెలిపారు.ఈ శిక్షణలో ముఖ్య అతిథిగా ఆత్మ పిడి చత్రు నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వరి పంటలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అందించే 7రకాల సన్న రకాల వంగడాల గురించి రైతులకు వివరించారు.వరి సాగులో శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు,కాలానుగుణంగా వచ్చే పురుగులు,తెగుళ్ల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు .మరో ముఖ్య వక్త, బి.జె.ఆర్ అగ్రికల్చర్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్,శాస్త్రవేత్త శ్రీ హరికృష్ణ మాట్లాడుతూ వరి పంటలో నాణ్యమైన దిగుబడులు సాధించడానికి పంట దశల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.సన్న రకాల ఎంపిక, శాస్త్రీయ ఎరువుల యాజమాన్యంపై రైతులకు దిశానిర్దేశం చేశారు.పంటలను ఆశించే పురుగులు,తెగుళ్లను ముందుగానే గుర్తించి, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఆయన సూచించారు.అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలను అధికారులు, శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా వరి పంటలో అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తి,మెరుగైన ఆదాయాన్ని సాధించవచ్చని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చిగురుమామిడి గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని,మండల వ్యవసాయ శాఖ అధికారి పున్నం చందర్ రెడ్డి,ఏటీఎం అర్చన,వ్యవసాయ విస్తరణ అధికారులు,చిగురుమామిడి మండల పరిధిలోని పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# సాగు,తాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

### ఫ్యూచర్ సిటీపై ఉన్న శ్రద్ధ నీటి ప్రాజెక్టులపై లేదు -సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య

### యాదాద్రి జిల్లాకు గోదావరి జలాల వాటా కేటాయించాలని డిమాండ్ సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఉద్యమం



**మీడియా టుడే,ఆగస్టు 29/ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్:** సాగునీరు, తాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్య లు ఎస్.వీరయ్య విమర్శించారు.వ్యవసాయానికి ఊపిరైన సాగునీరు, ప్రజల జీవనానికి ఆధారమైన తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రభుత్వం ఇతర అంశాలపై దృష్టి సారించడం బాధ్యతారాహిత్యమని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ప్రాజెక్టులను పూర్తిచేయాలని డిమాండ్ చేస్తు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్రకు శనివారం భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రారంభ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ వీరయ్య మాట్లాడారు.వ్యవసాయమే ఆర్థిక వ్యవస్థకు పునాదిమానవ నాగరికత చరిత్రలో సాగు, తాగునీటికి కీలక స్థానం ఉందని వీరయ్య అన్నారు. వ్యవసాయ రంగంపైనే పారిశ్రామిక, సేవా రంగాలు ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే రైతుల ఆదాయం పెరిగి ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, తద్వారా చిన్న వ్యాపారాలు, చేతివృత్తులు, పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని వివరించారు. చివరకు సేవా రంగం కూడా బలోపేతమై రాష్ట్ర జీడీపీ వృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. 7.5 లక్షల ఎకరాలున్నా పూర్తిస్థాయిలో నీరందని దుస్థితి యాదాద్రి భువనగిరి జిల్లాలో 7.5 లక్షల ఎకరాలకు పైగా సాగుభూమి ఉన్నప్పటికీ, ఏ ఒక్క ఏడాది కూడా మొత్తం భూమికి సాగునీరు అందలేదని వీరయ్య అన్నారు. గతంలో 4 నుంచి 4.5 లక్షల ఎకరాలకు నీరందితే గొప్పగా భావించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం కరువు పరిస్థితులు నెలకొనడంతో కనీసం ఒకటి నుంచి రెండు లక్షల ఎకరాలకు నీరందుతుందో లేదో అనుమానంగా మారిందని పేర్కొన్నారు. జిల్లాలోని చిన్నచిన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేస్తే యాదాద్రి జిల్లా పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల తరహాలో పచ్చగా మారుతుందని అన్నారు. యాదాద్రి గుట్టపై నుంచి చూస్తే చుట్టూ పచ్చని పంట పొలాలు కనిపించే స్థాయికి జిల్లా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనకు గోదావరి జలాలు ఏడు జిల్లాలతో ముడిపడి ఉన్న మూసీ నది ప్రక్షాళనపై ప్రభుత్వం మాట్లాడుతున్న నేపథ్యంలో గోదావరి జలాలను మళ్లించి మూసీని ప్రక్షాళన చేయాలని వీరయ్య డిమాండ్ చేశారు. అదే సమయంలో యాదాద్రి భువనగిరి జిల్లాకు తగిన నీటి వాటాను కేటాయించాలని కోరారు. దీనివల్ల జిల్లా సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారం కావడంతో పాటు హైదరాబాద్ అభివృద్ధి ప్రాజెక్టులకు కూడా ఎలాంటి ఆటంకం ఉండదన్నారు. ప్రభుత్వం హైదరాబాద్ సరిహద్దులు దాటి ఆలోచించాల్సిన అవసరం ఉందని సూచించారు.

**స్పష్టమైన ప్రకటన ఇవ్వాలి**

జిల్లా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ జహంగీర్ నేతృత్వంలో భువనగిరి నుంచి హైదరాబాద్ వరకు మహా పాదయాత్ర చేపడుతున్నట్లు వీరయ్య తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాలో పాల్గొని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రితో చర్చించి సమస్యల పరిష్కారంపై స్పష్టత తీసుకుంటామన్నారు. రాబోయే శాసనసభ సమావేశాల్లో సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం బహిరంగంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోతే భువనగిరి జిల్లాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ఎస్. వీరయ్య హెచ్చరించారు.ఇరవై ఏళ్లుగా అదే నీటి కథ. ప్రభుత్వాలు మారినా సమస్యలకు మోక్షం ఎక్కడ?చిన్న ప్రాజెక్టులే రైతు బతుకుకు పెద్ద ఆధారం.. నిధుల కొరతపై సీపీఐ(ఎం) రాజకీయ దాడిమూసీ ప్రక్షాళన నుంచి గోదావరి జలాల వరకు హైదరాబాద్ కేంద్రంగా కాకుండా యాదాద్రి నీటి అవసరాలపై దృష్టి పెట్టాలని డిమాండ్. మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలు మాత్రం మారడం లేదనే అంశాన్ని సీపీఐ(ఎం) మరోసారి రాజకీయ అజెండాగా ముందుకు తెచ్చింది. ఒకటి రెండు భారీ ప్రాజెక్టుల కంటే బునాదిగాని కాలువ, పిలాయిపల్లి కాలువ, మూసీతో పాటు జిల్లాలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న చిన్న ప్రాజెక్టులను పూర్తి చేయడమే రైతాంగానికి తక్షణ ప్రయోజనం కలిగిస్తుందని మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు స్పష్టం చేశారు. భువనగిరి నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన మహా పాదయాత్ర ప్రారంభ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు జిల్లాలో నీటి రాజకీయాలపై మరోసారి చర్చకు తెరలేపాయి.2006 నుంచి 2026 మారని పెండింగ్ ప్రాజెక్టుల ప్రశ్న యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రస్తుత సాగునీటి సమస్యను సీపీఐ(ఎం) కేవలం ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యంగా కాకుండా రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న పాలనా సమస్యగా చిత్రీకరిస్తోంది. 2006 ఫిబ్రవరి 2 నుంచి ఏప్రిల్ 4 వరకు సుమారు రెండు నెలలపాటు 2,000 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి ఉమ్మడి నల్గొండ జిల్లా సమగ్రాభివృద్ధిపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి సమస్యలను వివరించామని సీతారాములు గుర్తుచేశారు. అప్పట్లో బునాదిగాని, పిలాయిపల్లి వంటి ప్రాఇప్పుడుజెక్టులు రూ.20--25 కోట్ల స్థాయిలో ఉన్నాయని, కాలం గడిచే కొద్దీ వాటి నిర్మాణ వ్యయం అనేక రెట్లు పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అంటే ప్రాజెక్టులు పూర్తికాకపోవడం కేవలం నీటి కొరతను మాత్రమే సృష్టించడం కాదు.. ప్రభుత్వ ఖజానాపై అదనపు భారాన్ని కూడా మోపుతోందన్నది ఆయన వాదన. ఈ అంశంలో సీపీఐ(ఎం) రాజకీయంగా ఒక కీలక ప్రశ్నను ముందుకు తెస్తోంది. ప్రాజెక్టులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు అప్పుడే కేటాయించి ఉంటే, నేడు పెరిగిన వ్యయాన్ని ప్రజలే ఎందుకు భరించాలి? అన్నదే ఆ ప్రశ్న. ప్రభుత్వాలు మారాయి.. ప్రాధాన్యతలు మాత్రం మారలేదా?ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. ఇలా పాలకులు మారినా జిల్లాలోని కొన్ని నీటి ప్రాజెక్టుల విషయంలో పరిస్థితి పెద్దగా మారలేదని సీతారాములు విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న విమర్శ కాకుండా, రాష్ట్ర పాలనా విధానంపై సీపీఐ(ఎం) చేస్తున్న విస్తృత రాజకీయ విమర్శగా కనిపిస్తోంది. భారీ ప్రాజెక్టులు, పెద్ద మౌలిక వసతులు, నగరాభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత లభిస్తుండగా.. వేలాది చిన్న రైతులకు నేరుగా ఉపయోగపడే చిన్న సాగునీటి ప్రాజెక్టులు మాత్రం నిధుల కోసం ఎదురుచూడాల్సి వస్తోందన్నది ఆ పార్టీ వాదన. చిన్న ప్రాజెక్టులు పూర్తయితే వెంటనే ఆయకట్టు పెరుగుతుందని, రైతుల ఆదాయం మెరుగవుతుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో డబ్బు చలామణి పెరుగుతుందని సీతారాములు పేర్కొన్నారు. అందువల్ల వీటిని కేవలం ఇరిగేషన్ పనులుగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు సంబంధించిన పెట్టుబడులుగా చూడాలని ఆయన ప్రసంగం సూచిస్తోంది. 'కమిషన్ల' ఆరోపణతో రాజకీయ దాడి చిన్న ప్రాజెక్టులను ప్రభుత్వం పట్టించుకోకపోవడానికి అవి పెద్ద ప్రాజెక్టులంత రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను ఇవ్వకపోవడమే కారణమని సీతారాములు ఆరోపించారు. పెద్ద ప్రాజెక్టుల్లో కమిషన్ల ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయని, చిన్న ప్రాజెక్టుల్లో అలాంటి ప్రయోజనాలు ఉండవనే కారణంతో వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే ఇవి ఆయన చేసిన రాజకీయ ఆరోపణలు మాత్రమే; వాటికి సంబంధించి నిర్దిష్ట ఆధారాలను ఆయన ప్రసంగంలో ప్రస్తావించలేదు. అయినప్పటికీ ఈ వ్యాఖ్యల ద్వారా సీపీఐ(ఎం) తన రాజకీయ ప్రచారంలో 'ప్రజా అవసరాలు వర్సెస్ కాంట్రాక్టు ఆధారిత అభివృద్ధి' అనే అంశాన్ని ప్రధానంగా ముందుకు తెస్తోంది. కరువు పరిస్థితి.. రాజకీయ ఒత్తిడికి అవకాశం ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొనడం సీపీఐ(ఎం) ఉద్యమానికి మరో రాజకీయ నేపథ్యాన్ని కల్పిస్తోంది. సాగునీరు లేక రైతులు ఇబ్బంది పడుతుండగా, తాగునీటి అవసరాలు కూడా పెరుగుతున్నాయని పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేసి పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వం తక్షణ ఉపశమనంతో పాటు దీర్ఘకాలిక నీటి భద్రతకు పునాది వేయగలదన్న వాదనను సీపీఐ(ఎం) ముందుకు తెస్తోంది. అందుకే పాదయాత్రను కేవలం ఒక వినతిపత్ర కార్యక్రమంగా కాకుండా ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి పెంచే తొలి దశగా పార్టీ చూపిస్తోంది. మూసీ.. ప్రక్షాళనకు మించి నీటి రాజకీయాలు మూసీ ప్రక్షాళన అంశాన్ని కూడా సీపీఐ(ఎం) విస్తృత నీటి రాజకీయాలతో అనుసంధానిస్తోంది. మూసీని ప్రక్షాళన చేయడంపై తమకు అభ్యంతరం లేదని, అయితే అది కేవలం హైదరాబాద్ సుందరీకరణ ప్రాజెక్టుగా మారకూడదని సీతారాములు అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని ప్రజల ప్రయోజనాలను, ముఖ్యంగా నల్గొండ--యాదాద్రి ప్రాంతాల నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. గోదావరి జలాలను ఈ ప్రాంతానికి తీసుకురావాలనే పాత డిమాండ్‌ను కూడా ఆయన మరోసారి ముందుకు తెచ్చారు. ఇక్కడే సీపీఐ(ఎం) రాజకీయ వాదనలో మరో కోణం కనిపిస్తోంది. హైదరాబాద్ అభివృద్ధికి కేటాయించే ప్రభుత్వ దృష్టి, నిధులు, రాజకీయ శక్తిలో కొంత భాగాన్ని గ్రామీణ తెలంగాణ నీటి అవసరాలకు మళ్లించాలి అన్న సందేశాన్ని పార్టీ బలంగా వినిపిస్తోంది.శముఖ్యమంత్రి ప్రాధాన్యతలపై ప్రశ్నలు వర్షాలు రావాలని యాగాలు నిర్వహించడం, ఇతర భారీ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం కంటే పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి నేరుగా దృష్టి పెట్టాలి సీతారాములు, సిపిఎం శాసనమండలి సభ్యులు. "రైతులకు ఎప్పుడు నీళ్లు ఇస్తాం? ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తవుతాయి?" అనే ప్రశ్నలతో ముఖ్యమంత్రి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యక్ష సమీక్ష నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.దీంతో సీపీఐ(ఎం) పోరాటం కేవలం ఇరిగేషన్ శాఖ అధికారులపై కాకుండా నేరుగా ముఖ్యమంత్రి స్థాయికి చేరేలా రాజకీయంగా నిర్మించబడుతోంది. ఎన్నికల హామీల రాజకీయానికి ప్రత్యామ్నాయంగా ఉద్యమం ఎన్నికలకు ముందు సమస్యలపై హామీలు, ఎన్నికల తర్వాత వాటిపై మౌనం అనే రాజకీయ సంస్కృతిని సీతారాములు విమర్శించారు. ఈసారి మాత్రం వినతిపత్రాలు ఇచ్చి ఆగిపోకుండా నిరంతర ఉద్యమం చేపట్టాలని పార్టీ నిర్ణయించినట్లు ఆయన స్పష్టం చేశారు. మహా పాదయాత్ర ద్వారా భువనగిరి నుంచి హైదరాబాద్‌కు సమస్యను తీసుకెళ్లడం, మహాధర్నా నిర్వహించడం, ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వడం, శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వ ప్రకటన కోరడం.. ఇలా ఉద్యమానికి దశలవారీ కార్యాచరణను సీపీఐ(ఎం) రూపొందిస్తోంది. ప్రభుత్వం స్పందించకపోతే తదుపరి దశలో రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలను కలుపుకొని సమరశీల ఉద్యమాలకు వెళ్లాలని పార్టీ నేతలు పిలుపునిస్తున్నారు.రైతాంగాన్ని కేంద్రంగా చేసుకున్న రాజకీయ సమీకరణ యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగు, తాగునీటి సమస్యను కేంద్రంగా చేసుకుని రైతాంగం, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడమే సీపీఐ(ఎం) వ్యూహంగా కనిపిస్తోంది. నీటి సమస్యకు పార్టీ సిద్ధాంతపరమైన డిమాండ్లను జోడించడంతో పాటు, స్థానికంగా అందరికీ సంబంధించిన జీవన సమస్యగా దాన్ని మలచే ప్రయత్నం చేస్తోంది.

ఇరవై ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, పెరుగుతున్న నిర్మాణ వ్యయం, కరువు పరిస్థితులు, మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల డిమాండ్, హైదరాబాద్ అభివృద్ధి ప్రాధాన్యతలు.. ఇవన్నింటినీ ఒకే రాజకీయ కథనంగా మలచడమే ప్రస్తుత మహా పాదయాత్ర లక్ష్యంగా కనిపిస్తోంది. ఇక ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలే కీలకం. పెండింగ్ ప్రాజెక్టులకు స్పష్టమైన నిధుల కేటాయింపు, కాలపరిమితితో కూడిన పూర్తి ప్రణాళిక ప్రకటిస్తే ఉద్యమం కొంతవరకు చల్లారే అవకాశం ఉంది. లేకపోతే సీపీఐ(ఎం) ప్రకటించిన తదుపరి దశ ఉద్యమాలు రైతాంగ సమస్యను మరింత రాజకీయంగా ముందుకు తెచ్చే అవకాశముంది. ప్రాజెక్టులు పూర్తయ్యేదెప్పుడు రూ.కోట్లు ప్రకటిస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు బస్వాపురం గంధమల్ల చర్లగూడెం నుంచి పిలాయిపల్లి, బునాదిగాని వరకు అదే పరిస్థితి గడువుతో నిధులు విడుదల చేయాలి లేకుంటే ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తాం.సిపిఐఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగు, తాగునీటి కోసం చేపట్టిన ప్రాజెక్టులు, కాలువలు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉండటంపై సీపీఐ(ఎం) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిధుల కొరత, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా 18 నుంచి 20 ఏళ్లుగా అనేక ప్రాజెక్టులు పూర్తి కాలేదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ ఆరోపించారు. పెండింగ్ ప్రాజెక్టులన్నింటికీ పూర్తి స్థాయి నిధులు కేటాయించి, గడువు నిర్ణయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల మహా పాదయాత్ర శనివారం భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ సభలో జహంగీర్ మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బహుళార్థక ప్రాజెక్టులదీ అదే దుస్థితియాదాద్రి భువనగిరి జిల్లాకు కీలకమైన బస్వాపురం, గంధమల్ల, చర్లగూడెం రిజర్వాయర్లు పూర్తికాకపోవడం వల్ల సాగు, తాగునీటి లక్ష్యాలు నెరవేరడం లేదని జహంగీర్ అన్నారు. జిల్లాలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తిస్థాయిలో పూర్తి చేశామని పాలకులు చెప్పుకోలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. బస్వాపురం ప్రాజెక్టు దాదాపు 19 ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన మొత్తం వ్యయం రూ.420 కోట్లుగా ఉందని ఆయన తెలిపారు. ఇటీవల రూ.50 కోట్లు, ఆ తర్వాత రూ.150 కోట్లు కలిపి రూ.206 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారని, అయితే ఈ నిధులతో సుమారు 5 టీఎంసీల మేర నీటిని నింపే పనులకే పరిమితం చేస్తున్నారని అన్నారు. మిగిలిన పనులు, నిర్వాసితుల సమస్యలు, ప్రధాన కాలువతో పాటు ఫీడర్ ఛానళ్ల పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.రూ.450 కోట్ల గంధమల్లకు రూ.80 కోట్లేనా? గంధమల్ల రిజర్వాయర్ అంచనా వ్యయం రూ.450 కోట్లుగా ఉంటే, తాజాగా రూ.80 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించడం ద్వారా ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందని జహంగీర్ ప్రశ్నించారు. గతేడాది జూన్‌లో ముఖ్యమంత్రి శంకుస్థాపన సందర్భంగా రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించారని, అయితే ఇప్పటివరకు పనులు ఆశించిన స్థాయిలో ప్రారంభం కాలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఆయన విమర్శించారు. రూ.6,200 కోట్ల చర్లగూడెం.. విడుదలైంది రూ.1,500 కోట్లే చర్లగూడెం రిజర్వాయర్ విషయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోందని జహంగీర్ అన్నారు. 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ.6,200 కోట్లుగా ఉందని, ఇప్పటివరకు సుమారు రూ.1,500 కోట్లు మాత్రమే విడుదలైనట్లు తెలిపారు.ఇంత భారీ వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టుకు అవసరమైన నిధులు దశలవారీగా కాకుండా సంపూర్ణంగా కేటాయించి పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. సాగు, తాగునీటికి కీలకమైన బహుళార్థక ప్రాజెక్టులను ఇలా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడం వల్ల ప్రజలకు ప్రయోజనం అందడం లేదన్నారు. 2003 నుంచి కాలువ తవ్వకమేనా?చిన్న నీటి వనరులైన పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి కాలువల పరిస్థితిపై జహంగీర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ధర్మారెడ్డిపల్లి కాలువ 2003లో, పిలాయిపల్లి కాలువ 2005లో, బునాదిగాని కాలువ 2006లో చేపట్టినవని గుర్తుచేశారు.ఏళ్ల తరబడి పనులు కొనసాగుతున్నా రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. వంద, 150, 70 కోట్ల స్థాయిలో అవసరమయ్యే చిన్న ప్రాజెక్టులకు కూడా నిధులు కేటాయించకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని నిలదీశారు కాలువ ఎప్పుడు పూర్తవుతుంది? రైతులకు నీళ్లు ఎప్పుడు ఇస్తారు అనే ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీపై ఆగ్రహం.. గోదావరి జలాల కోసం డిమాండ్ మూసీ నది కాలుష్యంతో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జహంగీర్ అన్నారు. మూసీ ప్రక్షాళనను కేవలం హైదరాబాద్ సుందరీకరణకు పరిమితం చేయకుండా, నది పరీవాహక ప్రాంత ప్రజల ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. గోదావరి జలాలను యాదాద్రి భువనగిరి జిల్లాకు తీసుకువచ్చే విషయంలో ప్రభుత్వం వద్ద స్పష్టమైన డీపీఆర్ ఉందా? ఉంటే దాని అమలు ఎప్పుడు ప్రారంభిస్తారు? అనే ప్రశ్నలను ఆయన లేవనెత్తారు. మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాచకొండ లిఫ్ట్ ఇరిగేషన్‌పై పట్టుబాటు చర్లగూడెం రిజర్వాయర్ నిర్మాణం వల్ల నారాయణపూర్, చౌటుప్పల్ మండలాలకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం ఉండదని జహంగీర్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతాలకు నీరందించేందుకు రాచకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టాలని డిమాండ్ చేశారు. షామీర్‌పేట నుంచి కొండపోచమ్మ సాగర్ జలాలను తీసుకువచ్చే ప్రతిపాదనపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ నీటిని పోచంపల్లి, చౌటుప్పల్, భువనగిరి ప్రాంతాలకు అందిస్తే సాగునీటి సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. నవాబ్‌పేట రిజర్వాయర్ పరిస్థితిపై ప్రశ్నలునవాబ్‌పేట రిజర్వాయర్‌కు 15 ఏళ్లు గడిచినా కాలువలు పూడిపోవడం, గడ్డి పెరగడం, నీరు అందకపోవడం దారుణమని జహంగీర్ విమర్శించారు. అల్వాలపల్లి నుంచి ఆలేరు ప్రాంతానికి నీరు రావాల్సి ఉన్నప్పటికీ ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. జిల్లాకు ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ, ఇన్‌చార్జి మంత్రి ఉన్నప్పటికీ జిల్లాలోని పెండింగ్ నీటి ప్రాజెక్టులపై సమష్టిగా ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. మూడు రోజుల పాదయాత్ర.. ఇందిరాపార్క్‌లో మహాధర్నా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సీపీఐ(ఎం) మూడు రోజుల మహా పాదయాత్రను చేపట్టింది. శనివారం భువనగిరిలో ప్రారంభమైన పాదయాత్ర సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వరకు కొనసాగనుంది. అక్కడ వేలాది మందితో మహాధర్నా నిర్వహించనున్నట్లు జహంగీర్ తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులన్నింటికీ గడువు నిర్ణయించి, ఆ గడువులోగా పూర్తి చేసేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, అందుకు అవసరమైన నిధులను ఒకేసారి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి . ప్రతి ప్రాజెక్టు ను ఏ ప్పటివరకు పూర్తి చేస్తా రు స్పష్టమైన ప్రకటన చేయా లని జహంగీర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే పాదయాత్రతో ఉద్యమం ముగియదని, తదుపరి దశలో మరింత విస్తృతమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజా సంఘాలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పెరుగుతున్న అంచనా వ్యయాలు కరువు పరిస్థితులు మరోవైపు మూసీ, గోదావరి జలాలపై కొనసాగుతున్న డిమాండ్లు ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) చేపట్టిన పాదయాత్ర జిల్లాలో నీటి సమస్యను మరోసారి రాజకీయ చర్చ మధ్యలోకి తీసుకొచ్చింది. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చే హామీలకంటే నిధులు, గడువు, పనుల పురోగతిపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటిస్తుందా లేదా అన్నదే కీలకంగా మారింది. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ పైళ్ల ఆశయ డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు కల్లూరి మల్లేశం దాసరి పాండు జెల్లెల పెంటయ్య బూరుగు కృష్ణారెడ్డి గుంటోజు శ్రీనివాసాచారి జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి సిర్పంగి స్వామి దయ్యాల నరసింహ మాయ కృష్ణ మద్దెల రాజయ్య బొల్లు యాదగిరి, బొడ్డుపల్లి వెంకటేష్ గుండు వెంకటనర్సు గంగదేవి సైదులు దోడ యాదిరెడ్డి మద్దేపూరం రాజు బోలగాని జయరాములు అవ్వారు రామేశ్వరి ఎంఎ ఇక్బాల్ వనం ఉపేందర్ గడ్డం వెంకటేష్ రాగీరు కిష్టయ్య మల్లేపల్లి లలిత బల్గూరి అంజయ్య కోట రామచంద్రారెడ్డి గోశిక కరుణాకర్ మండల కార్యదర్శిలు జిల్లా ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ హ్యాండ్‌బుక్‌పై కలెక్టర్ సమీక్ష

### తప్పులు లేకుండా ఖచ్చితమైన వివరాల నమోదు తప్పనిసరి: కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్ కలెక్టరేట్, ఆగస్టు 29 మీడియా టుడే జిల్లా ప్రతినిధి** సెన్సస్ హ్యాండ్‌బుక్‌కు సంబంధించిన సమాచారాన్ని నిర్దేశిత ప్రొఫార్మాలో ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం నిజామాబాద్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెన్సస్ హ్యాండ్‌బుక్ రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఇప్పటివరకు సేకరించిన సమాచారం, ఇంకా సేకరించాల్సిన వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సేకరించిన సమాచారాన్ని నిర్దేశిత ప్రొఫార్మాలో పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమాచారాన్ని సేకరించే సమయంలో, ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.వివిధ శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేసి అవసరమైన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా సేకరించాలని తెలిపారు. సెన్సస్ హ్యాండ్‌బుక్‌లో పొందుపరిచే వివరాలు భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో, పూర్తి వివరాలతో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సమాచారం సేకరణ, పరిశీలన, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించి నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్మల్ జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సీపీఓ గంగారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మీడియా టుడే
ఆదివారం, , ఆగస్టు 30, 2026

# రామప్ప దేవాలయాన్ని సందర్శించిన సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



**ములుగు జిల్లా ఆగస్టు 29 (మీడియా టుడే )**

యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన చారిత్రాత్మక పాలంపేట రామప్ప దేవాలయాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ దంపతులు, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) డాక్టర్ గోపాలకృష్ణన్‌తో కలిసి శనివారం మర్యాదపూర్వకంగా సందర్శించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న రైల్వే ఉన్నతాధికారులకు ఆలయ ఈఓ ఇమ్మడి భాస్కర్, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అధికారులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ విశిష్టతను అధికారులకు వివరించారు. కాకతీయుల శిల్పకళానైపుణ్యం, నీటిపై తేలియాడే ఇటుకల సాంకేతికత, శాండ్ బాక్స్ టెక్నాలజీ మరియు ఏకశిలా నంది కాంప్లెక్స్ నిర్మాణ శైలిని చూసి జీఎం దంపతులు, డీఆర్ఎం తీవ్ర మంత్రముగ్ధులయ్యారు. కాకతీయ శిల్పుల అద్భుత సృష్టికి ఇది నిదర్శనమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, టూరిస్ట్ పోలీసు సిబ్బందితో పాటు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఫేస్ టు కార్యక్రమం




**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా ఆగస్టు 29 :**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సూచన మేరకు శనివారం ఎస్ ఐ ఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఫేస్ 2 అసెంబ్లీ స్థాయి వర్క్ షాప్ ఆర్మూర్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి బిజెపి సీనియర్ నాయకులు లోక భూపతి రెడ్డి, అతిథులుగా బిజెపి రాష్ట్ర నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్, పెద్దోళ్ల గంగారెడ్డి, కంచెట్టి గంగాధర్ నూతుల శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ బిజెపి పార్టీ తరఫున బిఎల్ఎ 2 లు ప్రతి బూతులో ఉన్న ఓటర్ లిస్టులో ఏమైనా తప్పులు ఉంటే లేదా నూతనంగా ఓటు అప్లై చేసుకోవాలనుకున్న యువకులని మహిళలని గుర్తించి తప్పులు ఉంటే సరిచేసి కొత్త ఓటర్లను నమోదు చేసే విధంగా కష్టపడి ఆ గ్రామంలో బూత్ మొత్తం తిరుగుతూ పని చేయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి బిఎల్ఎ1 పోల్కం వేణు అసెంబ్లీలో ఉన్న అన్ని మండల అధ్యక్షులు మమతా, చిన్నారెడ్డి, శ్రీకాంత్, వినోద్ ,రాజు, మందుల బాలు, అన్ని మండలాల బిఎల్ఎ 2 లు, బూత్ అధ్యక్షులు జిల్లా స్థాయి నాయకులు మండల స్థాయి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కోదాడలో సీఐ శివశంకర్ దిష్టిబొమ్మ దగ్ధం

**సీఐను వెంటనే సస్పెండ్ చేయాలని**

**యాదవ సంఘం, ఓయూ జేఏసీ నేతల డిమాండ్**



**కోదాడ, ఆగస్టు 29 (మీడియా టుడే)–:**

కోదాడ పట్టణంలో సీఐ శివశంకర్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పట్టణంలోని ఖమ్మం చౌరస్తాలో యాదవ కుల సంఘం, ఓయూ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళనకారులు సీఐ శివశంకర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీఐను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఇటీవల పట్టణంలో డబ్బా కొట్టు తొలగించిన ఘటనకు సంబంధించి ధర్నాకు దిగిన బాధితులపై సీఐ దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ ఆందోళన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. బాధితులపై దాడికి పాల్పడిన పోలీసు అధికారిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఆందోళనకారులు రంగ చౌరస్తా వైపు వెళ్లి అక్కడ మరోసారి సీఐ శివశంకర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అప్రమత్తమై ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు.

# ఉత్తమ అవార్డు గ్రహీత ఎంఈఓ నరేందర్‌కు ఘన సన్మానం



**తానూర్, ఆగస్టు 29 ():** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న మండల విద్యాధికారి (ఎంఈఓ) నరేందర్‌ను శనివారం వడ్గావ్ గ్రామంలో గ్రామస్తుల తరఫున స్థానిక సర్పంచ్ కదం సుమన్ బాయి–గోవిందరావు పటేల్ శాలువాతో ఘనంగా సన్మానించారు,? అలాగే మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ట్రెజరర్‌గా ఎన్నికైన భరత్ రెడ్డిని, వడ్గావ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేష్‌ను కూడా ప్రత్యేకంగా సత్కరించారు, ఈ సందర్భంగా గోవిందరావు పటేల్ మాట్లాడుతూ.. విద్యా రంగంలో, సమాజ సేవలో వీరు చేస్తున్న విశేష కృషికి దక్కిన ఈ గుర్తింపు ఇతరులకు స్ఫూర్తిదాయకమని అభినందించారు.

# నకిరేకల్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం




యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,ఆగస్టు

**29:రామన్నపేట ప్రతినిధి**

రామన్నపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టె సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో రామన్నపేట మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ విశ్రాంత భవనంలో నకిరేకల్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువజన కాంగ్రెస్ నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏనుగు రఘుమా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టె సంతోష్ కుమార్ మాట్లాడుతూ రామన్నపేట మండలంలో నూతనంగా నియమింపబడ్డ గ్రామ శాఖ అధ్యక్షులను, కార్యవర్గ సభ్యులను అభినందించారు. నూతనంగా నియమింపబడ్డ అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుగుడు రవి యాదవ్, నకిరేకల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పున్న అమరేందర్,నార్కెట్పల్లి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జిల్లా పృధ్వీ,రామన్నపేట మండల ఉపాధ్యక్షులు కందగట్ల రాహుల్,సోషల్ మీడియా కోఆర్డినేటర్లు మేకల జలేందర్,కేస సందీప్,రామన్నపేట మండల పరిధిలోని వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తల పాల్గొన్నారు.

## సార్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల మేరకు పూర్తి చేసేందుకు

# అన్ని చర్యలు తీసుకుంటున్నాం. -అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్




**మహబూబ్‌నగర్. ఆగస్టు29(మీడియా టుడే ప్రతినిధి ):–** ప్రత్యేక సమగ్ర సవరణ సార్ లో భాగంగా జిల్లాలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2,36,590 నోటీసులు జనరేట్ చేయగా, 60,959 నోటీసులను సంబంధిత ఓటర్లకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. నోటీసుల జారీ, వారం రోజుల గడువు, డీసెంట్రలైజ్డ్ హియరింగ్ తదితర ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతు న్నామని ఆయన పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీఈవో సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈ ఆర్ ఓలు, ఎఈఆర్ఓ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సార్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, సార్ ప్రక్రియను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు జారీ చేసే నోటీసులను తప్పనిసరిగా సంబంధిత వ్యక్తికే వ్యక్తిగతంగా అందజేయాలని, నోటీసు అందజేసినట్లు సరైన ఎకనాలెజ్‌మెంట్ తీసుకుని రికార్డుల్లో భద్రపర చాలని సూచించారు. నోటీసు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలు సమర్పించుకునేందుకు కనీసం ఏడు రోజుల సమయం ఇవ్వాలని తెలిపారు. విచారణ తేదీకి రెండు రోజుల ముందుగానే ఓటర్లకు మరోసారి సమాచారం అందించి, నిర్ణీత తేదీన విచారణకు హాజరయ్యేలా చూడాలని సూచించారు.

**వికేంద్రీకృత విధానంలో విచారణలు**

ఓటర్లకు సౌకర్యంగా ఉండేలా విచారణలను వికేంద్రీకృత విధానంలో నిర్వహించాలని సీఈవో సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద లేదా సమీపంలోని కమ్యూనిటీ హాళ్లు, ఇతర అనువైన ప్రదేశాల్లో విచారణలు చేపట్టాలని తెలిపారు. అవసరాన్ని బట్టి పలు పోలింగ్ కేంద్రాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి విచారణలు నిర్వహిం చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విచారణలను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఈఆర్ ఓలు, ఎఈ ఆర్ఓలు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిం చుకోవాలని, నియోజకవర్గాల వారీగా పెండింగ్ కేసుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు.

**స్పీకింగ్ ఆర్డర్లలో స్పష్టత తప్పనిసరి.**

ఓటరు పేరు తొలగింపు లేదా ఇతర మార్పులకు సంబంధించిన నిర్ణయాలను స్పష్టమైన కారణాలతో కూడిన స్పీకింగ్ ఆర్డర్ రూపంలో జారీ చేయాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటరు పేరు ముసాయిదా జాబితాలోకి వచ్చిన విధానం, అభ్యంతరానికి కారణం, సమర్పించిన పత్రాలు, విచారణలో తేలిన అంశాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. తుది నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత రికార్డులను పలుమార్లు పరిశీలించి పూర్తి బాధ్యతతో చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో అప్పీళ్లు వచ్చినా రికార్డుల ఆధారంగా నిర్ణయాన్ని సమర్థించుకునేలా వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు.

**డేటా ఎంట్రీపై నిరంతర పర్యవేక్షణ.**

ఎన్యూమరేషన్ ఫారాల డేటా ఎంట్రీలో పొరపాట్ల కారణంగా నాన్–మ్యాపింగ్ కేటగిరీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సీఈవో పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరును సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి దశలో నాణ్యతా తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

**రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలి.**

క్లెయిమ్స్, అబ్జెక్షన్ల వివరాలను రోజువారీగా లేదా కనీసం వారానికి ఒకసారి సంబంధిత కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని సీఈవో సూచించారు. అవసరమైన చోట రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా సమాచారం అందించాలని తెలిపారు. అనామలీస్ లిస్ట్, నాన్–మ్యాపింగ్ కేటగిరీల వివరాలను సాధ్యమైన మేరకు రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. విచారణకు హాజరయ్యే ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలపై ముందుగానే స్పష్టమైన సమాచారం ఇవ్వాలని, అవసరమైన ఆధార పత్రాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. విచారణల అనంతరం జరిగే అప్పీళ్ల ప్రక్రియకు కూడా సిబ్బందిని ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. సార్ ప్రక్రియలో నోటీసుల జారీ నుంచి వాటి స్వీకరణ, విచారణ, పత్రాల సమర్పణ, నిర్ణయం, స్పీకింగ్ ఆర్డర్ వరకు ప్రతి దశకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా భద్రపరచాలని సీఈవో స్పష్టం చేశారు. ఒకే చిరునామాకు సంబంధం లేని వ్యక్తుల పేర్లు నమోదవడం, వాస్తవంగా ఆ ప్రాంతంలో నివసించని వ్యక్తుల పేర్లు జాబితాలో ఉండటం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్‌డీఓ నవీన్, సంబంధిత ఎన్నికల అధికారులు.

# మండలంలోనీ పలు గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**వీవో సంఘం భవనాలకు శంకుస్థాపన**

**ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు**





**భూపాలపల్లి/ గణపురం మీడియా టుడే ఆగస్టు 29**

భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలంలో శనివారం పలు గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంతో పాటు మహిళా వీవో సంఘం భవన నిర్మాణ పనులకు భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు గణపురం మండలంలో చెల్పూర్ గ్రామపంచాయతీ ఆవరణలో చెల్పూర్, గొల్లపల్ల ధర్మారావుపేటలో బస్వరాజ్‌పల్లి పరశురాంపల్లి ధర్మారావుపేట వెంకటేశ్వర్లపల్లి నగరంపల్లి సీతారాంపూర్‌లో కొండాపూర్ సీతారాంపూర్ అప్పాయిపల్లి గణపురం బురకాయల గూడెం; గాంధీనగర్‌లో గాంధీనగర్, మైలారం, లక్ష్మారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే వెంకటేశ్వర్లపల్లి, అప్పాయిపల్లి గ్రామాల్లో వీవో సంఘం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గత పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వని పరిస్థితి ఉండేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. భూ సర్వే, రేషన్ కార్డులు తదితర కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మహిళా సంఘాలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా వీవో సంఘాల భవన నిర్మాణాలతో పాటు వడ్డీ లేని రుణాలు, ఆర్థిక సహకారం వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబాలు, గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రేషన్ కార్డు లబ్ధిదారులు, మహిళా సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల సాధనకై సెప్టెంబర్ 6న చలో ఢిల్లీ

**ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ పిలుపు.. గోడపత్రిక ఆవిష్కరణ**




**బాలాపూర్ (మీడియాటుడే ప్రతినిధి ), ఆగస్టు 29:**

గిరిజన హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 6న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ పిలుపునిచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. ధర్మ నాయక్, ఆర్. శ్రీరాం నాయక్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 6న జాతీయ పోరాట సదస్సు, సెప్టెంబర్ 7న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మంది ఆదివాసి గిరిజనులతో మహా ధర్నా నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ లోకూర్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, ఆర్మ్ జాతీయ నాయకురాలు బృందా కారత్, త్రిపుర మాజీ మంత్రి, ఆర్మ్ జాతీయ ఛైర్మన్ జితేంద్ర చౌదరి, బెంగాల్ మాజీ పార్లమెంట్ సభ్యులు పులిన్ బస్కే తదితరులు పాల్గొంటారని తెలిపారు. దేశంలోని 16 రాష్ట్రాల నుంచి ఆదివాసి గిరిజనులు, ఉద్యమకారులు హాజరుకానుండగా.. తెలంగాణ నుంచి 100 మంది ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ కొత్త చట్టాలను తీసుకొస్తోందని వారు ఆరోపించారు. రాజ్యాంగంలోని ఐదో, ఆరో షెడ్యూళ్లలో ఆదివాసీలకు కల్పించిన భూమి హక్కులతో పాటు పేసా చట్టం, 1/70 చట్టం, జీఓ నంబర్ 3 వంటి అంశాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వారు విమర్శించారు. అటవీ భూములపై గిరిజనులకు హక్కులు కల్పించే అటవీ హక్కుల గుర్తింపు చట్టానికి భంగం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం విధానాలు రూపొందిస్తోందని ఆరోపించారు. అలాగే ఉపాధి హామీ పథకంలో మార్పులు తీసుకురావడం ద్వారా ఆదివాసి గిరిజనుల హక్కులకు నష్టం కలుగుతోందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, విద్యార్థులకు వారి తరగతులకు అనుగుణంగా సీట్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల్లో నిరుద్యోగం పెరుగుతోందని, ఉద్యోగ నియామకాలు, ప్రమోషన్లలో వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గిరిజన తెగలు మాట్లాడే భాషలను ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. సెప్టెంబర్ 6, 7 తేదీల్లో జరిగే సదస్సు, మహా ధర్నాలో గిరిజనుల సమస్యలపై చర్చించి దేశవ్యాప్త ఉద్యమానికి కార్యాచరణ రూపొందిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. బాలు నాయక్, నగర అధ్యక్షులు వి. రాంకుమార్, ఎస్. కిషన్, రంగారెడ్డి జిల్లా నాయకులు ఎం. గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్వీ గ్రామంలో బాధితుల కుటుంబాలను పరామర్శించిన భోస్లే మోహన్‌రావు పాటిల్



**తానూర్,ఆగస్టు 29(**

మండలంలోని ఎల్వీ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బాపూరావు తండ్రి శంకర్ (మాజీ సర్పంచ్) అలాగే డి. పోతన్న మాతృమూర్తి బీరాబాయి ఇటీవల మృతి చెందారు, విషయం తెలుసుకున్న 'మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్' చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకులు భోస్లే మోహన్‌రావు పాటిల్ ఆదివారం వారి నివాసాలను సందర్శించారు,?బాధిత కుటుంబ సభ్యులను కలసి మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు,వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, అధైర్యపడవద్దని మనోధైర్యాన్ని నింపారు, ఈ పరామర్శ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, వార్డు మెంబర్లు, యువకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

## రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారిణికి సన్మానం




**భూపాలపల్లి / గణపురం మీడియా టుడే ఆగస్టు 29**

గణపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి దేశానికి పతకాలు సాధించి వన్నె తేవాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేసు సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ?ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని క్రీడాకారులందరికీ ధ్యాన్‌చంద్ గొప్ప స్ఫూర్తిప్రదాత అని కొనియాడారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు రన్నింగ్, కబడ్డీ, చెస్, క్యారమ్స్ తదితర క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ?ఇదే వేదికపై గతంలో నారాయణపేట జిల్లా మక్తల్‌లో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థిని అఫీషాను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు కోసరి సరిత, ఉపాధ్యాయులు కుమారస్వామి, శాకీరా బేగం, రాంబాబు, శ్రీనివాస్, దేవేందర్, ముస్తాక్, దిల్షాద్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

# మొరిపిరాలలో శివలింగంకు జలాభిషేకం



**మీడియా టుడే, ఆగస్టు29/ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్:**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం మొరిపిరాల గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా శనివారం రోజున గ్రామ ప్రజలు స్థానిక శివాలయంలో శివలింగంకు జలాభిషేకం చేశారు. ఆదివారం రోజున జరిగే బోనాల ఉత్సవాల్లో గ్రామ ప్రజలు అందరు పాల్గొని సంతోషంగా పండుగ జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ కుంకుమార్చన, జలాభిషేకం కార్యక్రమం

**మర్కుక్ ఆగస్టు 29 మీడియా టుడే**



సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాలకు కుంకుమార్చన జలాభిషేకాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాళ్ల బండి బాలకృష్ణ, గ్రామ సర్పంచ్ కవిత రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు . అదేవిధంగా ఉప సర్పంచ్ సబితా కరుణాకర్, వార్డు సభ్యులు ,భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం నాయకులు పొన్నోజు బాలరాజు, రాళ్ళబండి బాలకృష్ణలు మాట్లాడుతూ... జగద్గురువులు, కాలజ్ఞాని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమాజానికి అందించిన బోధనలు ఎల్లప్పుడూ అనుసరణీయమని కొనియాడారు. ఆయన చూపిన ధర్మ మార్గం, సామాజిక సమరసత నేటి సమాజానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల శాంతి సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని, రాబోయే తరాలకు మన సంస్కృతి, సాంప్రదాయాలను అందించినట్లవుతుందని వారు తెలిపారు.ఆలయ నిర్మాణానికి, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి సహకరిస్తున్నా ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ కమ్మరి బాలరాజు, పొన్నోజ్ సాయి కుమార్ ,పొన్నోజు రామస్వామి,నాగారం ఆనందం, భాస్కర్,రమణయ్య, నాగారం మల్లేష్,సత్యనారాయణ,బాలనరసయ్య, బాలా చారిచారి,విశ్వకర్మ సంఘం నాయకులు గ్రామ ప్రముఖులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

# అడ్డగూడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన



**మీడియా టుడే, ఆగస్టు29/**
**ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్:**

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం మండల న్యాయ సేవ అధికార సంస్థ(ఎంఎల్ఎస్సీ) రామన్నపేట ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య మాట్లాడుతూ నేటి బాలలే భవిష్యత్తు దేశ సంపదని బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, బాలల హక్కుల పరిరక్షణ మన అందరి బాధ్యత అని అన్నారు. మరియు 1098,100, 108, 112, తదితర టోల్ ఫ్రీ నెంబర్ల గురించి అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం సీనియర్ అడ్వకేట్లు డేవిడ్, ప్యానల్ అడ్వకేటు కూనూరు శ్రీనివాస్ లు విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు వాహన చట్టాలు, పోక్సో,గంజాయి పై, అలాగే గుడ్ టచ్, బాడ్ టచ్, మానసిక , శారీరక వేధింపులు ఎదురైనప్పుడు విద్యార్థినీలు అనుసరించాల్సిన పద్ధతులు , మెలకువలు మొదలగు అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. బాల్య వివాహాల నిర్మూలన కొరకు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పై అవగాహన కల్పించడం జరిగింది.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచర్ల రాజ్య వర్ధన్ రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అగ్రి లీగలైడ్ క్లినిక్ కే. శ్రీశైలం, లీగల్ సర్వీస్ ప్రతినిధి కురిమేటి యాదయ్య, పాఠశాల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి విజయలక్ష్మి గారు, స్థానిక సర్పంచ్ వాసం విష్ణువర్ధన్ రావు,ఏపిపిసి చైర్మన్ చిత్తలూరి సరిత, పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయినీలు , మండల పరిధి పోలీసు అధికారులు, గ్రామపంచాయతీ కార్యవర్గం, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు కూల్చిన ఉదంతంపై బాధితురాలు నాగేంద్ర

### కేసును విత్ డ్రా చేసుకోమని తనను బెదిరిస్తున్నారుని మరో బాధితురాలు కళావతి

### యువ నేత తుమ్మల యుగంధర్ కు ఫిర్యాదు



**ఖమ్మం, ఆగస్టు 29 :**

ఇటీవల రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్ నగర్ లో తాను లేని సమయంలో రాత్రిపూట తన ఇల్లును కూల్చివేసిన ఉదంతంపై బాధితురాలు బుక్యా నాగేంద్ర తన భర్త శ్రీనివాస్ తో కలిసి , వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి ఆధ్వర్యంలో యువ నేత తుమ్మల యుగంధర్ కు శనివారం ఫిర్యాదు చేశారు. ఇటీవల ఖమ్మం నగరంలోని రామచంద్రయ్య ప్రాంతంలో జరిగిన ఘర్షణలో తాను పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ కేసును విత్ డ్రా చేసుకోమని నిందితులు తనను బెదిరిస్తున్నారని మరో బాధితురాలు కళావతి కూడా ఇదే సమయంలో తుమ్మల యుగంధర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఉపేంద్ర బాయి కు ఏమాత్రం సంబంధం లేకున్నా ఆమెను వివిధ సామాజిక మాధ్యమాలలో టార్గెట్ చేస్తూ అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా ఆమె వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారని నాగేంద్ర తన ఫిర్యాదులో పేర్కొంటూ తన ఇల్లు కూల్చిన సంఘటనలో పాల్గొన్న వారందరిపై చర్యలు తీసుకుని, వారి నుండి తనకు నష్టపరిహారాన్ని ఇప్పించాలని కోరారు. అంతేకాకుండా గతంలో కూడా ఇదే విధంగా సదరు నిందితులు యాకోబు, శివ లతోపాటు ఇతర నిందితులు, సర్పంచ్ అనుచరులు వీరన్న శివ ఇస్మాయిల్ స్థానిక సర్పంచ్ సిద్దికి అండదండలతో తన ఇంటి పై దాడికి దిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఆనాడే పోలీసులు చర్యలు తీసుకుంటే ఈ ఇల్లు కూల్చబడేది కాదని తన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వారందరిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తన ఈ విషయంలో ప్రశ్నించినం దుకుగాను ఒంటరి, లంబాడి గిరిజన మహిళ ఉపేంద్ర బాయి ను కుల వివక్షతో టార్గెట్ చేసిన ఈ నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని కోరారు. మరో బాధితురాలు కళావతి తన వినతి పత్రంలో.... ఇటీవల జరిగిన ఒక ఘర్షణలో తాను పోలీసులకు ఫిర్యాదు చేయగా నమోదైన కేసును విత్ డ్రా చేసుకోమని నిందితులు ఇంటికి వచ్చి మరీ బెదిరిస్తున్నారని , ముఖ్యంగా ఎలుక శివ అనే వ్యక్తి తనను విత్ డ్రా చేసుకొని పక్షంలో మరోసారి దాడికి పాల్పడతామని హెచ్చరిస్తున్నట్లు ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. యువ నేత దీనిపై దృష్టి సారించి తనకు న్యాయం చేయాలని , వారి నుండి తనకు ప్రాణహాని ఉన్న దృష్ట్యా తనకు రక్షణ కల్పించాలని వినతి పత్రంలో ఆమె విన్నవించారు. అంతకుముందు భూక్య నాగేంద్ర తన ఇల్లు కూల్చివేత పై రఘునాధపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి, నాయకులు నల్ల నాగమణి, ఏ.సరోజని, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీను, గిరిజన నాయకులు రాంబాబు నాయక్ నాయక్ , వీరన్న నాయక్, కాంగ్రెస్ నాయకుడు రాము తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాషతోనే విలువలు సాధ్యం

**మీడియా టుడే కరీంనగర్ (ఇరుకుల్ల ) : ఆగస్టు 29.**




కరీంనగర్ జిల్లాలోని ఇరుకుల్ల బాయ్స్-2లో మాతృబాషను సంరక్షించుకోవడం ద్వారానే సమాజం లో విలువల పరిరక్షణ సాధ్యం అవుతుందని ఇరుకుల్ల మైనారిటీ గురుకుల పాఠశాల /కళాశాల ఇంచా ర్జి ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. తెలుగు బాషా దినోత్సవం సందర్భంగా ఇరుకుల్ల మైనారిటీ గురుకుల పాఠశాలలో టి ఎల్ ఎమ్ మేళా, పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ బాషా సామాన్యునికి అందుబాటులో ఉన్నప్పుడే అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జ్ఞానం కోసం ఇతర భాషలు నేర్చుకున్న కానీ మాతృ బాషా జ్ఞానం లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. సాహిత్యం ద్వారానే సమాజం లో విలువలు కాపాడబడతాయని అన్నారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడటంలో మాతృ బాషా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గిగుడు రామ్మూర్తి, శ్రీ శ్రీ, కాళోజి, దాశరథి లాంటి కవుల రచనలు ఉత్తమ మానవుని జీవితానికి దిశా నిర్దేశం చేస్తాయని కావున సాహిత్య అధ్యయనం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన టి ఎల్ ఎమ్ మేళా విద్యార్థులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లో పాఠశాల కో ఆర్డినేటర్ సురేష్ , కళాశాల అధ్యాపకులు నాజియా,రాజు, శ్రీలత, అశోక్ ఉపాధ్యాయులు సతీష్,విష్ణు, శ్రీనివాస్, పవన్, షాజీయుద్దీన్, రాజు,అస్రా, జ్యోతి, శ్రీలత, ఉదయ, ఫైజా, షాహెదా, రాజు, వార్డెన్ ఫకృద్దీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచులు

### సర్పంచ్ గాజా హేమలత అశోక్, కైలాపూర్ గ్రామ సర్పంచ్ కోదారి ఓదెలు

### గ్రామీణాభివృద్ధి పేదల సంక్షేమం లక్ష్యం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి / మీడియా టుడే ఆగస్టు 29**

శనివారం భూపాలపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో చిట్యాల మండలంలోని బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన రామచంద్రాపూర్ సర్పంచ్ గాజా హేమలత అశోక్, కైలాపూర్ గ్రామ సర్పంచ్ కోదారి ఓదెలు తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు,ప్రజల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలకు ఆకర్షితులై వారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరినట్లు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామాల ముఖ్య నాయకులు, సర్పంచులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి,రైతు సంక్షేమం, మహిళల సాధికారత, పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని అన్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు తమ గ్రామాల అభివృద్ధికి మరింత సేవ చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి భూపాలపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరఫున స్వాగతం పలుకుతూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్ ను ఎంపీపీఎస్ క్వార్టర్స్‌కు బహుకరించిన మాజీ ఎంపీపీ.అనుములపాండమ్మ,శ్రీనివాసరెడ్డి ప్రారంభించిన ఏం ఎల్ ఏ

**త్రిపురారం మండలం, నల్లగొండ జిల్లా**
**మీడియా టుడే బ్యూరో**



విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన త్రాగునీటిని అందించాలనే ఉద్దేశంతో త్రిపురారం మండల కేంద్రం లోని,ఎంపిపిఎస్ దుబ్బ క్వార్టర్స్ నందు మాజి ఎంపీపీ అనుముల పాండమ్మా శ్రీనివాస్ రెడ్డి(ధాత) గారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జలశుద్ధి కేంద్రాన్ని ( ఎఆఅఆ ఔషవతీ జూశ్రీఖత్)ను నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి గారు ప్రారంభించారు.నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ బహుకరించిన మాజి ఎంపీపీ అనుముల పాండమ్మా శ్రీనివాస్ రెడ్డి గారిని జైవీర్ రెడ్డి గారు అభినందించారు. విద్యార్థులకు క్వాలిటీ త్రాగు నీరు అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో వారితోపాటు మండల పార్టీ అధ్యక్షులు అలంపల్లి జానయ్య,మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముడిమల్ల బుచ్చిరెడ్డి,అనుముల నాగమణి పాపిరెడ్డి (ఉపసర్పంచ్), 11వ వార్డ్ మెంబర్ గోపు శ్యామ్ సుందర్ రెడ్డి, మాజీ 7వ వార్డ్ మెంబర్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, మజ్జిగపు శ్రీనివాస్ రెడ్డి,మాజి వైస్ ఎంపీపీ అవిరెండ్ల మట్టయ్య,జై కృష్ణ,డీలర్ మట్టయ్య, బోయ వేణు, మధార్ హుస్సేన్,నేతి వెంకన్న, బాలాజీ, రంగారెడ్డి, ఉపాధ్యాయులు,విద్యార్థులు మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నేలకొండపల్లిమండలంలోగ్యాస్ బండపై అక్రమవసూళ్ల.చర్యలు తీసుకోవాలని డిమాండ్

**నేలకొండపల్లి ఆగస్టు 29**
**మీడియా టుడే ప్రతినిధి**




నేలకొండపల్లి మండలంలో గ్యాస్ పంపిణీలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోనిఅనాసాగరం గ్రామంలో హెచ్.పి గ్యాస్ డెలివరీబాయ్ను నివారంప్రభుత్వం నిర్ణయించిన రూ. 973 రేటుకు ఇవ్వాల్సి ఉండగా, వినియోగదారుల నుండి అదనంగా రూ. 30 నుండి 50 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికే గ్యాస్ ధరలు భారంగా మారి పెరిగిన ధరలకుసామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, డెలివరీ సిబ్బంది అదనపు వసూళ్లతో మరింత భారం మోపుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై సామాజిక కార్యకర్త బైరం.జ్యోతిఖమ్మంజిల్లాజాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కి. నేలకొండపల్లి తాసిల్దార్ రాంప్రసాద్ కి ఫిర్యాదు చేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయించిన రేటుకే గ్యాస్ సిలిండర్లు విక్రయించేలా చూడాలని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న గ్యాస్ ఏజెన్సీ మరియు డెలివరీ సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బైరం జ్యోతి డిమాండ్ చేశారు.

# కూకట్‌పల్లిలో ఘనంగా పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**కూకట్‌పల్లి, ఆగస్టు 29 (మీడియా టుడే ప్రతినిధి)** కూకట్‌పల్లి నియోజకవర్గం వసంత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎన్ఆర్ఎస్ఏ కాలనీలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, వ్యాపారవేత్త పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు అభిమానులు, స్థానిక నాయకులు, కాలనీవాసుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డి కేక్ కట్ చేసి అభిమానులు, నాయకులు, కాలనీవాసుల నుంచి శుభాకాంక్షలు స్వీకరించారు. అనంతరం కూకట్‌పల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండి మధుసూదన్ రెడ్డి, శివరెడ్డి, జీఎల్ఎన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సూర్య ఉదయం తెలంగాణ ఎడిటర్ బాషా, శ్రీకాంత్ రెడ్డి తదితరులు భారీ కేక్ కట్ చేయించి, పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డి వైఎస్సార్‌సీపీ యువ నాయకుడిగా, వ్యాపారవేత్తగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి సోదరుడైన వెంకట్రామ్ రెడ్డి మాచర్ల రాజకీయాల్లో తన అన్నతో కలిసి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన భవిష్యత్తులో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, రాజకీయంగా మరింత ఎదిగి ప్రజాసేవలో ముందుండాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో అభిమానులు, స్థానిక నాయకులు, ఎన్ఆర్ఎస్ఏ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# అక్టోబర్ చివరి నాటికి రీ సర్వే పూర్తి చేయాలి

## డిసెంబర్‌లో రెండో విడత సర్వేకు సిద్ధం కావాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్

**సూర్యాపేట బ్యూరో (మీడియా టుడే):** రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత చేపట్టిన రీ సర్వేకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో రెండో విడత సర్వే చేపట్టేందుకు ఇప్పటి నుంచే సంసిద్ధం కావాలని సూచించారు. దశాబ్దాలుగా గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిందని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. తొలి విడతలో సర్వే చేపట్టిన 70 గ్రామాల్లో పారదర్శకంగా సర్వే నిర్వహించి గ్రామ సరిహద్దులను నిర్ధారించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని నిర్ణయించిన గడువుకు ముందే సర్వే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా చూడాలని అన్నారు. రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను చట్టానికి లోబడి శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సర్వే కోసం నియమించిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు.

**15 రోజుల్లో ఎల్-3 సమస్యలు పరిష్కరించాలి.**

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తొలి విడత మంజూరైన ఇళ్లకు సంబంధించిన ఎల్-1, ఎల్-2, ఎల్-3 సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా మంజూరు సమయంలోనే అన్ని అంశాలను పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా 15 రోజుల్లో ఎల్-3 సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు .మంజూరు ఉత్తర్వుల ఆధారంగా ఇందిరమ్మ ఇంటికి ఒక బిల్లు జారీ అయి, ఆ తర్వాత బిల్లులు రాకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు అన్ని పన్నులు, రవాణా చార్జీలు కలుపుకొని రూ.230కే సిమెంట్ బస్తా అందించేలా సిమెంట్ కంపెనీలతో మాట్లాడి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను గుర్తించి 15 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలి విడతలో చేపట్టిన అసంపూర్తి ఇందిరమ్మ ఇళ్లను దసరాలోపు పూర్తి చేయాలని సూచించారు. నల్గొండ పట్టణంలో ఇందిరమ్మ టవర్స్ కింద 500 గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు సమీపంలో ఎక్కడ ఇసుక లభిస్తే అక్కడి నుంచి సరఫరా చేసేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పట్టాల కోసం గతంలో భూములు గుర్తించి ఇంకా పంపిణీ చేయని వాటికి వెంటనే జాబితా రూపొందించి పంపిణీ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలని, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధానాలకు తావివ్వరాదని అన్నారు. భూ సమస్యలకు సంబంధించిన 45 దరఖాస్తులను తన లాగిన్‌లో ఎక్కువ రోజులు పెండింగ్‌లో ఉంచిన యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసీల్దార్ పనితీరుపై వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వేకు సర్వేయర్ల కొరత ఉన్న చోట అవసరమైతే పక్క మండలాల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేయాలని సూచించారు. సర్వే నిర్వహించిన రోజే ఆన్‌లైన్‌లో రికార్డులను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. రీ సర్వే ద్వారా రెవెన్యూ రికార్డుల పూర్తి ప్రక్షాళన జరుగుతుందని, తద్వారా 90 శాతానికి పైగా భూ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు.

**దసరాలోపు ఇళ్లు పూర్తి చేయాలి: కోమటిరెడ్డి.**

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ భూ భారతి, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. పేదవాడికి ఇల్లు ఎంతో ముఖ్యమని, తొలి విడతలో మిగిలిపోయిన ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను దసరాలోపు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులను కోరారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 సమస్యలను పరిష్కరించడంతో పాటు నల్గొండలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భూ భారతి ద్వారా పేదలకు సంబంధించిన నిజమైన భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల ఎల్-3 సమస్యలను పరిష్కరించాలని, నకిరేకల్‌కు మంజూరైన జిల్లా కోర్టు విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎల్-3 సమస్యల పరిష్కారంలో కలెక్టర్లు చొరవ చూపాలని కోరారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మిర్యాలగూడ రిజిస్ట్రేషన్ కార్యాలయం, అడవిదేవులపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం



మంజూరు అంశాలను ప్రస్తావించారు. మిర్యాలగూడ మున్సిపాలిటీగా ఉన్నందున అదనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు శాలిగౌరారం మండలం మాదారం చెరువు శిఖం భూముల ఆక్రమణ, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ సాదా బైనామాల సమస్యల పరిష్కారంలో లింక్ డాక్యుమెంట్లు అడుగుతున్నారని, ఆర్ఓఎఫ్ఆర్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ముగ్గు పోసుకున్న వారికి కూడా ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సాదా బైనామాల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నక్షా మ్యాపులపై దృష్టి కేంద్రీకరించాలని, ఇందిరమ్మ ఇళ్ల ఎల్-3 సమస్యలను సరళీకృతం చేయాలని కోరారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి తన నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌ఆర్ సమస్యలను పరిష్కరించాలని, అటవీ, అసైన్డ్ పట్టాల లబ్ధిదారులకు న్యాయం చేయాలని, ఎల్-3 సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశం ప్రారంభంలో రెవెన్యూ సీసీఎల్ఏ కార్యదర్శి లోకేష్‌కుమార్, ల్యాండ్ సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్ తమ శాఖలకు సంబంధించిన అంశాలను వివరించారు. అనంతరం సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాలకు చెందిన పలువురు తహసీల్దార్లతో మంత్రి పొంగులేటి రీ సర్వేపై సమీక్ష నిర్వహించి సర్వే జరుగుతున్న తీరు, సమస్యలు, ప్రజల నుంచి వస్తున్న అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే జరుగుతున్న గ్రామసభలకు ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, జిల్లా కలెక్టర్లు తప్పనిసరిగా హాజరుకావాలని మంత్రి ఆదేశించారు. నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తమ జిల్లాల్లో తీసుకుంటున్న చర్యలను మంత్రులకు వివరించారు. సమీక్ష సమావేశంలో ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ రిజిస్ట్రార్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీలు, తహసీల్దార్లు, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పివిఆర్ హోటల్ లో వ్యభిచారం వైరల్‌గా మారిన వీడియో




**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా ఆగస్టు 29 :** ఆర్మూర్ పట్టణ కేంద్రంలో ఉన్న జాతీయ రహదారుల పక్కన ఉన్న పివిఆర్ హోటల్ లో వ్యభిచార అడ్డాగా మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం రాత్రి సోషల్ మీడియాలో కొన్ని వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ నెల 16వ తేదీన ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పివిఆర్ హోటల్ లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిజామాబాద్ మాజీ కార్పొరేటర్ రాజాసింగ్ వ్యభిచారం చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారని ప్రచారం జరుగుతోంది. ఈ ఘటన జరిగి సుమారు 12 రోజులు గడిచిపోయినా పీవీఆర్ హోటల్ లో వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ రాజాసింగ్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్మూర్ పట్టణంలోని పివిఆర్ హోటల్ లో వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డ సదరు కాంగ్రెస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ రాజాసింగ్‌కు సంబంధించిన వీడియో బయటకు పొక్కినట్లు ఆర్మూర్‌లో ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా ఆర్మూర్‌లో పలు కీలక కేసుల్లో ఇలాంటి వ్యవహారాలను ఆర్మూర్ పోలీసులు దాచి ఉంచుతున్నారనే ఆరోపణల పై స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చిన్నచిన్న కేసుల్లో మాత్రం పోలీసులు హడావుడిగా సెల్‌ఫోన్లు పట్టుకోవడం, వాటిని సంబంధిత బాధితులకు అప్పగించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం వంటి వివరాలను ఆర్మూర్ ప్రాంత విలేకరులకు వెల్లడించడం పరిపాటిగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల ఆర్మూర్‌లో ఓ యువకుడు తన బాబాయి ఇంట్లోనే చోరీకి పాల్పడిన ఘటనను కూడా ఆర్మూర్ పోలీసులు విలేకరులకు వెల్లడించకుండా, విషయం బయటకు పొక్కకుండా ఉంచారని ప్రచారం జరిగింది. చివరకు ఆ దొంగతనం కేసు వివరాలను జిల్లా సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించడం తెలిసిందే. అయితే ఆ వ్యవహారంలో అసలు ఏం జరిగింది, ఎంత మొత్తంలో చోరీ జరిగింది, పోలీసులు ఎంత మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎంత మొత్తాన్ని చూపించారు, అనే విషయాలు అంతుచిక్కని ప్రశ్నలుగా మిగిలాయని విశ్వసనీయ సమాచారం ఏది ఏమైనా ఆర్మూర్ పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో దేశంలోని 100 అత్యుత్తమ ఐపీఎస్ అధికారుల జాబితాలో చోటు సంపాదించి జాతీయస్థాయిలో ప్రశంసలు అందుకున్న జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యే కేసులు, జరుగుతున్న సంఘటనలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నిక్కచ్చిగా వెల్లడించేలా ఆర్మూర్ పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. అదేవిధంగా ఈ నెల 16వ తేదీన ఆర్మూర్‌లోని పివిఆర్ హోటల్ లో వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డారని ప్రచారం జరుగుతున్న కాంగ్రెస్ నాయకుడు, మాజీ నిజామాబాద్ కార్పొరేటర్ రాజాసింగ్ వ్యవహారాన్ని పోలీసులు ఎందుకు బయటకు వెల్లడించలేదు, పివిఆర్ హోటల్ లో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను బయటకు రాకుండా అడ్డుకున్నది ఎవరు, ఈ వ్యవహారానికి సహకరించిన పోలీస్ అధికారులు ఎవరనే విషయాలను జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య నిగ్గు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి ఇప్పటికైనా జిల్లా కమిషనర్ తగు చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు.

# చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎడ్లపల్లి సతీష్




**భూపాలపల్లి/చిట్యాల మీడియా టుడే ఆగస్టు 29** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా వై. సతీష్ (ఎడ్లపల్లి సతీష్)శుక్రవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు.?ఈ సందర్భంగా సీఐ సతీష్ మాట్లాడుతూ? శాంతిభద్రతల పరిరక్షణ: సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.?చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం: జూదం, అక్రమ మద్యం, గంజాయి, ఇసుక అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు?ప్రజల సమస్యల పరిష్కారం ఠాణాకు వచ్చే బాధితులు ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు

# ఉయ్యాల వేడుకలో చిన్నారికి ఆశీస్సులు

**నూతన వస్త్రాలు బహుకరించిన ఏదులాపురం**

**కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్**

**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**



ఖమ్మం : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి వరంగల్ క్రాస్ రోడ్డు 30వ వార్డు మదర్ తెరెస్సా కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకులు తప్పేట్ల గిజ్జన్--ఉమామహేశ్వరి దంపతుల కుమారుడి ఉయ్యాల వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భూక్యా సురేష్ నాయక్, 30వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొట్టెం శిరీష రంజిత్ రెడ్డి చిన్నారిని ఆప్యాయంగా ఆశీర్వదిస్తూ నిండునూరేళ్లు అష్టైశ్వర్యాలు,ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని మనసారా ఆకాంక్షించారు. అనంతరం చిన్నారికి నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు అక్కినేపల్లి దేవయ్య చారి, స్థానిక నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు.

# సుద్దాలలో బోనాల పండుగ సంబరాలు




**మీడియా టుడే, ఆగస్టు29/ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామంలో శనివారం రోజు బోనాల పండుగ సందర్భంగా గ్రామస్తులు గ్రామ దేవతల చుట్టూరా ఎడ్లబండ్లను పసుపు కుంకుమలతో మామిడి తోరణాలతో అలంకరించి ప్రదక్షిణలు చేయడం జరుగుతుంది. అనంతరం మహిళలు బోనాలతో బయలుదేరి గ్రామ దేవతల చుట్టూరా ప్రదక్షిణలు చేసి అనంతరం బోనాలను గ్రామ దేవతలకు సమర్పించటం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పూజారి వేప నరసింహ మూర్తి పంతులు పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, సుఖఃసంతోషలతో, పాడిపంటలతో కరువు కాటకాలు లేకుండా ఉండాలని గ్రామ దేవతలను పూజించి ప్రార్ధించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, మహిళలు, భారీఎత్తున పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్ తో యువకుడు మృతి

**మునగాల ఆగస్టు 29 (మీడియా టుడే)-:** మునగాల మండల పరిధిలో కోదండరామాపురం గ్రామం లో వీధిలైట్లు వేస్తుండగా ఆగస్మాత్తుగా కరెంటు సప్లై రావటం వల్ల యువకుడు కరెంటు షాక్ కి అక్కడికక్కడే మృతి చెందాడు

# ఆలేరు నియోజకవర్గ విస్తృత స్థాయి ముఖ్య నాయకుల సమావేశం

**కాంగ్రెస్ పాలన వెయ్యి రోజు పూర్తి**

**ఇచ్చిన గ్యారెంటీలు,420 హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తుంది**

**మాజీ ప్రభుత్వ విప్ ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి**




**మీడియా టుడే, ఆగస్టు29/ఆలేరు ఆర్సీ ప్రతినిధి ఎన్ ఆర్ ఆర్:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తున్నందున బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం సెప్టెంబర్ 2 నుండి సెప్టెంబర్ 8 వరకు వరుసగా నిరసన కార్యక్రమాలు నిర్వహించుట కొరకు శనివారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని ఎస్ ఎల్ ఎన్ ఎస్ ఫంక్షన్ హాల్లో ఆలేరు నియోజకవర్గ విస్తృత స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి మరియు ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి మరియు ఆలేరు నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోబడును

**రాయికల్-మీడియా టుడే-ఆగస్టు 29:**




అనుమతి లేకుండా నూతన నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ తెలిపారు. రాయికల్ మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణం చేపట్టే ప్రజలు తెలంగాణ మున్సిపల్ రూల్స్ ప్రకారం తప్పనిసరిగా ముందస్తు భవన నిర్మాణ అనుమతి పొందాలని..నిర్మాణ సమయంలో సంబంధిత బిల్డింగ్ రూల్స్ ప్రకారం అవసరమైన కనీస రహదారి 30 అడుగుల వెడల్పు, సెట్ బ్యాక్ తో పాటు ఇతర నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ సూచించారు. మున్సిపల్ అనుమతి లేకుండా లేదా అనుమతికి విరుద్ధంగా నిర్మాణం చేపట్టినట్లయితే కఠినమైన చర్యలతో పాటు అవసరమైతే అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం జరుగుతుందని తెలిపారు.

# అత్యవసర సేవలకు విఘాతం కలిగిస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

**రాయికల్-మీడియా టుడే-ఆగస్టు 29:**




రాయికల్ పోలీస్ స్టేషన్ లో అత్యవసర సేవలకు విఘాతం కలిగిస్తున్న వ్యక్తిపై శనివారం ఏఎస్సై సైఫుద్దీన్ కు ఫిర్యాదు చేసినట్లు 108 సేవల ఈఏంటి మల్లేశం, పైలట్ మల్లారెడ్డి తెలిపారు. మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన రాకేష్ 108 అత్యవసర సేవకి పలుమార్లు కాల్ చేస్తు విఘాతం కలిగిస్తున్నాడు. మందలించిన కూడా అతని ప్రవర్తనలో మార్పు రాలేదని....శనివారం ఉదయం 9గంటల ప్రాంతంలో మళ్ళీ 108కి కాల్ చేసి విధులకు భంగం కలిగించగా జిల్లా మేనేజర్ యశోద ఐలయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ భూమా నాగేందర్ ఆదేశాల మేరకు ఫిర్యాదు చేసినట్లు :

# జాతీయ క్రీడ తెలుగు భాష దినోత్సవ వేడుకలు



**రాయికల్-మీడియా టుడే-ఆగస్టు 29:**

రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో శనివారం జాతీయ క్రీడా, తెలుగు భాష దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులను, తెలుగు పండితులను శాలువాతో, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. అనంతరం బాస్కెట్ బాల్ స్టేట్ పూర్వ క్రీడాకారులు వాసం ప్రసాద్, దాసరి గంగాధర్, బందెల శ్రీనివాస్, తాటిపాముల శ్యామ్, దేవేందర్ ల సహకారంతో 15వేల రూపాయలతో బాస్కెట్ బాల్ కోర్టులో రింగ్స్, కలర్లు, బాస్కెట్ బాల్ ను అందించి కోర్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్, ప్రధానకార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, కోశాధికారి మురళి, మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య, దాసరి గంగాధర్, మచ్చ శేఖర్, ఆడేపు రాంప్రసాద్, కుర్మ సుదర్శన్, బాలె నిఖిల్ కుమార్, సాంబారు శ్రీను, పులి రమేష్, సామల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సర్ లో లోపాలు సరిచేసుకునే అవకాశం



**రాయికల్-మీడియా టుడే-ఆగస్టు 29:**

రాయికల్ 29, 34 పోలింగ్ కేంద్రాలలోని ఓటర్ జాబితాలో లోపాలు ఉన్న ఓటర్లకు నో మ్యాపింగ్ మరియు అనోమలిస్ నోటీసులు అందించగా శనివారం మున్సిపల్ కార్యాలయములో అధికారులు హియరింగ్ నిర్వహించారు. నోటీసులు అందుకున్న వారు తప్పొప్పుల సవరణకు సంబంధించిన పత్రాలు సమర్పించి లోపాలు సరిచేసుకున్నారు. పోలింగ్ కేంద్రాలు 33, 36లో లోపాలు ఉన్నవారు ఈ నెల 31న....పోలింగ్ కేంద్రాలు 26, 30లో లోపాలు ఉన్నవారు సెప్టెంబర్ 1న.....పోలింగ్ కేంద్రాలు 31, 35, 38లో లోపాలు ఉన్నవారు సెప్టెంబర్ 3న..... పోలింగ్ కేంద్రాలు 27, 28, 32, 29, 34లో లోపాలు ఉన్నవారు సెప్టెంబర్ 5న మున్సిపల్ కార్యాలయములో నిర్వహించే హియరింగ్ కు సంబంధిత పత్రాలతో రావాలని అధికారులు సూచించారు. మున్సిపల్ కమీషనర్ మనోహర్ గౌడ్, ఆర్ఐ పద్మయ్య, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# అభిమానుల ఆధ్వర్యంలో అక్కినేని జన్మదిన వేడుకలు

**నేడు విడుదలైన కింగ్ 100 గ్లింప్స్ అద్భుతం**

**దేవిశ్రీ ప్రసాద్ సంగీతానికి అభిమానుల ప్రశంసలు**

**జగిత్యాలప్రతినిధి-**



అన్నపూర్ణ స్టూడియో అధినేత, ప్రముఖ నిర్మాత యువసామ్రాట్ కింగ్ అక్కినేని నాగార్జున జన్మదినం పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని వీఎల్ఎస్ శ్రీరామ థియేటర్లో జగిత్యాల జిల్లా అక్కినేని నాగార్జున అభిమానులు అంగరంగ వైభవంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సిరికొండ రవి ఆధ్వర్యంలో అభిమానులు కేక్ కట్ చేసి మీడియా మాధ్యమం ద్వారా యువసామ్రాట్ అక్కినేని నాగార్జునకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యువసామ్రాట్ అక్కినేని నాగార్జున మరిన్ని వైవిధ్యమైన చిత్రాలలో నటిస్తూ మరెన్నో విజయాలను అందిపుచ్చుకోవాలని అభిమానులు ఆకాంక్షించారు. రాబోయే ప్రతిష్టాత్మక కింగ్ 100 చిత్రం అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకోవాలని కోరారు. నేడు విడుదలైన కింగ్ 100 గ్లింప్స్ అద్భుతంగా ఉందని అభిమానులు పేర్కొన్నారు. చిత్రానికి సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అందించిన సంగీతం ఎంతో ఆకట్టుకుందని ప్రశంసిస్తూ, ఆయనకు అభిమానులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ జన్మదిన వేడుకల కార్యక్రమంలో కింగ్ అక్కినేని నాగార్జున అభిమానులు తుమ్మనపెల్లి రాజేంద్రప్రసాద్ బిజ్జారపు ప్రవీణ్ కుమార్ డి. రాజ్‌కుమార్ శివ సాగర్ నల్ల సురేష్ సట్ట సురేష్ మహేష్ నాగరాజు టి. రాజ్‌కుమార్ రంజీత్ అలీ ప్రేమ్‌కుమార్ గౌతమ్‌కుమార్ రాజేష్ రితికేశ్ తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయులకు విద్యా ప్రమాణాల మీద అవగాహన ఉండాలి

**- కాంప్లెక్స్ హెచ్ఎం**

**చేగుంట ప్రతినిధి( కర్రే రవి ):**

చేగుంట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మక్కరాజ్ పేటలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు సంబంధించి చిన్న శంకరంపేట, చేగుంట మండలాలకు సంబంధించిన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విద్యా ప్రమాణాల మీద, సబ్జెక్టు పై పూర్తి పరిజ్ఞానం ఉన్నప్పుడే విద్యార్థులకు బోధన చేయగలుగుతారని, కాలానుగుణంగా విద్యా వ్యవస్థలో వచ్చే మార్పులను స్వాగతించాలని, వాటికి అనుగుణంగా మన బోధనను మార్చుకోవాలని, విద్యార్థుల స్థాయికి తగిన బోధన చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ చల్లా లక్ష్మణ్, మంగ రాణి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# చేగుంటలో భక్తిశ్రద్ధలతో విష్ణు లలితా సహస్రనామ పారాయణం ప్రత్యేక పూజలు చేసిన మహిళలు



**చేగుంట ప్రతినిధి (కర్రె రవి,):**

చేగుంట మండల కేంద్రంలోని ప్రసిద్ధ సంతాన నాగదేవత దేవాలయంలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని మహిళలు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మ్యాకల వరలక్ష్మి జయరాములు సమక్షంలో సుమారు 30 మందికి పైగా ముత్తైదువులు ఆలయంలో సామూహికంగా శ్రీ లలితా సహస్రనామ పారాయణం, లింగాష్టకం, లలితా చాలీసాలను అత్యంత భక్తిశ్రద్ధలతో పఠించారు. పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రతి ఇంటా శుభాలు కలగాలని కోరుకుంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త మ్యాకల వరలక్ష్మి జయరాములు మాట్లాడుతూ సంతాన నాగదేవత ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటే సంతానలేమితో బాధపడే వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని, వివాహం కాని యువతీయువకులకు శీఘ్ర వివాహ యోగం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మండల స్థాయి క్రీడల్లో భిక్కనూర్ విద్యార్థినుల సత్తా

**100 మీటర్ల పరుగులో మెరిసిన ప్రతిభ ఒకరికి స్వర్ణం, మరొకరికి రజతం**

**భిక్నూర్ ఆగస్టు 29:**

మండల స్థాయి క్రీడా పోటీల్లో భిక్కనూర్‌కు చెందిన విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. దోమకొండ మండలంలోని గడికోటలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో భిక్కనూర్ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు. అండర్--16 విభాగంలో నిర్వహించిన 100 మీటర్ల పరుగుపందెంలో మనుశ్రీ రజత పతకం సాధించి సత్తా చాటింది. అలాగే అండర్--18 విభాగంలో జరిగిన 100 మీటర్ల పరుగుపందెంలో శ్రీనిధి స్వర్ణ పతకం సాధించి విజేతగా నిలిచింది. తక్కువ సమయంలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించడం పట్ల విద్యార్థినుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోనూ క్రీడా ప్రతిభకు కొదవ లేదని ఈ విజయాలు మరోసారి నిరూపించాయి. సరైన శిక్షణ, ప్రోత్సాహం లభిస్తే భిక్కనూర్ ప్రాంతానికి చెందిన విద్యార్థులు మండల, జిల్లా స్థాయిలతో పాటు రాష్ట్ర స్థాయిలోనూ మరింతగా రాణించే అవకాశం ఉందని పలువురు పేర్కొన్నారు. విద్యార్థినుల విజయానికి కృషి చేసిన పీడీ నర్సింహారెడ్డి, కోచ్ దేవుని భరత్ను పలువురు అభినందించారు. భవిష్యత్ పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతోపాల్గొనిమరిన్నివిజయాలుసాధించాలని ఆకాంక్షించారు. విజేతలకు అభినందనలుమండల స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన మనుశ్రీ, శ్రీనిధిని పలువురు అభినందించారు. విద్యార్థినుల కృషి, పట్టుదల ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.



# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్**

**భిక్నూర్ ఆగస్టు 29:**



అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. భిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అర్హత ఉన్న ఏ కుటుంబం కూడా సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సులభంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు తమకు అందుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేసేలా చర్యలు తీసుకుంటున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పథకాల అమలుజరిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి గ్రామ సర్పంచ్ షాపూర్ రాణి రాజు పాల్గొని లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ప్రజల జీవితాల్లో మార్పుతీసుకురావడానికిదోహదపడుతున్నాయనిఆయనపేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103